తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

# జనంసాక్షి

Estd : 2002

www.janamsakshi.org

ఆదివారం 02.08.2026 | సంపుటి :13 సంచిక : 13 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి 98483 28698

సామాన్యుని స్వరం జనంసాక్షి tv JANAMSAKSHI TV

## ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ ధర ఎక్కువ

# జేబుకు చిల్లు.. వాహనాలకు గొల్లు




### ఈ20పై ప్రభుత్వ శాఖల భిన్న ప్రకటనలతో ప్రజల్లో గందరగోళం

ప్రపంచ దేశాలు ఎలక్ట్రిక్ వాహనాలు, గ్రీన్ హైడ్రోజన్, స్వచ్ఛ ఇంధన సాంకేతికతలతో భవిష్యత్ రవాణాకు బాటలు వేస్తుంటే, భారత్‌లో మాత్రం ఈ20 (20 శాతం ఎథనాల్ మిశ్రమం) పెట్రోల్ చుట్టూ అయోమయం, అనుమానాలు, వివాదాలు ముదురుతున్నాయి. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం ఈ20నే భవిష్యత్ ఇంధనమని ప్రచారం చేస్తుండగా, మరోవైపు ప్రభుత్వంలోని వివిధ శాఖలు, వాహన తయారీ సంస్థలు ఇస్తున్న భిన్నమైన సూచనలు లక్షలాది మంది వాహనదారులను సందిగ్ధంలోకి నెట్టాయి. ప్రపంచ దేశాలతో ఉన్న ఈ వ్యత్యాసంతో దేశవ్యాప్తంగా ప్రస్తుతం తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

#### ధర ఎక్కువ... భరోసా ఎక్కడ?

ఎథనాల్ మిశ్రమ పెట్రోల్‌కు అధిక ధర చెల్లిస్తున్న వినియోగదారుడికి తన వాహనంపై దీర్ఘకాల ప్రభావం ఏమిటి? వారంటీ పరిస్థితి ఏమిటి? బీమా పరిరక్షణ ఎలా ఉంటుంది? అనే ప్రశ్నలకు ఇప్పటికీ సమగ్ర సమాధానం లేదు. ప్రజలు చెల్లించేది డబ్బు మాత్రమే కాదు... విశ్వాసం కూడా. ఆ విశ్వాసానికి ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాల్సిన అవసరం ఉంది. చమురు దిగుమతుల తగ్గింపు, రైతులకు ఆదాయం, కాలుష్య నియంత్రణ వంటి లక్ష్యాలను ప్రభుత్వం చెబుతోంది. అయితే అదే సమయంలో వాహనదారుల సందేహాలను నివృత్తి చేయడంలో కనిపిస్తున్న ఆలస్యం విధానంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈ20పై కేంద్ర ప్రభుత్వం, వాహన తయారీ సంస్థలు, బీమా కంపెనీలు ఒకే వేదికపైకి వచ్చి స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయాలి. ఏ వాహనాలకు ఈ20 అనుకూలం? ఏవికి కాదు? వినియోగదారుల హక్కులు ఏమిటి? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలి. సందేహాలు తొలగితేనే విశ్వాసం పెరుగుతుంది. విశ్వాసం పెరిగితేనే విధానం విజయవంతమవుతుంది. లేకపోతే దీనిపై నెలకొన్న వివాదాలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని వినియోగదారుల వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

- ప్రపంచమంతా ఎలక్ట్రిక్‌వైపు.. భారత్‌లో మాత్రం ఈ20పై ఇంకా వివాదాలే..!!
- అన్ని వాహనాలకూ అనుకూలమేనా అనే ప్రశ్నలకు స్పష్టత కరువు
- నిర్బంధంగా ఈ విధానాలు అమలుచేస్తే అంసతృప్తి పెరుగుతుందనే హెచ్చరికలు




**హైదరాబాద్, ఆగస్టు 1 (జనంసాక్షి) :** ఈ 20 పెట్రోల్ వినియోగంతో వాహన ఇంజన్లు దెబ్బతింటున్నాయని, మైలేజ్ పడిపోతోందని, నిర్వహణ ఖర్చులు పెరుగుతున్నాయని వాహనదారులు, ఆటోమొబైల్ నిపుణులు గగ్గోలు పెడుతున్నారు. అంతకంటే ఆందోళనకరమైన విషయం ఏమిటంటే ఈ20కి అనుకూలంగా రూపొందించని పాత మోడల్ వాహనాలకు ఈ ఇంధనం వాడితే వారంటీ, బీమా క్లెయిమ్‌లు వర్తించవని కొన్ని కంపెనీలు స్పష్టం చేయడం. అంటే ప్రభుత్వ విధానం వల్ల నష్టపోతే, నష్టపరిహారం కూడా రాదన్నమాట! 2018, 2020 లేదా అంతకంటే ముందు కొనుగోలు చేసిన ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాల యజమానులు ఎక్కువగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సామాన్య వాహనదారుడు ఇరుకున పడే ఈ పరిస్థితిపై కేంద్రం ఇప్పటికీ మౌనం వహించడం ఆగ్రహాన్ని మరింత రగిలిస్తోంది. పాత మోడల్ వాహనాలకు ప్రత్యేక జాగ్రత్తలు అవసరమని తయారీ సంస్థలు సూచిస్తున్నాయి. దీంతో ప్రభుత్వాన్ని నమ్మాలా? వాహన కంపెనీలను నమ్మాలా? అన్న ప్రశ్నలు రేకెత్తుతున్నాయి.

#### స్పష్టత లేకపోతే నష్టమే ఎక్కువ..?

ఇథనాల్ మిశ్రమ ఇంధనం వల్ల దిగుమతి చమురుపై ఆధారాన్ని తగ్గించడం, రైతులకు చెరకు వంటి పంటలకు మార్కెట్ కల్పించడం, కార్బన్ ఉద్గారాలను తగ్గించడం వంటి ప్రయోజనాలు ఉన్నాయని ఒక వర్గం వాదిస్తోంది. కానీ ఆ ప్రయోజనాల భారాన్ని సామాన్య వాహనదారుడి భుజాలపైనే మోపడం సబబేనా అన్నదే అసలు ప్రశ్న. వాహనాల అనుకూలత, నిర్వహణ ఖర్చులు, బీమా భద్రతపై స్పష్టమైన, పారదర్శక మార్గదర్శకాలు లేకుండా ఇథనాల్ మిశ్రమాన్ని బలవంతంగా రుద్దడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని వినియోగదారుల సంఘాలు గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి. ఆటోమొబైల్ రంగ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇంధన విధానాల్లో మార్పులు తీసుకొచ్చేటప్పుడు కేవలం పర్యావరణ ప్రయోజనాలు చెప్పడం సరిపోదు. వినియోగదారులపై పడే ఆర్థిక భారం, వాహనాల అనుకూలత, నిర్వహణ వ్యయం, వారంటీ వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాల్సిందే. లేకపోతే మంచి ఉద్దేశంతో తీసుకొచ్చిన విధానంపైనా ప్రజల్లో వ్యతిరేక భావన ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

## ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి భోగాపురం రన్‌వే

అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభించిన ప్రధాని మోదీ

- డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి పథం
- ఏపీ వేగంగా దూసుకుపోతోందని ప్రధాని కితాబు



**భోగాపురం, ఆగస్టు 1 (జనంసాక్షి) :** రాత్రింబవళ్లు కష్టపడి పరిశ్రమలను ఆకర్షించేందుకు సీఎం చంద్రబాబు చేస్తున్న కృషి ఫలితంగానే రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వస్తున్నాయని ప్రధాని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డబుల్ ఇంజిన్ సర్కార్‌లో కీలక భాగస్వాములుగా ఉన్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లతో సమన్వయం చేసుకుంటూ పని చేస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. పెట్టుబడులు?ఉపాధి అభివృద్ధి అనే లక్ష్యంతోనే ఎన్డీఏ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రధాని అన్నారు. పెట్టుబడులు పెరిగితే ఉత్పత్తి పెరుగుతుందని, ఉత్పత్తి పెరిగితే ఎగుమతులు పెరుగుతాయని, ఎగుమతులు పెరిగితే ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని, చివరికి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. అదే అభివృద్ధి నమూనాను ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్నామని తెలిపారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం వేగవంతమైన అభివృద్ధి దిశగా దూసుకుపోతోందని ప్రధాని మోదీ ప్రశంసించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ టెర్మినల్‌ను ప్రారంభించిన అనంతరం చెక్-ఇన్ హాల్, ఆధునిక ప్రయాణికుల సదుపాయాలు, సాంకేతిక వ్యవస్థలను పరిశీలించారు. విమానాశ్రయ మాస్టర్ ప్లాన్, ఏవియేషన్ హబ్, ఏవియేషన్ ఎడ్యుసిటీ నమూనాలను జీఎంఆర్ ప్రతినిధులు వివరించారు. మిగతా 2లో..

## ఉప్పల్ చెరువును హైడ్రాయే కాపాడింది

- ప్రజాప్రయోజనాల కోసమే హైడ్రా
- నల్ల చెరువు పునరుద్ధరణపై సిఎం రేవంత్ హర్షం





**హైదరాబాద్,ఆగస్టు 1 (జనంసాక్షి) :** చెరువుల పునరుజ్జీవంతో రూపురేఖలు మారుతున్న మన హైదరాబాద్‌ను చూడటం ఎంతో సంతృప్తి నిచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నగరంలోని చెరువులకు జీవం పోస్తూ, భావి తరాల కు మెరుగైన భవిష్యత్తును అంకితం చేస్తున్న హైడ్రా పనితీరును ఆయన అభినందించారు. ఉప్పల్ నల్ల చెరువు పునరుజ్జీవానికి అహర్నిశలు శ్రమించిన హైడ్రా అధికారులకు, సిబ్బందికి సీఎం రేవంత్ రెడ్డి తన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. చెరువులను పరిరక్షించడం అంటే కేవలం నీటి వనరులను కాపాడటం మాత్రమే కాదని, అది భావి తరాల భవిష్యత్తును భద్రపరచడమేనని ఆయన స్పష్టం చేశారు. ప్రతి చెరువును కంటికి రెప్పలా కాపాడుకుంటూ.. ప్రతి అంగుళం ప్రజా ఆస్తిని సంరక్షిస్తూ తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందని సీఎం చెప్పారు. నగరంలోని జలవనరుల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

**ఉప్పల్ నల్ల చెరువుకు మహర్దశ :** హైడ్రా చేపట్టిన సమగ్ర పునరుద్ధరణ పనుల ఫలితంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువు వరద నీటితో నిండిపోయి మిగతా 2లో..

### కాళేశ్వరంతో సంబంధం లేకుండానే

## ఎల్లంపల్లిని నింపాం

### గోదావరి జలాల వినియోగంపై సమగ్ర అధ్యయనం చేస్తున్నాం

- రాష్ట్ర ప్రాజెక్టుల్లో జలకళ సంతరించుకుంది
- రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి
- ఎల్లంపల్లి రిజర్వాయర్‌ను సందర్శించిన మంత్రులు దుద్దిళ్ల, వివేక్, అడ్లూరితో కలిసి సందర్శన



**గోదావరిఖని ఆగస్టు 1 (జనంసాక్షి) :** ఉత్తర తెలంగాణ రైతులకు గరిష్టంగా సాగునీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, అందుకు గోదావరి నదిపై నిర్మితమైన వివిధ ప్రాజెక్టులను పరిశీలిస్తూ నీటి లభ్యత, ప్రవాహ పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేస్తున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం అంతర్గాం మండలంలోని ఎల్లంపల్లి రిజర్వాయర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు,కార్మిక శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, 1963లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేశారని, 1959లో కడెం ప్రాజెక్టుకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే శంకుస్థాపన జరిగిందన్నారు. 2004 జూలై 28న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన ప్రాజెక్టులు దశాబ్దాలుగా రైతులకు సాగునీరు అందిస్తుండగా, గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలు దెబ్బతిన్నాయని విమర్శించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో మెజారిటీ పనులు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని, ఈ ప్రాజెక్టుకు దివంగత శ్రీపాదరావు పేరు పెట్టడం జరిగిందని తెలిపారు. ఎల్లంపల్లి రిజర్వాయర్ అప్పటి ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో మిగతా 2లో..



### నామినేటెడ్ పోస్టుల

## భర్తీ షురూ

### దరఖాస్తు చేసుకోండి : మంత్రి తుమ్మల

రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ పూర్తిస్థాయిలో డిజిటలీకరణ

**హైదరాబాద్, ఆగస్టు 1(జనంసాక్షి) :** తెలంగాణలో నామినేటెడ్ పోస్టుల భర్తీ పక్రియ ప్రారంభమైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సీఎం నిర్ణయాలకు అనుగుణంగా నియామకాలు జరుగుతాయన్నారు. ఆశావహులు తమ పేర్లను పీసీసీకి పంపాలని సూచించారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఛైర్మన్ల నియామకాలు త్వరలో చేపడతామన్నారు. వివిధ నామినేటెడ్ పోస్టుల భర్తీని దశలవారీగా పూర్తి చేస్తామని, సహకార సంఘాల పాలకవర్గాల పోస్టులను కూడా భర్తీ చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖను పూర్తిస్థాయిలో డిజిటలీకరించి పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దాలని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలు, పత్తి కొనుగోళ్ల సన్నద్ధత, మార్కెట్ యార్డుల అభివృద్ధిపై శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని 206 మార్కెట్ కమిటీలను పూర్తిస్థాయిలో ఆటోమేషన్ చేయాలని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికలు, టెండర్ పక్రియలను ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేసి, సెప్టెంబర్ నుంచి అమలు ప్రారంభించాలని సూచించారు. ప్రతి మార్కెట్ యార్డులో సీసీ కెమెరాలు, ఎలక్ట్రానిక్ వెయింగ్ స్కేల్స్, మిగతా 2లో..

### జన్ జీ చేతిలో

## దేశ భవిష్యత్

ఎవరితో పెట్టుకోవద్దో.. మోడీ వారితోనే పెట్టుకున్నాడు

- వాట్సప్ అంకుల్స్.. ఇన్‌స్టా పిల్లల్లో ఎవరు గెలిచారో చూశాం
- బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



**హైదరాబాద్, (జనంసాక్షి) :** యువతరం కొత్త తరహాలో దిల్లీలో కదం తొక్కిందని బీఆర్‌ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ప్రధాని మోదీ ఎవరితో పెట్టుకోవద్దో వారితోనే పెట్టుకున్నారని చెప్పారు. వాట్సాప్ అంకుల్స్.. ఇన్‌స్టా పిల్లల్లో ఎవరు గెలిచారో చూశాం. అర్ధరాత్రి ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్టు చేశారు. సోషల్ మీడియా లేకపోతే జవాబుదారీతనం వచ్చేది కాదు. వచ్చే ఎన్నికల్లో 50 శాతంపైగా జెన్‌జీలు ఓట్లు వేయబోతున్నారు. 18 నుంచి 24 ఏళ్ల మధ్య పిల్లలు పేపర్లు, టీవీలు చూడటం లేదు. నేటి యువత న్యూస్‌ను రీల్స్ రూపంలో చూస్తోందని కేటీఆర్ అ న్నారు. తెలంగాణలోనే ఎన్నో సంద ర్భాల్లో వార్తను వార్తలా రాయలేని పరిస్థితి లేదా..? ఒక అమ్మాయి మీద లైంగిక దాడి జరిగింది.. కేంద్ర మంత్రి కుమారుడు ఈ దుర్మార్గమైన పని చేశాడని ఆ అమ్మాయి తల్లీదండ్రులు వచ్చి ఫిర్యాదు చేస్తే వారం రోజులు ఏ మీడియా రిపోర్ట్ చేసింది..? సోషల్ మీడియానే లేకపోతే ఆ అమ్మాయికి న్యాయం జరిగే పరిస్థితి ఉందా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. నవ తెలంగాణ దినపత్రిక 11వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న సెమినార్‌లో 'రాజ్యాంగం ? ప్రజాస్వామ్యం ? పత్రికా స్వేచ్ఛ' అంశంపై కేటీఆర్ మిగతా 2లో..


## అసైన్డ్ భూములపై సమగ్ర విధానం

### పేదల భూములు మింగిన పెద్దల చేత కక్కిస్తాం

- ధరణి అక్రమాలపై ఉక్కుపాదం మోపుతాం : మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- అక్రమాల బట్టబయలుకు ఫాస్ట్‌ట్రాక్ విచారణ చేస్తామని వెల్లడి
- కేంద్రం నిధులు ఇవ్వకపోయినా ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు చెల్లిస్తాం : మంత్రి



**హైదరాబాద్,ఆగస్ట్ 1 (జనంసాక్షి) :** ధరణి అక్రమాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ధరణి నుంచి భూభారతి వరకు లావాదేవీలపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. పేదల భూములను కాజేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. నిషేధిత జాబితాలో కొత్తగా అంగుళం భూమి కూడా మిగతా 2లో..




### కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్‌కు

## పతకాల పంట

మరో రెండు బంగారు పతకాలు కైవసం

**గాస్గో (జనంసాక్షి) :** కామన్ వెల్త్ గేమ్స్‌లో భారత్‌కు పతకాల పంట పండుతోంది. తాజాగా దేశానికి మరో స్వర్ణపతకాలు వచ్చాయి. మహిళ బాక్సింగ్‌లో ప్రీతి పవార్, జైస్మిన్ లాంబోరియా గోల్డ్ మెడల్స్ సాధించారు. 54 కేజీల విభాగంలో ప్రీతి గోల్డ్ మెడల్ సాధించగా, 57 కేజీల విభాగంలో జైస్మిన్ సైతం పసిడి పతకం సాధించింది. దీంతో ఇప్పటి వరకు భారత్‌కు కామన్వెల్త్ క్రీడల్లో భారత్‌కు వచ్చిన పతకాల సంఖ్య ఏడుకు చేరుకుంది. ఇదిలా ఉంటే కామన్ వెల్త్ మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
2 ఆగస్టు 2026

# కాళేశ్వరంతో సంబంధం లేకుండానే ఎల్లంపల్లిని నింపాం

అంతర్భాగంగా ఉండేదని, ఇక్కడి నీటిని కాళేశ్వరం నీరుగా ప్రచారం చేయడం సరికాదన్నారు. ఈ ప్రాజెక్టును అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ పలు కారణాల వల్ల సాధ్యపడలేదన్నారు. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) మూడు బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయవద్దని లిఖితపూర్వకంగా సూచించిందని తెలిపారు. ఇటీవల జరిగిన సాంకేతిక సమావేశంలో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), ఎన్‌డీఎస్‌ఏ అధికారులు కూడా నిపుణుల కమిటీ సూచనల మేరకు పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారని పేర్కొన్నారు.
డీపీఆర్ ప్రకారం షీట్‌పైల్ ఫౌండేషన్ నిర్మించాల్సి ఉండగా స్కాంట్ పైల్ ఫౌండేషన్ నిర్మించారని, మూడు బ్యారేజీల పునాదుల నాణ్యతపై నిపుణులు అభ్యంతరాలు వ్యక్తం చేశారని తెలిపారు. గత రెండు నెలలుగా ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం, అంతర్జాతీయ నిపుణుల కమిటీ సూచనల మేరకు మూడు బ్యారేజీల పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరు వరకు గంట గంటకు నీటిని ఎత్తిపోస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం నీటిపారుదల రంగంపై రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికీ దేవాదుల, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో పూర్తి చేయలేదని



విమర్శించారు. ఉత్తర తెలంగాణ రైతుల ప్రయోజనాలే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న మంత్రి, గత 34 నెలలుగా కాళేశ్వరం మూడు బ్యారేజీల నుంచి ఒక్క చుక్క నీటిని కూడా ఎత్తిపోకపోయినా, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించి 340 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి సాధించామని, 150 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు రూ.80 వేల కోట్లకు పైగా చెల్లింపులు చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ శ్రీరాంసాగర్, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టులను సందర్శించి ప్రస్తుత జలస్థితిని పరిశీలించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రకృతి అనుగ్రహంతో మంచి వర్షాలు కురిసి ప్రాజెక్టులు నిండుతున్నాయని, రైతులకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిస్థితులను వివరించి ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పిస్తోందన్నారు. కాళేశ్వరం బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయడానికి ఎన్‌డీఎస్‌ఏ అనుమతించలేదని, దీనిపై అనవసర రాజకీయాలు చేయడం సరికాదన్నారు. ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరు వరకు నీటి తరలిం పు పనులు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాది ంచిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగమేనని, మిడ్ మానేరు, ఫ్లడ్ ఫ్లో కాలువ కూడా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిర్మించబడినవేనని పేర్కొన్నా రు. కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లా డుతూ, కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలు నాసిరకంగా నిర్మించడం తోనే దెబ్బతిన్నాయని అన్నారు. గురుత్వాకర్షణ ద్వారా నీరు వచ్చే అవకాశమున్నప్పటికీ భారీ ఎత్తిపోతల ద్వారా వేల కోట్ల రూపాయల విద్యుత్ వ్యయం జరిగేలా ప్రాజెక్టు రూపొందించారని విమర్శించారు. నీటిపారుదల రంగంలో తుగ్లక్ నిర్ణయాలతో లక్షల కోట్ల రూపాయలు వృథా అయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్‌కుమార్, గడ్డం వినోద్‌కుమార్, వెడ్మ బొజ్జు, మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# విద్వేష ప్రసంగాల నిరోధానికి చట్టం

**రెచ్చగొట్టే వ్యాఖ్యలు, క్రైం బిల్లుపై సెలక్ట్ కమిటీ చర్చ**

- **వారం రోజుల్లో మరోసారి భేటీ**
- **అన్ని వర్గాల అభిప్రాయాలతో అసెంబ్లీలో బిల్లు**
- **భావప్రకటన స్వేచ్ఛకు భంగం ఉండదన్న మంత్రి పొన్నం**



హైదరాబాద్, ఆగస్టు 1 (జనంసాక్షి) :
తెలంగాణ అసెంబ్లీలో విద్వేషపూరిత ప్రసంగాలను నియంత్రించేందుకు రూపొందిస్తున్న బిల్లుపై సెలెక్ట్ కమిటీ చర్చలు వేగం పుంజుకున్నాయి. అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్ లో శనివారం సెలెక్ట్ కమిటీ సమావేశం మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. రెచ్చగొట్టే వ్యాఖ్యలు, విద్వేష ప్రసంగాల నిరోధానికి సంబంధించిన బిల్లుపై సభ్యులతో విస్తృతంగా చర్చించారు. వర్షాకాల సమావేశా లు ముగిసేలోపు కమిటీ నివేదిక సమర్పించేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశానికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు కమిటీ సభ్యులు దానం నాగేందర్, మధుసూదన్ రెడ్డి, యశస్విని రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, కోవా లక్ష్మి, కూనంనేని సాంబశివరావు, మాణిక్‌రావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హేట్ స్పీచ్ బిల్లు ప్రతులను మరోసారి సభ్యులకు అందజేశారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, వారం రోజుల్లో మరోసారి కమిటీ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. తదుపరి సమావేశంలో సభ్యుల సూచనలు, అభిప్రాయాలను సేకరించి నివేదికకు తుది రూపం ఇస్తామని చెప్పారు. అసెంబ్లీలో విద్వేషపూరిత ప్రసంగాలను అరికట్టేలా చట్టాన్ని తీసుకురావడమే కమిటీ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలతో పాటు సమాజంలోని ప్రముఖుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని మంత్రి తెలిపారు. వ్యక్తుల గౌరవాన్ని పరిరక్షించేలా, అదే సమయంలో భావప్రకటన స్వేచ్ఛకు ఎలాంటి భంగం కలగకుండా కమిటీ సిఫారసులు రూపొందిస్తామని ఆయన వెల్లడించారు.

## ఉప్పల్ చెరువును హైడ్రాయే కాపాడింది

మళ్లీ జీవం పోసుకుంది. హైడ్రా చేపట్టిన పునరుద్ధరణలో భాగంగా వరద నీరు చెరువులోకి చేరేలా ప్రత్యేక డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసింది. అదే సమయంలో మురుగు నీరు చెరువులోకి రాకుండా ప్రత్యేక బైపాస్ కాలువను నిర్మించింది. దీంతో భారీ వర్షాల సమయంలో వరద నీరు సురక్షితంగా చెరువులోకి చేరుతుండగా, ఎగువ ప్రాంతాల్లో నీటి నిల్వ, ముంపు సమస్యలు గణనీయంగా తగ్గాయి. పునరుద్ధరణలో భాగంగా 10 ఎకరాలకు పైగా ఆక్రమణలను తొలగించి, చెరువు విస్తీర్ణాన్ని దాదాపు 70 ఎకరాలకు పునరుద్ధరించారు.

# జాతీయత నిర్ధారణ తర్వాతే విదేశీయుల డిపోర్టేషన్

- **సుప్రీంకోర్టుకు కేంద్రం స్పష్టీకరణ**
- **సంబంధిత దేశ ధృవీకరణ తప్పనిసరి**

న్యూఢిల్లీ, ఆగస్టు 1(జనంసాక్షి) : విదేశీయులను వారి స్వదేశాలకు పంపించే (డిపోర్టేషన్) ప్రక్రియలో జాతీయత నిర్ధారణ అత్యంత కీలకమని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది. సంబంధిత వ్యక్తి ఏ దేశానికి చెందినవారో ఆ దేశ ప్రభుత్వం అధికారికంగా ధృవీకరించిన తర్వాతే బహిష్కరణ సాధ్యమవుతుందని తెలిపింది. జాతీయతను ఆయా దేశాలు నిర్ధారించకపోతే డిపోర్టేషన్ అమలు చేయడం సాధ్యం కాదని పేర్కొంది.
అస్సాంలో విదేశీయులుగా ప్రకటించిన వ్యక్తులను బహిష్కరించకుండా నిర్బంధంలో ఉంచడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఈ వివరాలను సుప్రీంకోర్టుకు వెల్లడించింది. ఒక విదేశీయుడిపై విధించిన శిక్ష పూర్తవడం లేదా కోర్టు విచారణలు ముగియడం, అతని వద్ద చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టు లేదా ప్రయాణ పత్రాలు ఉండడం, ఇతర క్రిమినల్ కేసులు పెండింగ్‌లో లేకపోవడం వంటి అన్ని నిబంధనలు నెరవేరిన తర్వాతే బహిష్కరణ చేపట్టవచ్చని కేంద్రం వివరించింది. అంతేకాకుండా సంబంధిత దేశ రాయబార కార్యాలయం నుంచి జాతీయత ధృవీకరణ పత్రం తప్పనిసరిగా పొందాల్సి ఉంటుందని పేర్కొంది.

ఇదిలా ఉండగా, గత ఏడాది నుంచి ఇప్పటివరకు అమెరికా నుంచి మొత్తం 4,840 మంది భారతీయులను స్వదేశానికి పంపించినట్లు ఇటీవల విదేశాంగ శాఖ వెల్లడించింది. అలాగే రష్యా సైన్యంలో ఇంకా 24 మంది భారతీయులు ఉన్నట్లు గుర్తించామని, వారిని స్వదేశానికి తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయని తెలిపింది. ప్రభుత్వ ప్రయత్నాలతో ఇప్పటికే 139 మంది భారతీయులను రప్పించినట్లు వెల్లడించింది.

## ఆపరేషన్ 'ముస్కాన్'తో 664 మంది చిన్నారులకు విముక్తి

హైదరాబాద్, ఆగస్టు 1(జనంసాక్షి) : సైబరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో జూలై నెలంతా నిర్వహించిన 'ఆపరేషన్ ముస్కాన్' విజయవంతంగా ముగిసింది. జూలై 1 నుంచి 31 వరకు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో మొత్తం 664 మంది చిన్నారులను రక్షించారు. వీరిలో 644 మంది బాలురు, 20 మంది బాలికలు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

# భారత్‌లో చెత్తగా.. విదేశాల్లో నీట్‌గా ఉంటారా..?

**రోడ్లపై చెత్త, ఉమ్మివేసే వారిపై బాంబే హైకోర్టు ఆగ్రహం**

- పరిశుభ్రత ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యత అని స్పష్టం
- ప్రభుత్వం, మున్సిపల్ అధికారులకు అవగాహన కార్యక్రమాల ఆదేశం
- వారం రోజుల్లో చర్యలు తీసుకోవాలని సూచన



ముంబయి, ఆగస్టు 1(జనంసాక్షి) : దేశంలో రోడ్లపై చెత్త వేయడం, బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయడం వంటి అలవాట్లపై బాంబే హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ముంబయిలోని డంపింగ్ యార్డుల కాలుష్యం, విషవాయువులకు సంబంధించిన పిటిషన్ల విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. దేశంలో ఇష్టానుసారంగా చెత్త పారవేసే వారు విదేశాలకు వెళ్లినప్పుడు మాత్రం అత్యంత పరిశుభ్రత పాటిస్తారని, అక్కడ చిన్న చాక్లెట్ కవర్‌ను కూడా బయట పడేయడానికి వెనుకాడతారని వ్యాఖ్యానించింది. వీధులు, ఖాళీ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోకుండా చూడటంలో ప్రజలతో పాటు స్థానిక సంస్థలకూ సమాన బాధ్యత ఉందని న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్రజల్లో పరిశుభ్రతపై విస్తృత అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపల్ అధికారులను ఆదేశించింది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యత అని, ఆ బాధ్యతను నిర్వర్తించే వారికే పరిశుభ్రమైన వాతావరణాన్ని కోరుకునే నైతిక హక్కు ఉంటుందని పేర్కొంది.
రోడ్లపై చెత్త వేయడం, ఉమ్మివేయడం వంటి చర్యలు ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పుగా మారుతున్నాయని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రధాన రహదారులు, వీధుల్లో పేరుకుపోతున్న చెత్త వల్ల అంటువ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని పేర్కొంది. హైకోర్టు భవనంతో పాటు నగరంలోని వారసత్వ కట్టడాల పరిసరాల్లో చెత్త నిర్వహణ సరిగా లేకపోవడంపై కూడా న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. మున్సిపల్ వాహనాల అస్తవ్యస్త నిర్వహణ కారణంగా దేశీయ, విదేశీ పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. ఈ పరిస్థితిని వెంటనే సరిచేసి, వారం రోజుల్లోగా తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను బాంబే హైకోర్టు ఆదేశించింది.

# ఇరాన్ 'ఎనర్జీ'పై టార్గెట్

**మళ్లీ అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు..?**

- **పవర్ ప్లాంట్లు, రిఫైనరీలపై దాడుల పరిశీలన అన్న అంతర్జాతీయ మీడియా కథనాలు**
- **ట్రంప్ క్యాబినెట్‌లో చర్చ జరిగినట్లు ప్రచారం**
- **అమెరికాకు ఇరాన్ హెచ్చరిక.. ప్రతిదాడులు తప్పవని స్పష్టం**

అమెరికా, ఆగస్టు 1(జనంసాక్షి) :
పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి పెరిగే సంకేతాలు కనిపిస్తున్నాయి. హర్మూజ్ జల సంధిలో ఇరాన్ చర్యలు, అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ ఇంధన, విద్యుత్ మౌలిక సదుపాయా లపై అమెరికా దాడులకు సిద్ధమవుతోందన్న వార్తలు అంతర్జాతీయ మీడియాలో వెలువడ్డా యి. ఈ చర్యల్లో ఇజ్రాయెల్ కూడా భాగ స్వామి కావచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నా యి. అమెరికా అధికారులను ఉటంకిస్తూ వెలువడిన కథనాల ప్రకారం.. ఇరాన్‌లోని కీలక పవర్ ప్లాంట్లు, చమురు రిఫైనరీలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేపట్టే అవకాశా లను అమెరికా పరిశీలిస్తున్నట్లు సమాచారం. టెహ్రాన్ సైనిక కార్యకలాపాల సామర్థ్యాన్ని దెబ్బతీయడమే ఈ ప్రతిపాదిత చర్యల ఉద్దేశ మని పేర్కొంటున్నాయి. అంతర్జాతీయ మార్కె ట్లు ప్రారంభమయ్యేలోపు ఈ ఆపరేషన్ నిర్వహించే అంశంపైనా అంతర్గత స్థాయిలో చర్చలు జరిగినట్లు సమాచారం. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక నిర్ణయం వెలువడలేదని తెలుస్తోంది. ఈ ప్రతిపాదిత చర్యలకు సంబంధించిన సమాచారాన్ని అమెరికా ఎప్పటికప్పుడు ఇజ్రాయెల్‌తో పంచుకుంటున్నట్లు కూడా కథనాలు పేర్కొన్నాయి. అయితే మరోసారి పూర్తిస్థాయి సైనిక చర్యలో



పాల్గొనే అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఇజ్రాయెల్ వర్గాలు తెలిపినట్లు సమాచారం. తమను యుద్ధంలో పాల్గొనాలని ఎవరూ అధికారికంగా కోరలేదని కూడా అవి పేర్కొన్నట్లు వార్తలు వెల్లడించాయి. ఇదిలా ఉండగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షతన జరిగిన తాజా క్యాబినెట్ సమావేశంలో ఈ అంశం చర్చకు వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. వైట్ హౌస్‌లోని కొందరు అధికారులు సైనిక చర్యపై అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ, ట్రంప్ మాత్రం ఇరాన్‌పై కఠిన వైఖరినే కొనసాగించాలని సూచించినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. మరోవైపు, అమెరికా చేపట్టే ఏకపక్ష చర్యలకు తగిన ప్రతిస్పందన తప్పదని ఇరాన్ హెచ్చరించింది. తమ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు జరిగితే గట్టి ప్రతిదాడులు చేపడతామని స్పష్టం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో పశ్చిమాసియా పరిస్థితులు మరోసారి ఉద్రిక్తంగా మారే అవకాశాలపై అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.



## ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి
# భోగాపురం రన్‌వే

టెర్మినల్‌లో ఏర్పాటు చేసిన భారీ వీడియో వాల్‌లో ప్రదర్శించిన ఉత్తరాంధ్ర చరిత్ర, ప్రముఖ పుణ్యక్షేత్రాలు, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానమంత్రికి వివరించారు. విమానాశ్రయ ప్రాంగణంలోని తెలుగు కళా సంపదను ప్రతిబింబించే కళాఖండాలను ప్రధాని ఆసక్తిగా తిలకించారు. టెర్మినల్ నుంచి ఓపెన్‌టాప్ జీపులో సభా వేదికకు చేరుకునే మార్గం మధ్యలో గిరిజన మహిళలు.. విద్యార్థినులు చేసిన థింసా నృత్యంతో ప్రధాని నరేంద్ర మోదీకి స్వాగత పలికారు. సభా ప్రాంగణానికి చేరుకున్న ప్రధానమంత్రికి ప్రజలు జాతీయ జెండాలు ఊపుతూ కరతాళధ్వనులతో స్వాగతం పలికారు. సభా వేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పొందూరు ఖాదీ శాలువాతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఘనంగా సత్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కలిసి ఉత్తరాంధ్ర కళా వైభవానికి ప్రతీక అయిన బొబ్బిలి వీణను ప్రధానమంత్రికి జ్ఞాపికగా అందజేశారు. ఓపెన్ టాప్ జీపులో ప్రధాని మోదీ వెంట ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఉన్నారు. వేదికపై గవర్నర్ అబ్దుల్ నజీర్, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస వర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## జన్ జీ చేతిలో దేశ భవిష్యత్

ప్రసంగించారు. లగచర్లలో గిరిజనుల మీద అకృత్యాలు జరిగితే ఏ మీడియా రాసింది.. నేను ఈ మాట అంటున్నందుకు దయచేసి ఎవరూ ఏం అనుకోవద్దు.. వాస్తవాలు చెబితే చేదుగానే ఉంటాయి. ఈ రోజున్న పరిస్థితుల్లో డైరెక్టుగా శాసనసభలో, బయట ప్రభుత్వంలో ఉన్న పెద్దలు జర్నలిస్టుల పట్ల అసహనం వ్యక్తం చేస్తే కూడా ఏ మీడియా ప్రశ్నించింది.. ? హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల భూమి విషయంలో విద్యార్థులు కదం తొక్కే దాకా ఏ మీడియా రాసింది..? ఎక్కడుంది పరిశోధనాత్మక జర్నలిజం.. ఉందా..? నేను ఈ మాట అంటే మీలో చాలా మందికి మళ్లీ నాలో అహంకారం కనబడొ చ్చు. నేను ఉన్నది ఉన్నట్టుగా అడుగుతున్నా.. ఉన్నదా రాసే పరిస్థితి.. చెప్పే పరిస్థితి ఉన్నదా..? అందరి ముందటే అడుగుతున్నా స్వేచ్ఛగా, నిర్భీతిగా కథనాలు వస్తున్నాయా? వాస్తవాలు చెబితే నచ్చవన్నారు.

# క్షమాపణలు కాదు.. కేసుల ఉపసంహరణపై మాట్లాడండి

- **ప్రధాని వ్యాఖ్యలపై అభిజిత్ దీప్కే స్పందన**
- **విద్యార్థులపై నమోదైన కేసులపై ప్రశ్నలు**
- **'రెండు రకాల చట్టాలా?' అంటూ విమర్శ**



న్యూఢిల్లీ, ఆగస్టు 1(జనంసాక్షి) : విద్యార్థులను క్షమిస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన నేపథ్యంలో, కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యార్థులను క్షమిస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన నేపథ్యంలో, కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. క్షమాపణలు ప్రకటించడం మాత్రమే కాకుండా, విద్యార్థులపై నమోదైన కేసులను కూడా ఉపసంహరిం చుకుంటారా అని సామాజిక మాధ్యమాల వేదికగా ప్రశ్నించారు. ఇటీవల ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల్లో కొందరు ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ ఘటనపై స్పందించిన ప్రధాని, ఇన్‌స్టాగ్రామ్‌లో విడుదల చేసిన వీడియోలో తనను, తన తల్లిని దూషించిన వారిని తాను క్షమిస్తున్నానని పేర్కొన్నారు. వారిని శిక్షించడం కంటే సరైన మార్గంలో నడిపించడం సమాజ బాధ్యత అని వ్యాఖ్యానించారు. ఈ వీడియోపై స్పందించిన అభిజిత్ దీప్కే, "క్షమించామని చెప్పడం మాత్రమే సరిపోదు. నిరసనల్లో పాల్గొన్న విద్యార్థు లపై నమోదైన కేసులను కూడా ఎత్తివేస్తారా?" అని ప్రశ్నించారు. అలాగే ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఒక కెమెరామెన్‌పై అనుచిత పదజాలం ఉపయోగించినట్లు వైరల్ అయిన వీడియోను ప్రస్తావిస్తూ, "ఈ దేశంలో రెండు రకాల చట్టాలా? యువతకు ఒకటి, అధికార పార్టీ నేతలకు మరొకటా?" అని విమర్శించారు.
ఇదిలా ఉండగా, ప్రధానమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆరోపణలతో నోయిడాకు చెందిన ఓ యువతిపై కేసు నమోదైంది. అనంతరం ఆమె వీడియో విడుదల చేసి దేశ ప్రజలకు, ప్రధానమంత్రికి క్షమాపణలు చెబుతూ, తన వ్యాఖ్యలపై పశ్చాత్తాపం వ్యక్తం చేసింది. అయితే, జంతర్‌మంతర్ నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై రాజకీయ వర్గాల్లో, విద్యార్థుల్లో ఆసక్తి నెలకొంది.

# అసైన్డ్ భూములపై సమగ్ర విధానం

చేర్చలేదన్నారు. మరోవైపు భూముల ధరల సవరణతో రిజిస్ట్రేషన్ల ఆదాయం 20శాతం వరకు పెరిగిందని పొంగులేటి తెలిపారు. సచివాలయంలో ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని పేదల భూములు, ప్రభుత్వ భూములను అక్రమంగా కాజేసిన వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి నుంచి భూభారతి వరకు జరిగిన ప్రతి భూ లావాదేవీని ఫాస్ట్‌ట్రాక్ విధానంలో విచారిస్తున్నామని, అక్రమాలకు పాల్పడిన వారెవరైనా చట్టం ముందు నిలబెట్టడం ఖాయమని హెచ్చరించారు. ధరణి పోర్టల్‌ను అడ్డుగా చేసుకుని భారీ స్థాయిలో భూ అక్రమాలు, అక్రమ మ్యుటేషన్లు, ప్రభుత్వ భూముల బదిలీలు జరిగాయని అన్నారు. ప్రస్తుతం ప్రతి వ్యవహారాన్ని ఆధారాలతో సహా పరిశీలిస్తున్నామని, నిజాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు. అంతేగాక ఎవరి హయాంలో ఎంత భూమి నిషేధిత జాబితాలో చేరిందో తేలుస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పుడు నిషేధిత జాబితాలో ఎంత భూమి ఉంది? ఆ భూములను ఎవరు, ఎప్పుడు, ఏ కారణాలతో చేర్చారు? తర్వాత ఎందుకు తొలగించారు? అనే ప్రతి అంశంపై సమగ్ర విచారణ జరుగుతోందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను కూడా అదే స్థాయిలో పరిశీలిస్తున్నామని స్పష్టం చేశారు. కొత్తగా ఒక్క సెంటు భూమి కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా అంగుళం భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ధరణి పోర్టల్‌లో ఉన్న జాబితానే కోర్టుకు సమర్పించామని, వివాదాలు లేని ప్రైవేట్ ఆస్తులు లేదా ప్లాట్లను ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అసత్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం రీసర్వే చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే 276 గ్రామాల్లో సర్వే పూర్తైందని, ప్రతి సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలో ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయిస్తామని చెప్పారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, కేవలం రెండు శాతం మాత్రమే అభ్యంతరాలు వచ్చాయని వివరించారు. రాష్ట్రంలో సుమారు 85 వేల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని, వాటి విషయంలో సమగ్ర విధాన నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని కోణాల్లో ప్రభుత్వం చర్చిస్తోందని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని, ఎవరికీ అనుకూలంగా లేదా వ్యతిరేకంగా వ్యవహరించే ప్రశ్నే లేదని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే ప్రతి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. క్యూర్ పరిధిలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్‌ను చూసి బీఆర్‌ఎస్ నాయకులు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని మంత్రి విమర్శించారు. కొల్లూరులో గత ప్రభుత్వం నిర్మించిన 2బీహెచ్‌కే ఇళ్లలో వర్షం వస్తే నీళ్లు కారుతున్నాయని మీడియా దృష్టికి వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అది గత ప్రభుత్వ నాణ్యతకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. అయినప్పటికీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆ ఇళ్లను కూడా మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోయినా, లబ్దిదారులు ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే ÷నైల్ బిల్లులు చెల్లిస్తుందని మంత్రి ప్రకటించారు. భూముల మార్కెట్ విలువల సవరణ తర్వాత ప్రభుత్వం అంచనా వేసిన దానికంటే 10 నుంచి 20 శాతం వరకు అధిక ఆదాయం వచ్చిందని మంత్రి తెలిపారు. స్టాంప్స్ / రిజిస్ట్రేషన్స్ శాఖ ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు వార్షిక ఆదాయం సుమారు రూ.13 వేల కోట్లు ఉండగా, గత ఏడాది అది రూ.15 వేల కోట్లకు చేరిందని, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.18 వేల కోట్లకు చేరుకునే అవకాశం ఉందని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని మంత్రి పొంగులేటి తెలిపారు.



## కామన్వెల్త్ గేమ్స్‌లో భాతర్‌కు పతకాల పంట

గేమ్స్ 2026 స్కాట్లాండ్ లోని గ్లాస్గోలో జరుగుతున్నాయి. జూలై 23న ఈ క్రీడలు ప్రారంభం అవ్వగా ఆగస్టు 2న ముగియనున్నాయి. ఈసారి కామన్వెల్త్ గేమ్స్ లో భారత అథ్లెట్లు అద్భుతమైన ప్రదర్శన కనిపిస్తున్నారు. భారత్ తరపున మొత్తం 120కి అథ్లెట్ల బృందం బరిలో దిగింది. ఇప్పటి వరకు దేశానికి మొత్తం 25 పతకాలు వచ్చాయి. అందులో 7 స్వర్ణ పతకాలు, 12 రజతాలు, 6 కాంస్య పతకాలు ఉన్నాయి. కామన్వెల్త్ గేమ్స్ లో సాధారణంగా భారత్ కు ఎక్కువగా రెజ్లింగ్, బ్యాండ్మింటన్, హాకీ, టేబుల్ టెన్నిల్ లాంటి క్రీడల్లో పతకాలు వచ్చేవి. కానీ ఈ ఆటలను తొలగించడంతో పరిమిత సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు. అయినప్పటికీ పతకాలు సాధిస్తూ సత్తాచాటుతున్నారు.

## నామినేటెడ్ పోస్టుల భర్తీ షురూ

గేట్ ఎంట్రీ, ఎగ్జిట్ వ్యవస్థలను ఒకే డిజిటల్ ప్లాలాట్‌ఫారంపై అనుసంధానం చేయాలని ఆదేశించారు. రవాణా శాఖలో అమలవుతున్న నంబర్ ప్లేట్ స్కానింగ్ విధానాన్ని మార్కెట్ యార్డుల్లోనూ అమలు చేసి, వాహనాల ప్రవేశం, నిష్క్రమణ, తూకం, కొనుగోలు లావాదేవీలన్నీ డిజిటల్ రూపంలో నమోదు అయ్యేలా సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేయాలని సూచించారు.

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్ కార్యాలయం, పిఐయు డివిజన్, నల్గొండ
షార్ట్ టెండర్ నోటీస్
Lr.No.: డి3/టెండర్స్/05/2026-27/డీపీఆర్ఈఎన్‌జీ తేదీ: 31.07.2026
నల్గొండ జిల్లా, PIU నల్గొండ డివిజన్ పరిధిలోని నల్గొండ పట్టణంలో మొత్తం రూ. 43.00 లక్షల అంచనా వ్యయంతో (6) పనులకు సంబంధించి క్రింద సంతకం చేసిన అధికారి టెండర్లను ఆహ్వానిస్తున్నారు.
దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ: 10.08.2026 టెండర్ షెడ్యూల్స్ జారీ చేయు తేదీ: 12.08.2026
టెండర్ల స్వీకరణ మరియు ఓపెనింగ్ తేదీ: 13.08.2026
పూర్తి వివరాల కోసం సంప్రదించండి: O/o. జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్ కార్యాలయం (డీపీఆర్ఈ పీఐయూ), (జెడ్‌పీపీ కాంప్లెక్స్, 2వ అంతస్తు), మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా, నల్గొండ పట్టణం.
DIPR No.7152-PP/CL/ADVT/2026-27
సం/- జిల్లా పి.ఆర్. ఇంజనీర్, పి.ఐ.యు., నల్గొండ.

# సంగారెడ్డి జిల్లాలో ఉద్రిక్తత

- వట్‌పల్లి పోలీస్ స్టేషన్‌పై గ్రామస్తుల దాడి
- యువకుడి అనుమానాస్పద మృతితో కలకలం





**సంగారెడ్డిబ్యూరో, ఆగస్టు 1(జనంసాక్షి)** : సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి పోలీస్ స్టేషన్ వద్ద శనివారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వట్‌పల్లిలోని ఒక దాబాలో పనిచేస్తున్న బీరప్ప (22) అనే యువకుడు చెట్టుకు ఉరివేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అయితే, మృతుడి కుటుంబ సభ్యులకు ఎలాంటి పూర్వాపర సమాచారం అందించకుండానే వట్‌పల్లి పోలీసులు మృతదేహాన్ని చెట్టుపై నుంచి కిందికి దించేశారని ఆరోపిస్తూ మృతుని స్వగ్రామమైన దరఖాస్తుపల్లికి చెందిన ప్రజలు, కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని వారి అనుమతి లేకుండా ఎలా దించుతారని ప్రశ్నిస్తూ, పోలీసులు దాబా యజమానితో కుమ్మక్కయ్యారని ఆరోపణలు గుప్పించారు. ఈ ఘటనతో ఆగ్రహానికి గురైన దరఖాస్తుపల్లి గ్రామస్తులు, బంధువులు పెద్ద సంఖ్యలో వట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పోలీసులతో తీవ్ర వాగ్వాదానికి దిగారు. చూస్తుండగానే పరిస్థితి అదుపుతప్పి, ఆగ్రహంతో ఊగిపోయి పోలీస్ స్టేషన్‌పై ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. ఈ దాడిలో స్టేషన్‌లోని కిటికీ అద్దాలు, ఫర్నిచర్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. అనుమానాస్పద మృతిపై సరైన సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యం వహించడమే కాకుండా ఆధారాలు తుడిచేసే యత్నం చేస్తున్నారంటూ స్థానికులు ఆందోళన చేపట్టడంతో పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం అలుముకుంది. ఇది ఇలా ఉండగా సమాచారం తెలుసుకున్న డిఎస్పి సత్తయ్య గౌడ్ వట్టిల్లి పోలీస్ స్టేషన్ చేరుకొని సంఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మహారాష్ట్ర ఆర్మీ మద్యం పట్టివేత

- ఇద్దరు నిందితుల అరెస్ట్



**ఆదిలాబాద్ టౌన్, ఆగస్ట్ 1 (జనంసాక్షి)** : భోరజ్ చెక్ పోస్ట్ దగ్గర మహారాష్ట్ర నుండి అక్రమంగా తరలిస్తున్న ఆర్మీ మద్యం ను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. జిల్లా సరిహద్దుల్లో అక్రమ మద్యం రవాణాపై ప్రతేక నిఘా ఎక్సైజ్ శాఖ పెట్టింది. ఇందులో భాగంగా భోరజ్ అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ బి.మురళి కృష్ణ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిబ్బంది కృష్ణ, నరేష్, మధు, స్వప్న కలిసి ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుండి ఆదిలాబాద్ వైపు వస్తున్న ఒక అనుమానాస్పద కారును ఆపి తనిఖీ చేయగా, అందులో అక్రమంగా తరలిస్తున్న నాన్-డ్యూటీ పెయిడ్ ఆర్మీ లిక్కర్ బయటపడింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి ఎక్సైజ్ పన్ను చెల్లించకుండా తరలిస్తున్న ఈ ఆర్మీ మందును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు 97 ఫుల్ బాటిళ్ల ఆర్మీ లిక్కర్, రవాణాకు ఉపయోగించిన ఒక కారు నిందితుల వద్ద ఉన్న 2 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను టాస్క్ ఫోర్స్ సిబ్బంది ఘటనా స్థలంలోనే అదుపులోకి తీసుకున్నారు. తదుపరి చట్టపరమైన విచారణ, కేసు నమోదు నిమిత్తం నిందితులను, స్వాధీనం చేసుకున్న సొత్తును ఆదిలాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ కు అప్పగించడం జరిగింది. జిల్లా సరిహద్దుల గుండా జరిగే ఎలాంటి అక్రమ మద్యం రవాణా పైనైనా కఠిన చర్యలు ఉంటాయని అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు.




# ఎన్డీయే హయాంలో దేశం అప్పులపాలు

- రౌండ్ టేబుల్ సమావేశంలో బిఎన్ రావు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. బి. నరేందర్ రావు.

**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 01 (జనంసాక్షి)** : కేంద్రంలోని ఎన్డీయే (బీజేపీ) ప్రభుత్వం పదేళ్ల పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసిందని కరీంనగర్ ఫిలింభవన్ రౌండ్ టేబుల్ సమావేశంలో బీఎన్ రావు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బి. నరేందర్ రావు ఆరోపించారు. ఈ సందర్భంగా ఫిలింభవన్ రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ... పెద్ద నోట్ల రద్దుతో 130 కోట్ల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. విదేశాల్లోని నల్లధనాన్ని తెచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తానన్న ప్రధాని మోదీ హామీ నీటిమూటగానే మిగిలిందన్నారు. వంటగ్యాస్, చమురు, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయని మండిపడ్డారు. సుమారు 120 ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అంబానీ, అదానీ లాంటి బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టారని విమర్శించారు. బడా కంపెనీల రుణాల ఎగవేతతో అనేక బ్యాంకులు దివాలా తీశాయన్నారు. గత 67 ఏళ్లలో పూర్వ ప్రభుత్వాలు రూ.55 లక్షల కోట్ల అప్పు చేస్తే, పదేళ్ల ఎన్డీయే పాలనలోనే అది రూ.155 లక్షల కోట్లకు చేరిందని, ప్రతి పౌరుడిపై రూ.1.20 లక్షల అప్పు భారం పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారం దేశంలోనే అతిపెద్ద కుంభకోణమని, ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీ అబద్ధమని తేలడంతో 22 కోట్ల మంది విద్యావంతులైన యువత, నిరుద్యోగులుగా మిగిలారన్నారు. ఇటీవల నీట్ తో పాటు పలు పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ కావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని, రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రతిపక్ష ప్రభుత్వాలను కూల్చడం, ప్రజాప్రతినిధులను కొనుగోలు చేయడం, బీజేపీకి పరిపాటిగా మారిందని దుయ్యబట్టారు. సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తూ విపక్ష నేతలను జైలుకు పంపుతున్నారని విమర్శించారు. ఈడీ నమోదు చేసిన 121 కేసుల్లో 95 శాతం, మనీ లాండరింగ్ కింద పెట్టిన 5,420 కేసుల్లో 5,150 కేసులు విపక్ష నేతలపైనే ఉన్నాయని గణాంకాలతో వివరించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారి పై 149 దేశద్రోహం కేసులు నమోదు చేస్తూ, అర్బన్ నక్సల్స్ ముద్ర వేస్తున్నారని విమర్శించారు. అయోధ్య రామమందిరం పేరుతో ఓట్లు దండుకున్న బీజేపీ, అక్కడ జరుగుతున్న అవినీతిపై ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. ఎన్డీయే ప్రభుత్వానికి కాలం చెల్లిందని, ప్రతిపక్షాలను నిర్వీర్యం చేస్తే ప్రజలే సరైన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మిల్కూరు వాసుదేవ రెడ్డి, సుడా మాజీ చైర్మన్ జీవి రామకృష్ణారావు, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర అధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి, కొరివి వేణుగోపాల్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు జమీలుద్దీన్, ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్, బొత్తా వెంకట మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పరీవాహక ప్రజలకు శాశ్వత రక్షణ కల్పిస్తున్నాం

- వరదలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తం.. ముందస్తు చర్యలతో నష్టాల నివారణ
- లోతట్టు ప్రాంత ప్రజలకు పునరావాసం, ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు చర్యలు
- మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ఏటూరునాగారం, ఆగస్టు 01(జనంసాక్షి)** : గోదావరి పరివాహక ప్రాంత ప్రజలకు శాశ్వత రక్షణ కల్పిస్తున్నామని, వరదలపై జిల్లా యంత్రాంగం నిరంతరం అప్రమత్తతో ముందస్తు చర్యలతో నష్టాలను నివారణ చేయడం జరిగిందని, లోతట్టు ప్రాంత ప్రజలకు పునరావాసం, ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు.

శనివారం ఏటూరునాగారం మండలం కేంద్రం లోని రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద గోదావరి నది వరద ప్రవాహాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ లెనిన్ వత్సల్ టొప్పో లతో కలసి పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ గత రెండు రోజులుగా తెలంగాణ తో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నది ఉప్పొంగుతున్న సందర్భంగా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఐటిడిఏ పిఓ, సాగునీటి శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారుల తో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని అన్నారు. గత రెండేళ్లుగా ములుగు జిల్లాలో ప్రత్యేక వరద నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసి, వాగులు, గోదావరి పరివాహక ప్రాంతాలు, ముంపు గ్రామాల్లో ప్రత్యేక అధికారులను నియమించి పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తున్నామని వివరించారు.

గోదావరి మూడో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుకున్నప్పటికీ ముందస్తు చర్యల కారణంగా ఎలాంటి నష్టం జరగలేదన్నారు. రెండు నెలల క్రితమే గోదావరి పరివాహక ప్రాంతాల్లో జిల్లా ఉన్నత అధికారులతో, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పర్యటించి అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. గతంలో రామన్నగూడెంలోకి వరద నీరు చేరేదని, ఈసారి ముందస్తు చర్యలతో ఆ ప్రమాదాన్ని నివారించగలిగామని పేర్కొన్నారు.

రామన్నగూడెం, మంగపేట ప్రాంతాల్లో కరకట్ట నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, సుమారు 800 మీటర్ల మేర పనులు పూర్తయ్యాయని తెలిపారు. ప్రజలు వరదలు, వాగులు ఉప్పొంగిన సమయంలో వాటిని దాటే ప్రయత్నం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. వర్షాల సమయంలో అడవుల్లోకి పశువులను మేపేందుకు వెళ్లడం, చేపల వేటకు వెళ్లడం ప్రమాదకరమని హెచ్చరించారు. 2022, 2023 సంవత్సరాల్లో గోదావరి, జంపన్నవాగు వరదల వల్ల ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మిగిలిన కరకట్ట పనులను కూడా పూర్తి చేసి గోదావరి పరివాహక ప్రాంత ప్రజలకు శాశ్వత రక్షణ కల్పిస్తామని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలను గుర్తించి రెండో విడతలో పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్ల ను మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం ఏ ఎస్పీ మనన్ భట్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా ఆత్మ చైర్మన్ చిటమట రఘు, ఆర్డీవో కృష్ణవేణి, తహసిల్దార్, ఎంపిడిఓ, ఏటూరునాగారం ఆత్మ డివిజన్ చైర్మన్ కర్ల అరుణ, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్‌జిల్లా సీరియల్ దొంగ అరెస్ట్

- వరుస దేవాలయాల చోరీలకు తెర
- రెండు కేసులు ఛేదించిన రామడుగు పోలీసులు
- బంగారం, వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం
- మరిన్ని చోరీలపై దర్యాప్తు చేస్తున్నామని అడిషనల్ డీసీపీ వెంకటరమణ వెల్లడి



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 01 (జనంసాక్షి)** : కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని రామడుగు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన వరుస దేవాలయ చోరీలను పోలీసులు ఛేదించారు. ఈ సందర్భంగా కరీంనగర్ రూరల్ ఏసిపి కార్యాలయంలో కరీంనగర్ అదనపు డిసిపి వెంకటరమణ, రూరల్ ఏసీపి విజయకుమార్ తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... జగిత్యాల జిల్లా పొలాస గ్రామానికి చెందిన అంతర్‌జిల్లా సీరియల్ హౌస్‌బ్రేకర్ ఎం.ఏ. అర్షద్ ఖాన్‌ను అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి బంగారం, వెండి ఆభరణాలు, నగదు, ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కరీంనగర్‌లో కూలీగా పనిచేస్తున్న అర్షద్ ఖాన్ సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దేవాలయాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారని, జూలై 25, 26 తేదీల్లో వెదిర గ్రామంలోని శ్రీ లక్ష్మీ గణపతి, శ్రీ మార్కండేయ స్వామి దేవాలయాల్లో తాళాలు పగులగొట్టి బంగారం, వెండి వస్తువులు, హుండీ నగదును దొంగిలించాడని తెలిపారు. సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, అతని వద్ద నుంచి మూడు వెండి కిరీటాలు, నాలుగు వెండి జంజీరాలు, బంగారు పుస్తెలు, రూ.9,500 నగదు, ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారని, జ్యువెలరీ దుకాణంలో విక్రయించిన మరికొన్ని ఆభరణాలను రికవరీ చేశారని తెలిపారు.

### పలుచోట్ల చోరీలు చేసినట్లు అంగీకారం

విచారణలో నిందితుడు చిగురుమామిడి, ఎల్ఎండీ కాలనీ, రామడుగు, చొప్పదండి, గంగాధర పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని దేవాలయాలు, తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడని, చోరీ సొత్తును పలు జ్యువెలరీ దుకాణాల్లో విక్రయించి వచ్చిన డబ్బును వ్యక్తిగత అవసరాలు, మద్యపానానికి ఖర్చు చేసినట్లు వెల్లడించాడని, నిందితుడిని కోర్టులో హాజరుపరచగా, మిగిలిన చోరీ సొత్తు స్వాధీనం కోసం ప్రత్యేక బృందాలు దర్యాప్తు కొనసాగిస్తున్నాయని, కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు అధికారులను అదనపు డీసీపీ అభినందించి రివార్డులు అందజేశారు.



# కుబీర్ సభలో స్పృహ కోల్పోయిన సూపర్వైజర్

**కుబీర్, ఆగస్టు 01 (జనంసాక్షి)**: కుబీర్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాధిక అకస్మాత్తుగా స్పృహతప్పి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. మధ్యాహ్నం రెండు దాటినా సభ సాగడం, హాజరైన వారికి కనీసం స్నాక్స్ కూడా ఇవ్వకపోవడంతోనే ఆమె నీరసించిపోయారని ప్రజాప్రతినిధులు ఆరోపించారు. సభ ముగిసినా, హాజరైన ఎమ్మెల్యేతో సహా అందరూ వెళ్ళిపోతుండగా ఆమె మాత్రం కుర్చీలోనే చలనం లేకుండా ఉండిపోయారు. ఇది గమనించిన తోటి సిబ్బంది, సర్పంచులు తక్షణమే స్పందించి వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

## మైనర్ వివాహం.. ఇద్దరు రిమాండ్

**గుడిహత్నూర్, ఆగస్టు 1 (జనం సాక్షి)** : ఇంద్రవెల్లి మండలానికి చెందిన ఓ మైనర్ బాలిక వివాహం కేసులో మైనర్‌ను వివాహం చేసుకున్న యువకుడితో పాటు, ప్రేమ పేరుతో అపహరించిన మరో యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాల్య వివాహం నిర్వహించిన ఇరు కుటుంబాల సభ్యులపై కూడా కేసులు నమోదు చేసినట్లు ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే తెలిపారు. ఏఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రవెల్లి మండలానికి చెందిన మైనర్ బాలికకు మూడు నెలల క్రితం గుడిహత్నూర్ మండలం కొల్హారీ గ్రామానికి చెందిన రాథోడ్ రూప్ సింగ్‌తో వివాహం జరిగింది. కాగా, ఈ నెల 25న తన భార్య కనిపించడం లేదంటూ రూప్ సింగ్ గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో సదరు బాలిక అదే గ్రామానికి చెందిన రాథోడ్ గుణవంత్ రావ్‌తో ప్రేమ సంబంధం కొనసాగిస్తూ హైదరాబాద్‌కు వెళ్లినట్లు గుర్తించారు. దర్యాప్తులో బాలిక మైనర్ అని నిర్ధారణ కావడంతో, మైనర్ బాలికను వివాహం చేసుకున్నందుకు రాథోడ్ రూప్ సింగ్‌పై, ప్రేమ పేరుతో మైనర్‌ను అపహరించినందుకు రాథోడ్ గుణవంత్ రావ్‌పై సంబంధిత చట్టాల కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

# లీగల్ సేల్ ద్వారా ఎన్నో కేసులు పరిష్కరించుకోవచ్చు

- హైకోర్టు జడ్జి సూరపల్లి నందా
- ఈ సేవ కేంద్రం, మండల్ లీగల్ సెల్ కమిటీ ప్రారంభించిన జడ్జి నందా



**స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 01 ( జనం సాక్షి )** : లీగల్ సేల్ కమిటీ ద్వారా ఎన్నో కేసుల సమస్య లు పరిష్కరించుకోవచ్చునని హైకోర్టు, అడ్మినిస్ట్రే షన్,జనగామ జిల్లా పోర్ట్ ఫోలియో జడ్జీ సురేపల్లి నందా అన్నారు. ఘన్పూర్ పట్టణ కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో స్టేషన్ గన్పూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకం రమేష్ అధ్యక్షతన జనగామ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రతిమ, జడ్జీలు శివ లీల, సందీప, శశి, శ్రీదేవి, ఏసీపీ భీమ్ శర్మ మర్యాదపూర్వకంగా హైకోర్టు జడ్జీని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, హైకోర్టు జడ్జి జనగామ అడ్మినిస్ట్రేషన్ జడ్జ్ సూర పల్లి నందకు ఘన స్వాగతం పలకడం జరిగింది. ఈ సందర్భం గా హైకోర్టు జడ్జి నందా స్టేషన్ గన్ పూర్ కోర్టులోమండల్ లీగల్ సెల్ కమిటీ ప్రారంభో త్సవం, ఈ సేవ కేంద్రం ప్రారంభించడం జరిగింది . ఈ సందర్భంగా జడ్జి నందా మాట్లాడుతూ స్టేషన్ ఘన్పూర్ ప్రాంత ప్రజలకు కక్షిదారులకు మండల లీగల్సేల్ ద్వారా ఎన్నో కేసులు పరిష్కరించు కోవడానికి అవకాశం ఉన్నందున అదేవిధంగా కక్షిదా రులకు ఇబ్బంది కాకుండా కేసు అప్డేట్స్ ఆన్లైన్లో చూసుకునే ఈ సేవా కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అడ్వకేట్స్ ఎంతో ట్రెస్ తో ఉంటారని, కాబట్టి షటిల్ కోర్ట్ ను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా జడ్జి నంద సరదాగా కాసేపు సెటిల్ ఆడారు. ఈ కార్యక్ర మంలో జనగామ జిల్లా జడ్జి ప్రతిమ, జడ్జీలు శివ లీల, సందీప, శశి, శ్రీదేవి, బార్ కౌన్సిల్ సభ్యుడు, న్యాయవాదులు ముంద సాని సహోదర రెడ్డి హనుమకొండ అధ్యక్షుడు సొల్లేటి రామకృష్ణ, వరంగల్ అధ్యక్షుడు చకిలం ఉపేందర్, జనగామ జనరల్ సెక్రెటరీ మన్నే సత్యం, గన్ పూర్ న్యాయవాదుల అధ్యక్షుడు కనకం రమేష్, మున గాల రవీందర్, ఉపాధ్యక్షుడు సోలో మోన్ రాజ్, శన్మ కుమారి, గుర్రపు బాబు, ఆమెరాజు శ్రీనివాస్, మారపాక ప్రలక్ష్మణ్, పనికొర శ్రీశైలం, తాడూరు వనిత, అనూష, విజయ భాస్కరరావు, తాడం శ్వేత, తాళ్ల పెల్లి ప్రేమ్ కుమార్ తదితర న్యాయ వాదులు పాల్గొన్నారు.

# మణుగూరు డిప్‌సైడ్ బొగ్గు బ్లాక్ సింగరేణికి కేటాయించాలి

- భూపాలపల్లి ఏరియా ఐఎన్టీయూసీ మహాధర్నా



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి)**: ఆగస్టు 4 నుండి 11 వరకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించనున్న బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణి సంస్థ భవిష్యత్తు దృష్ట్యా మణుగూరు డిప్‌సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం భూపాలపల్లి ఏరియా ఎస్‌సిఎంఎల్‌యూ-ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో జీఎం కార్యాలయం ముందు మహాధర్నా నిర్వహించారు. ఐఎన్టీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి అధ్యక్షులు డా. బి. జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు భూపాలపల్లి ఏరియా ఐఎన్టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షులు బేతెల్లి మధుకర్ రెడ్డి అధ్వర్యంలో ఈ ధర్నా జరిగింది. ఈ సందర్భంగా భూపాలపల్లి ఏరియాకు ఇంచార్జ్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు, ఐఎన్టీయూసీ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు నర్సింహ రెడ్డి మాట్లాడుతూ మణుగూరు డిప్‌సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించడం ద్వారా సంస్థ మరింత బలోపేతం అవుతుందన్నారు. దీనివల్ల వేలాది మంది కార్మికులకు ఉపాధి భద్రత లభిస్తుందని, భావితరాలకు ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని, బొగ్గు ఉత్పత్తి పెరగడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అధిక ఆదాయం, విద్యుత్ ఉత్పత్తి, పారిశ్రామిక అభివృద్ధికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు. కేటికే-ఓసీ-రెండు ప్రాజెక్టు భూగర్భ గని భూపాలపల్లి, పివిఎన్ఆర్ ఓసీ ములుగు, జేకే-ఓసీ ఎల్లందు, ఆర్కేపీ ఓసీ రెండవ దశ రామకృష్ణపూర్, గోలేటి ఓసీ, ఎంవికే ఓసీ బెల్లంపల్లి, జీడీకే-పదకొండు ఓసీ గోదావరిఖని, కొండాపురం ఓసీ మణుగూరు, ఆర్కే-ఐదు, ఆర్కే ఓసీ శ్రీరాంపూర్, కెకే-ఒకటి, కెకే-ఐదు ఓసీ మందమర్రి, ఆర్కే-ఏడు, ఎన్టీ ఓసీ శ్రీరాంపూర్, ఎస్‌ఆర్పీ ఓసీ-రెండు విస్తరణలను కూడా సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షులు జోగ బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శి పశునుటి రాజేందర్, మహిళా విభాగం అధ్యక్షురాలు మద్దినేని శేషా రత్నం, ఏరియా నిర్మాణ కమిటీ నాయకులు షేక్ హుస్సేన్, గనుల సిబ్బంది ఇంచార్జ్ గడిపే చక్రపాణి, కేంద్ర కార్యదర్శి చెల్పురి సదయ్య, నరెడ్ల సంపత్, బీసీ-ఓబీసీ నవీన్ కుమార్, సీనియర్ నాయకులు కొలిపాక నర్సింగ రావు, బ్రాంచ్ కార్యదర్శి కె. శంకర్, రవి కిరణ్, రాయమల్లు, పిట్ కార్యదర్శులు సోతుకు సమ్మయ్య, గట్టు రాజు, చిరుత లక్ష్మీ నారాయణ, పొనగంటి కృష్ణ, సంగం శ్రీనివాస్, చిన్న మల్లయ్య, మహిబూబి, గాజర్ల హరికృష్ణ, భారత శ్రీనివాస్, రాము, డి. శ్రీనివాస్, రాజకిరణ్, ఎన్. సురేష్, కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచంలో పిడికిలెత్తిన జెన్-జీ

సంపాదకీయం

ప్రపంచ రాజకీయ చరిత్రలో మరో కొత్త అధ్యాయం మొదలైంది. అది ఏ ఒక్క పార్టీది కాదు, ఏ ఒక్క నాయకుడిది కాదు. డిజిటల్ యుగంలో పెరిగిన జెన్-జీ తరానిది. శ్రీలంక నుంచి బంగ్లాదేశ్ వరకు, నేపాల్ నుంచి పెరూ వరకు, మొరాకో నుంచి ఇండోనేషియా వరకు యువత తమ భవిష్యత్తును తాకట్టు పెట్టే విధానాలపై గళమెత్తుతోంది. అవినీతి, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, అధికార అహంకారం, పాలకుల నిర్లక్ష్యం ఇవే ఈ తరం ఉద్యమాలకు ఇంధనంగా మారాయి.

నాయకుల పిలుపు కోసం ఎదురుచూసే తరం ఇది కాదు. ఒక సోషల్ మీడియా పోస్టు, ఒక అన్యాయం, ఒక ప్రజా సమస్య చాలు... లక్షలాది మంది ఒకే వేదికపైకి చేరుతున్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా, సిద్ధాంతాలకు అతీతంగా, తమ భవిష్యత్తు కోసం పోరాడుతున్న కొత్త రాజకీయ సంస్కృతికి జెన్-జీ నాంది పలుకుతోంది. ఈ ప్రభావం భారత్‌లోనూ కనిపిస్తోంది. పరీక్షల పారదర్శకత, ఉపాధి, ప్రజాస్వామ్య జవాబుదారీతనం వంటి అంశాలపై యువత గళం బలంగా వినిపిస్తోంది. జంతర్ మంతర్ వంటి వేదికలపై గాంధేయ పద్ధతిలో జరిగిన నిరసనలు, "చలో పార్లమెంట్" వంటి కార్యక్రమాలు యువతలో పెరుగుతున్న రాజకీయ చైతన్యానికి సంకేతాలుగా నిలిచాయి. ప్రజా సమస్యలపై యువత చర్చను జాతీయ స్థాయికి తీసుకురాగల సామర్థ్యాన్ని ప్రదర్శించింది.

జెన్-జీ రాజకీయాల్లో అధికారాన్ని
చేజిక్కించుకోవడానికి కాదు, అధికారాన్ని జవాబుదారీగా
మార్చడానికి ప్రయత్నిస్తోంది. ఈ తరం చేతిలో
ఆయుధాలు లేవు; రాజ్యాంగం ఉంది. హింస లేదు; ప్రశ్నించే
ధైర్యం ఉంది. వ్యక్తి ఆరాధన కాదు; వ్యవస్థలో పారదర్శకత
కావాలనే ఆకాంక్ష ఉంది.

ప్రపంచవ్యాప్తంగా ఒక విషయం స్పష్టమవుతోంది. ప్రజల స్వరం వినని ప్రభుత్వాలు ఎన్నికల్లోనో, ఉద్యమాల్లోనో, ప్రజాభిప్రాయంలోనో మూల్యం చెల్లించక తప్పదు. డిజిటల్ యుగంలో సమాచారాన్ని అడ్డుకోవడం కంటే, ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పడం పాలకులకు అత్యవసరం. భారత్ కూడా అదే మలుపు వద్ద నిలిచింది. యువతను కేవలం ఓటు బ్యాంకుగా చూసే రాజకీయాలకు కాలం చెల్లుతోంది. వారిని భాగస్వాములుగా గుర్తించి, వారి ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించినవారే రేపటి రాజకీయాల్లో నిలబడగలరు. జెన్-జీ ఇక ఒక తరం మాత్రమే కాదు... ప్రపంచ రాజకీయాలను ప్రభావితం చేస్తున్న ప్రజాస్వామ్య శక్తి.

# 'హైడ్రా' కమిషనర్ రంగనాథ్ చేసిన తప్పేంటి?

హైదరాబాద్ మహా నగరాన్ని చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణల నుంచి కాపాడాలనే లక్ష్యంతో ఏర్పాటైన 'హైడ్రా'నేడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఐపిఎస్ పై విమర్శలు వచ్చినప్పటికీ, ఆయన చేసిన ప్రధాన కర్తవ్యం చట్టవిరుద్ధమైన ఆక్రమణలను తొలగించి ప్రజా ప్రయోజనాలను పరిరక్షించడమే. నగర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కఠిన నిర్ణయాలు తీసుకోవడం వల్లే వివాదాలు తలెత్తాయని చెప్పవచ్చు.గత రెండు దశాబ్దాలుగా హైదరాబాద్‌లో చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములు పెద్దఎత్తున ఆక్రమణలకు గురయ్యాయి. ఫలితంగా ప్రతి భారీ వర్షానికీ నగరం జలమయమవుతోంది. ఈ పరిస్థితిని మార్చాలంటే చట్టాన్ని కఠినంగా అమలు చేయడం తప్ప మరో మార్గం లేదు. అదే బాధ్యతను హైడ్రా చేపట్టింది. ఒక లక్ష ఏభై వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కబ్జా కోరుల నుండి తిరిగి స్వాధీనం చేసుకోవడం అందులో దాదాపు 3,715 ఎకరాలు ఉంటాయంటే అతిశయోక్తి కాదు.ఈ రెండు సంవత్సరాల కాలంలో 27 చెరువులను స్వాధీనం చేసుకున్నారు.అదేవిధంగా 86పార్క్ లకు రంగనాథ్ విముక్తి కల్పించారు. చెరువుల ఫుల్ ట్యాంక్ లెవెల్ ( ఎఫ్ టి ఎల్ ) ప్రాంతాలను రక్షించడం, వర్షపు నీటి ప్రవాహ మార్గాలను పునరుద్ధరించడం వంటి చర్యలు ప్రజా ప్రయోజనాలకు అనుకూలమైనవే. అదే సమయంలో అమలు ప్రక్రియలో పారదర్శకత, సమానత్వం, మానవత్వం కనిపించకపోతే ప్రజల్లో అనుమానాలు పెరగడం సహజం. ముఖ్యంగా చిన్న స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదలు, దిగువ మధ్యతరగతి కుటుంబాలు, జీవితాంతం కూడబెట్టిన పొదుపులతో ఇల్లు కట్టుకున్న సామాన్యులు ఒకేరోజులో నిరాశ్రయులైతే, ప్రభుత్వం లక్ష్యంపై కాకుండా అమలు విధానంపైనే విమర్శలకు గురైనారు.

చట్టం అందరికీ సమానంగా వర్తించాలనే రాజ్యాంగ సూత్రం ప్రజాస్వామ్యానికి పునాది. ఆక్రమణ చేసిన వ్యక్తి పేదవాడైనా, ధనికుడైనా, రాజకీయ నాయకుడైనా, ప్రభావశీల వ్యాపారవేత్తయినా చట్టం ముందు అందరూ సమానులే. కానీ ప్రజల్లో తరచుగా వినిపించే ప్రధాన విమర్శ ఏమిటంటే, చిన్న ఇళ్లపై చర్యలు వేగంగా జరిగితే, పెద్ద రాజకీయ లేదా ఆర్థిక ప్రయోజనాలున్న నిర్మాణాలపై చర్యలు నెమ్మదిగా సాగుతున్నాయనే భావన. ఈ భావన నిజమా కాదా అన్నది పక్కనపెడితే కూడా, అలాంటి అనుమానం కలగే విధంగా విపక్షాల గోబెల్స్ ప్రచారానికి జవాబు చెప్పేందుకు ప్రభుత్వం వ్యవహరించలేదు. చట్టం అమలులో ఎలాంటి వక్షపాతం చూపెట్టలేదు. దానితో ప్రజల విశ్వాసం పొందింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో జరిగిన కూల్చివేతల విషయంలో న్యాయస్థానాలు ఒకే విషయాన్ని పదేపదే గుర్తు చేస్తున్నాయి. చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించకుండా, ముందస్తు అవకాశాలు ఇవ్వకుండా, విచారణ పూర్తికాకముందే కూల్చివేతలు చేపట్టడం రాజ్యాంగబద్ధ పాలనకు అనుకూలం కాదని 63కేసుల్లో కోర్టు ధిక్కరణ చేసిందని న్యాయస్థానాలు స్పష్టం చేశాయి. అందులో ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ని 'హైడ్రా' నుండి తప్పించాలని ఆదేశించింది. అయితే కోర్టు సూచనలు, ఆదేశాలను అత్యంత గౌరవంతో అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. హైడ్రా పనిచేస్తున్నది మున్సిఫల్ అడ్మినిస్ట్రేషన్ నియంత్రణలోనే,అందులో సీఎం రేవంత్ అధీనంలో ఉన్న మంత్రిత్వ శాఖ అనేది నిర్వివాదాంశం.

ప్రజాస్వామ్యంలో కార్యనిర్వాహక వ్యవస్థ, శాసన వ్యవస్థ, న్యాయవ్యవస్థ ఒకదానికొకటి ప్రత్యర్థులు కాదు, పరస్పరం సమతుల్యతను కాపాడే రాజ్యాంగ వ్యవస్థలో భాగాలు. పట్టణాభివృద్ధి విషయంలో మరో ముఖ్యమైన అంశం ప్రభుత్వాల వైఫల్యం కూడా. అనేక ప్రాంతాల్లో సంవత్సరాల తరబడి అక్రమ లేఅవుట్లు, అనుమతిలేని నిర్మాణాలు, చెరువుల పరిధిలో రిజిస్ట్రేషన్లు, మౌలిక వసతులు కల్పించడం వంటి చర్యలు ప్రభుత్వ యంత్రాంగం కళ్లముందే జరిగాయి. ఒకవైపు పన్నులు వసూలు చేయడం, విద్యుత్, తాగునీటి కనెక్షన్లు ఇవ్వడం, మరోవైపు చివరికి అదే ఇళ్లను అక్రమమని ప్రకటించడం వల్ల సాధారణ ప్రజలు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారు.ఈ విషయాన్నీ సీరియస్ గా రేవంత్ ప్రభుత్వం తీసుకోని హైడ్రా కు నిజాయితీగల అధికారిని నియమించింది. కమీషనర్ రంగనాథ్ 10శాతం మందికి చండశాసనుడు గా కన్పించినా 90శాతం మంది రంగనాథ్ దేవుడు గా తీసుకున్న నిర్ణయాలకు హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్న బడా బాబులే రంగనాథ్ పై ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా కమీషనర్ రంగనాథ్ కి అండగా రేవంత్ ఉండడం వల్లనే ప్రభుత్వానికి పేరు తెచ్చే విధంగా దూకుడు కొనసాగించారు.ఇక్కడ సీఎం రేవంత్ కు ఒక విజన్ ఉంది కాబట్టి రంగనాథ్ ను తప్పని పరిస్థితిలో బదిలీ చేయాల్సి వస్తే రంగనాథ్ లాంటి నిజాయతి గల అధికారినే నియమిస్తారని రియల్ మాఫియా తెలుసుకుంటే మంచిది. కోర్టు ధిక్కరణ కేసులు వేసిన కబ్జా కోర్టులు కప్పిపుచ్చుకోవడానికి సామాన్య పౌరులను పావులుగా వాడుకొని న్యాయస్థానాలను నమ్మించే ప్రయత్నం చేసిందనే విమర్శ ఉంది.కేసీఆర్ ప్రభుత్వంలో ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ దాదాపు 300 కోర్టు ధిక్కారం కేసులు ఎదుర్కొన్న సంగతి తెలియంది కాదు. విద్యా శాఖలో కోర్టు దిక్కారం ఎదుర్కొన్న ప్రిన్సిపల్ సెక్రెటరీ, కమిషనర్, ఎంతోమంది వైస్ ఛాన్స్ లర్స్ ఈ లెక్కన ఎటు బదిలీ కావాలి? ఒక్కటి మాత్రం నిజం ప్రభుత్వాలు వస్తుంటాయి,పోతుంటాయి కానీ ముక్కుచూటి అధికారులకు ఇది సర్వసాధారణమే.

'హైడ్రా' చేపట్టిన చర్యల వల్ల సుమారు 60 రహదారులు స్వాధీనం చేసుకోవడం చూస్తే ఆక్రమణలపై ప్రభుత్వ సంకల్పం స్పష్టంగా కనిపించింది.చట్టం ముందు రాజకీయ నాయకులు, ప్రభావశీలులు, వ్యాపారవేత్తలు, సామాన్యులు అందరూ సమానులనే సూత్రాన్ని ఆచరణలో పెట్టాలనే ప్రయత్నం జరిగింది. ఇలాంటి చర్యలు సహజంగానే ప్రతిఘటనకు గురవుతాయి. ఎందుకంటే అక్రమ నిర్మాణాల వెనుక తరచుగా భారీ ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు ఉంటాయి. ప్రజాస్వామ్యంలో కోర్టుల సూచనలు, రాజ్యాంగబద్ధ విధానాలు తప్పనిసరిగా పాటించాలి. అదే సమయంలో ప్రజా ఆస్తులను కాపాడేందుకు కఠినంగా పనిచేసే అధికారులను కూడా నిరుత్సాహపరచకూడదు. అవసరమైతే విధానాల్లో సవరణలు చేయాలి, పారదర్శకతను పెంచాలి, పునరావాస వ్యవస్థను బలోపేతం చేయాలి. కానీ ప్రకృతి వనరులను కాపాడే లక్ష్యాన్ని మాత్రం బలహీనపరచకూడదు. అంతిమంగా చూస్తే సారీ చెప్పమని ఆదేశించింది. కోర్టు మందలించినందుకు కమీషనర్ క్షమించండి అని చెప్పడం జరిగింది. కబ్జా కోరుల విశ్వాసం అంతా కూడా గత ప్రభుత్వాలు అన్ని పర్మిషన్స్ ఉన్నాయనే భావంతో ఉన్నారు కానీ, వారిపై క్రిమినల్ కేసులు లేనందుకే ఈ తెగింపు అనే భావం ఉంది. రంగనాథ్ పై వచ్చిన వివాదాలు ప్రధానంగా చట్ట అమలు విధానం, 56పేజీల కోర్టు ఉత్తర్వుల అనుసరణ వంటి అంశాల చుట్టూనే తిరిగాయి. ఆర్టికల్ 311 ప్రకారం ఆల్ ఇండియా సర్వీస్ అధికారులకు దాబాయించే అధికారం కోర్టుకు లేదు. కానీ రూల్ ఆఫ్ లా కాకుండా రూల్ ఆఫ్ మెన్ గా వ్యవహారం ఉందని మండిపడ్డది. రాజకీయ నాయకులు, ప్రభావశీలులు, సామాన్యులు అనే తేడా లేకుండా అందరికీ ఒకే చట్టం అమలైతేనే హైడ్రా లక్ష్యాలకు ప్రజల మద్దతు లభిస్తుంది. అంతిమంగా, హైదరాబాద్ తన సరస్సులను, ప్రజా భూములను పరిరక్షించుకోవాలా వద్దా అనేది ఇక్కడ చర్చ కాదు నిస్సందేహంగా పరిరక్షించుకోవాలి. చట్ట అమలు చట్టబద్ధత, పారదర్శకత, నిష్పక్షపాతంలో దృఢంగా పాతుకుపోయి ఉండేలా చూడటమే అసలైన సవాలు. హైదరాబాద్ 'హైడ్రా' తరహాలో అన్ని జిల్లాలకు ,పట్టణాలకు వ్యాపిస్తే కబ్జా కోరుల ఆటలు సాగవని కోర్టులను ఆశ్రయించి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్ ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ విజన్ -2047 రాజ్యాంగ సూత్రాలకు లోబడి 'హైడ్రా' పనిచేస్తున్నదని, వెనుకకు తగ్గేదేలే అంటూ నిజాయతీ గల రంగనాథ్ బాసటగా నిలువడం గమనార్హం.

ప్రొఫెసర్ సంగని మల్లేశ్వర్
విభాగాధిపతి, జర్నలిజం శాఖ
కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్,
సెల్-9866255355

# బెయిల్ అనేది ఖైదీలకు ఉన్న ఒక హక్కు

'బెయిల్ మంజూరు చేసే విషయాల్లో లేదా తిరస్కరించే విషయాల్లో న్యాయ వ్యవస్థలు మూల సిద్ధాంతాలను మరచి పోతున్నాయంటూ' సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి మదన్ బీ లోకూర్ ఒక 'ఈ మెయిల్ ఇంటర్వ్యూ' లో తన అభిప్రాయాల్ని వ్యక్తపరిచారు. భారత జైళ్లలో విచారణ పూర్తికాక, బెయిల్ రాక, ఉన్న 'అండర్‌ట్రయల్ ఖైదీలు' లక్షల సంఖ్యలో ఉన్నారు. వారిలో చాలామంది పేదలు కావడం, న్యాయ సహాయం లేకపోవడం వలన సంవత్సరాల పాటు జైళ్ల లోనే ఉంటున్నారు. న్యాయ సహాయం ఉన్నప్పటికీ, కొన్ని కేసుల్లో పదేళ్లు అయినా బెయిల్ రాకుండా జైల్లోనే మగ్గిపోతున్న 'రాజకీయ ఖైదీలు' కూడా ఎందరో ఉన్నారు. విచారణ కాలంలోనే శిక్షణంతా అనుభవించాక ఆ తరువాత బెయిల్ వచ్చి ఏం ప్రయోజనం?

'బిక్రమ్ జిత్ సింగ్' అని, ఇతనిది పంజాబ్. ఒక ఉగ్రవాద సంబంధిత కేసులో అరెస్టయ్యాడు. దాదాపు 17 సంవత్సరాలు విచారణ ఖైదీగా జైల్లోనే గడిపాడు. ఆ తర్వాత కోర్టు నిర్దోషిగా విడుదల చేసింది. పదిహేడు రోజులు కాదు; పదిహేడు నెలలు కాదు; పదిహేడేళ్ళు! కరిగి పోయిన అతని వయసునూ, కోల్పోయిన అతని కుటుంబ జీవితాన్నీ, ఆరోగ్యాన్ని ఎవరు తెచ్చి ఇవ్వగలరు?

'మచాంగ్ లాలుంగ్' అని, అస్సాంకు చెందిన ఆదివాసీ యువకుడు. 1951లో అరెస్టయ్యాడు. తనకి భాష రాదు. తను చెప్పేది అధికార్లకు అర్థం కాదు. అధికార్లు చెప్పేది తనకి అర్థం కాదు. పైగా మానసిక ఆరోగ్య సమస్యలు. కేసు విచారణ ముందుకు సాగలేదు. 54 సంవత్సరాలు జైల్లోనే గడిపాడు. 2005లో విడుదలయ్యాడు.

ఇంతకన్నా 'జ్యుడీషియల్ క్రుయాలిటీ' ఇంకొకటి వుంటుందా? శిక్ష పడ్డ ఖైదీలు కూడా ఇంత కాలం జైల్లో ఉండి వుండరు. (నెల్సన్ మండేలా కూడా 27 సంత్సరాలే వున్నాడు.) రిమాండ్ ఖైదీని బెయిల్ ఇవ్వకుండా ఇంత కాలం జైల్లో వుంచడం అనేది 'వలస పాలన' ను తలపిస్తోంది. ఇంకా చెప్పాలి అంటే వలస పాలనను మరిపిస్తోంది.

'భారత రక్షణ చట్టం' (బ్రిటిష్ పాలనలో యుద్ధకాలంలో తీసుకొచ్చిన అత్యవసర చట్టం.) '1818 నాటి బెంగాల్ రెగ్యులేషన్--3' చట్టాల క్రింద కూడా విచారణ ఖైదీలు ఇంత కాలం జైళ్ళల్లో ఉండక పోవచ్చును.

కోర్టులో విచారణ జరపకుండానే, కారణాలు పూర్తిగా వెల్లడించకుండానే, ఒక వ్యక్తిని నిరవధికంగా నిర్బంధించే అధికారం బ్రిటిష్ ప్రభుత్వానికి ఉండేది. స్వతంత్ర ప్రభుత్వం అయ్యి ఉండి, ఇంత అన్యాయంగా ఒక మనిషిని ఇలా ఎలా నిర్బంధించ గలదు?

'నిర్లక్ష్యం ఎక్కడైనా వుండవచ్చు; కానీ, న్యాయవ్యవస్థలో వుండకూడదు.' అనే దానికి ఇంకో ఉదాహరణ : 'భూటాన్ పెగు' అని, అస్సాంకి చెందిన ఒక స్వాతంత్ర్య సమర యోధుడు. 1942 క్విట్ ఇండియా ఉద్యమం సమయంలో బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసింది. ఇతను శిక్ష పడ్డ ఖైదీ కాదు. అలాగే విచారణలో ఉన్న ఖైదీ కూడా కాదు. ఏ విచారణా లేని ఒక 'రాజకీయ నిర్బంధితుడు.' (పొలిటికల్ డిటైని.) జైల్లో వుండగానే ఇతని మానసిక ఆరోగ్యం దెబ్బతినింది. 1947 లో స్వాతంత్ర్యం వచ్చింది. అందరూ ఆ ఆనందంలో ఉన్నారు. అందరితో పాటుగా అధికారులు కూడా ఇతన్ని మర్చి పోయారు. స్వతంత్రం వచ్చాక, నాలుగు నిమిషాల్లో విడుదల కావలసిన వ్యక్తి 'న్యాయవ్యవస్థ నిర్లక్ష్యం' చేత 'స్వతంత్ర భారత జైల్లో' కూడా ఇంకో నాలుగేళ్లు వుండవలసి వచ్చింది. 1950 లో విడుదల చేశారు ఇతన్ని.

ఇలాంటి ' బెయిల్ కథలు' దేశంనిండా కోకొల్లలు. ఇంక వరవరరావు, సాయిబాబాల 'బెయిల్ నిరాకరణ కథ' గురించి మనకు తెలిసిందే. ఇంకా ఫాదర్ స్టాన్ స్వామి, ఉమర్ ఖాలిద్, గౌతమ్ నవలఖా, సుధా భరద్వాజ్, ఆనంద్ తెల్తుంబ్డే ఇలా ఎందరో! వీళ్ళందరి 'బెయిల్ కథలు' అన్నీ కూడా ఒక్కటే. రాజ్యం 'వ్యవస్థిత శత్రువులు' గా కొందర్ని భావిస్తుంది. వాళ్లకి మాత్రమే ఈ 'బెయిల్ కష్టాలు' అని అనుకోనక్కర్లేదు. వ్యవస్థ లోపలి బాధితులూ, వ్యవస్థ ప్రభావితులూ కూడా వుంటారు. వాళ్ళు కూడా ఎక్కువ సంఖ్యలో నే బెయిల్ రాక, జైళ్ళల్లో నే మగ్గిపోతున్నారు.

ఎవరైనా ఒక నిందితుడు విచారణ పూర్తయ్యే వరకూ చట్టపరంగా దోషి కాదు. కోర్టు దోషిగా తేల్చే వరకూ అతను ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడు మాత్రమే. అందువల్ల 'అవసరం లేని సందర్భాల్లో అతని స్వేచ్ఛను హరించకూడదనే' రాజ్యాంగ సూత్రం నుంచి 'బెయిల్ భావన' వచ్చింది.

కోర్టు బెయిల్ ఇచ్చేటప్పుడు సాధారణంగా చూడవలసిన అంశాలు: నిందితుడు పారిపోయే అవకాశం ఉందా? సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందా? సాక్ష్యాలను ధ్వంసం చేసే ప్రమాదం ఉందా? మళ్లీ నేరం చేసే అవకాశం ఉందా? నేరం తీవ్రత ఎంత? అనే వాటిని కోర్టులు చూడాలి. కానీ కోర్టులు ఇప్పుడు వీటిని పరిగణన లోకి తీసుకోవడం లేదు.

పోలీసులు ఛార్జి షీట్ వేశారా లేదా? సరిగా వేశారా లేదా? వెయ్యకు పోతే మళ్లీ అనుబంధ ఛార్జి షీట్ వేశారా? వీటిని మాత్రమే చూస్తున్నాయి. ఎంత ఆలస్యమైనా వీటి చుట్టూ మాత్రమే బెయిల్ తిరుగుతూ వుంటుంది. దర్యాప్తు సంస్థలకీ, పోలీసుకీ, ప్రభుత్వాలకి ప్రస్తుతానికి ఇవే కావాలి. కానీ న్యాయ వ్యవస్థలు కూడా వీటికి అనుకూలంగా పని చేయడం మాత్రం అత్యంత విచారకరం.

'బెయిల్ ఎందుకు ఇవ్వాలి? అనే అంశానికి సంబంధించి ఒక బలమైన న్యాయపరమైన తీర్పుగా 'హుస్సైనారా ఖాతూన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బిహార్ (1979)' కేసును చెప్పుకోవచ్చు. 1979లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక 'బీహార్ జైళ్లపై' ఒక సంచలన కథనాన్ని ప్రచురించింది. వేలాది మంది అండర్‌ట్రయల్ ఖైదీలు (విచారణ పూర్తికాని నిందితులు) సంవత్సరాల తరబడి జైళ్లలోనే ఉన్నారని, వారిలో చాలామంది ఆరోపించిన నేరానికి చట్టం విధించే గరిష్ఠ శిక్ష కన్నా ఎక్కువ కాలం జైలులో నే గడిపేస్తున్నారని ఆ పత్రిక రాసింది.

ఈ పరిస్థితిని ప్రశ్నిస్తూ 'హుస్సైనారా ఖాతూన్' పేరుతో సుప్రీంకోర్టులో 'హెబియస్ కార్పస్ పిటిషన్' ఒకటి దాఖలైంది. ఆ సందర్భంగా-- న్యాయమూర్తి 'పి. ఎన్. భగవతి' నేతృత్వంలోని బెంచ్ కొన్ని చారిత్రక సూత్రాలు ప్రకటించింది: త్వరిత విచారణ ( స్పీడీ ట్రయిల్) అనేది రాజ్యాంగంలోని అధికరణం 21 కింద ప్రాథమిక హక్కు అని, విచారణ పూర్తికాకముందు ఎక్కువ కాలం జైలులో ఉంచకూడదు అని; అది అవసరమైనంత మేరకు, అవసరమైన సందర్భాల్లో మాత్రమే ఉండాలి అని, పేదరికం కారణంగా ఎవరూ జైలులో ఉండకూడదు అని, నిందితుడు పారిపోయే ప్రమాదం లేకపోతే, అవసరమైతే 'వ్యక్తిగత బాండ్' పైనే విడుదల చేయవచ్చు అని, భారీ స్యూరిటీలు విధించి, వాటి వల్ల పేదలకు బెయిల్ రాకుండా చేయ కూడదు అని, ఆ తీర్పు లో చెప్పింది. ఈ తీర్పు అప్పట్లో ఎంతటి ప్రభావాన్ని చూపించిందటే, అప్పట్లో దేశం మొత్తం మీద సుమారు 40,000 మంది అండర్‌ట్రయల్ ఖైదీలు విడుదలై పోయారు.

'విచారణ శిక్ష కాదు; శిక్ష విధించే అధికారం తీర్పు తర్వాతే. ఆ వరకు వ్యక్తిగత స్వేచ్ఛను సాధ్యమైనంతవరకు కాపాడటమే బెయిల్ వ్యవస్థ లక్ష్యం.' అనే విషయాన్ని న్యాయవ్యవస్థలు గుర్తించాలి.

మాజీ జస్టిస్ లోకూర్ తన ఇంటర్ వ్యూలో ఇంకొన్ని మంచి విషయాలు కూడా చెప్పారు. 'ఇలాంటివన్నీ న్యాయ శాస్త్ర పుస్తకాల్లో వుండవని, న్యాయవ్యవస్థలే ఈ సత్యాన్ని గుర్తించాలని' చెప్పారు. అంతే కాకుండా- గత తీర్పులు ఇప్పటి తీర్పులకు మార్గ దర్శక సూత్రాలు కావాలని కూడా చెప్పారు.

నన్నూరి వేణుగోపాల్
98494 49012

# బ్యాటరీల విప్లవం.. వ్యర్థాల విస్ఫోటనం!

ప్రపంచం కాలుష్య రహిత భవిష్యత్తు వైపు పరుగులు తీస్తోంది. విద్యుత్ వాహనాలు, సౌర విద్యుత్ వంటి పచ్చని సాంకేతికతలు కొత్త ఆశలను రేకెత్తిస్తున్నాయి. అయితే ఈ అభివృద్ధి వెనుక మరో ఆందోళనకరమైన ప్రశ్నవి నిలుస్తోంది. అదే... లిథియం అయాన్ బ్యాటరీ వ్యర్థాల సమస్య.

నేటి ఆధునిక జీవనంలో మొబైల్ ఫోన్ల నుంచి విద్యుత్ వాహనాల వరకు బ్యాటరీలు కీలక శక్తి వనరులుగా మారాయి. కానీ వాటి జీవితకాలం ముగిసిన తర్వాత వాటిని సక్రమంగా రీసైక్లింగ్ చేయకపోతే భవిష్యత్తులో పర్యావరణానికి తీవ్రమైన ముప్పు తప్పదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

ఐఐటీ మద్రాస్ కెమిస్ట్రీ విభాగం పరిశోధకులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు. రాబోయే సంవత్సరాల్లో బ్యాటరీ వ్యర్థాలు భారీ స్థాయిలో పేరుకుపోయే అవకాశం ఉందని, ఇప్పటి నుంచే శాస్త్రీయ రీసైక్లింగ్ వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

**2030 నాటికి వ్యర్థాల భారమా? ప్రపంచానికి హెచ్చరిక**

అంచనాల ప్రకారం 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా సుమారు 1.1 కోట్ల మెట్రిక్ టన్నుల లిథియం బ్యాటరీ వ్యర్థాలు పేరుకుపోయే ప్రమాదం ఉంది. అదే సమయంలో సౌర విద్యుత్ విస్తరణతో పాత సోలార్ ప్యానళ్ల వ్యర్థాల సమస్య కూడా పెరగనుంది. అయితే ప్రస్తుతం ప్రపంచ బ్యాటరీ రీసైక్లింగ్ సామర్థ్యం చాలా పరిమితంగా ఉంది. కేవలం 5 నుంచి 6 శాతం వరకు మాత్రమే రీసైక్లింగ్ జరుగుతోంది. ఈ పరిస్థితి కొనసాగితే పర్యావరణ సమస్యతో పాటు విలువైన ఖనిజాల కొరత కూడా ఎదురయ్యే అవకాశం ఉంది.

**'బ్లాక్ మాస్'కు పెరుగుతున్న ప్రాధాన్యం**

వాడేసిన బ్యాటరీలు కేవలం చెత్త కాదు... అవి విలువైన ఖనిజాల నిల్వలు. రీసైక్లింగ్ ద్వారా లిథియం, కోబాల్ట్, నికెల్, రాగి వంటి లోహాలను తిరిగి పొందవచ్చు. బ్యాటరీలను శుద్ధి చేసిన తర్వాత లభించే నల్లటి పదార్థాన్ని 'బ్లాక్ మాస్' అంటారు. ఇది కొత్త బ్యాటరీల తయారీకి అవసరమైన ముఖ్యమైన ముడి పదార్థంగా ఉపయోగపడుతుంది. ప్రస్తుతం బ్యాటరీ తయారీకి అవసరమైన అనేక ఖనిజాల కోసం భారత్ విదేశాలపై ఆధారపడుతోంది. ముఖ్యంగా కోబాల్ట్ వంటి అరుదైన లోహాల కోసం దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోంది. రీసైక్లింగ్ వ్యవస్థ బలపడితే ఈ ఆధారపడటం తగ్గి, దేశ ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతుంది.

**ఐఐటీ మద్రాస్ పరిశోధనలు... భారత సాంకేతిక శక్తికి నిదర్శనం**

బ్యాటరీ వ్యర్థాల సమస్యకు పరిష్కారం చూపేందుకు ఐఐటీ మద్రాస్ ఆధునిక సాంకేతికతలపై పరిశోధనలు చేస్తోంది. తమిళనాడు విద్యుత్ బోర్డుతో కలిసి బ్యాటరీ శక్తి నిల్వ, రీసైక్లింగ్ విధానాల అభివృద్ధికి చర్యలు చేపడుతోంది. లిథియం బ్యాటరీలు అత్యంత దహనశీలమైనవి కావడంతో వాటి నిర్వహణలో ప్రత్యేక జాగ్రత్తలు అవసరం. దీనికి ద్రవ ఆధారిత హైడ్రోమెటలర్జికల్ సాంకేతికతలను ఉపయోగిస్తూ సురక్షితమైన రీసైక్లింగ్ విధానాలపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న రీసైక్లింగ్ సామర్థ్యాన్ని మరింత పెంచి రోజుకు వెయ్యి కిలోల స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ప్రయోగాలు జరుగుతున్నాయి.

**ప్రపంచ దేశాల మార్గం.. భారత్‌కు పాఠం**

చైనా, యూరప్ దేశాలు బ్యాటరీ రీసైక్లింగ్‌లో ముందంజలో ఉన్నాయి. చైనా పాత బ్యాటరీల నుంచి లిథియం, కోబాల్ట్, నికెల్ వంటి ఖనిజాలను తిరిగి పొందుతూ కొత్త బ్యాటరీల తయారీలో ఉపయోగిస్తోంది. యూరప్‌లో బ్యాటరీ తయారీ సంస్థలకే వాటి జీవితాంత నిర్వహణ బాధ్యతలను అప్పగించే విధానాలు అమలులో ఉన్నాయి. అమెరికా ఆధునిక సాంకేతికతలతో బ్యాటరీలను సురక్షితంగా విడదీసి విలువైన పదార్థాలను తిరిగి పొందుతోంది. జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు కూడా పరిశోధన, పునర్వినియోగ విధానాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి.

**పచ్చని భవిష్యత్తుకు రీసైక్లింగ్ మార్గం**

విద్యుత్ వాహనాల విస్తరణ ఎంత అవసరమో, వాటి నుంచి వచ్చే వ్యర్థాల నిర్వహణ కూడా అంతే ముఖ్యం. కేంద్ర ప్రభుత్వం, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు కలిసి సమగ్ర రీసైక్లింగ్ వ్యవస్థను నిర్మించాల్సిన సమయం వచ్చింది. సాంకేతిక ప్రగతి ప్రకృతికి భారంగా మారకుండా, భూమికి మేలు చేసే సాధనంగా నిలవాలంటే బాధ్యతాయుతమైన వినియోగం తప్పనిసరి. "బ్యాటరీలు రేపటి ప్రపంచానికి శక్తినిస్తాయి... కానీ వాటి వ్యర్థాలను జాగ్రత్తగా నిర్వహించినప్పుడే ఆ శక్తి భవిష్యత్ తరాలకు ఆశగా మారుతుంది."

శ్రీశైలం దూడం
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్,
జగిత్యాల
9133947176

## స్నేహం ఒక సంపద

స్నేహానికి ఎల్లలు లేవు
స్నేహానికి పరిమితులు లేవు
స్నేహం ఒక మహా ప్రవాహం
మధుర జ్ఞాపకాలు స్నేహితులు!!

స్నేహం త్యాగాన్ని కోరుతుంది
ఆప్యాయత ప్రేమను కురిపిస్తుంది
స్నేహం సంతృప్తిని కలిగిస్తుంది
అభివృద్ధిని చేకూరుస్తుంది!!




సన్మార్గంలో పయనింపజేస్తుంది
స్నేహమేరా జీవితం
స్నేహమేరా శాశ్వతం
స్నేహానికన్న మిన్న ఈ లోకాన లేదు!!

స్నేహితులు దినోత్సవం సందర్భంగా..

రచన
దేవులపల్లి రమేశ్,
కవి, రచయిత
సిద్దిపేట, నంగునూర్
9963701294













## మహిళల ఆర్థిక సాధికారతకు శక్తి క్యాంటీన్లు

**కానాజిగూడలో ప్రారంభించిన ఎమ్మెల్యే మర్రి**



**అల్వాల్, ఆగస్టు 1 (జనంసాక్షి) :** మహిళా పొదుపు సంఘాల సభ్యులు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు దోహదపడతాయని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆల్వాల్ మున్సిపల్ పరిధిలోని కానాజిగూడ మెయిన్‌రోడ్డులో శ్రీదుర్గా మహిళా పొదుపు సంఘానికి మంజూరైన శక్తి క్యాంటీన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. మహిళలకు ఉపాధి కల్పిస్తూ కుటుంబాల ఆర్థికాభివృద్ధికి తోడ్పడే ఇటువంటి కార్యక్రమాలను ప్రభుత్వం మరింత విస్తరించేందుకు కృషి చేస్తోందన్నారు. క్యాంటీన్‌లో మిర్చి బజ్జి, పునుగులు, సమోసా, వడ, చపాతీ, టీ తదితర అల్పాహార పదార్థాలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సబితా అనిల్‌కిషోర్ గౌడ్, ఆల్వాల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సుధాకర్, కమ్యూనిటీ ఆర్గనైజర్ ప్రవీణ్, పలువురు నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# గ్రామాల సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

- **3.40 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి, ఆగస్టు 1 (జనంసాక్షి) :** వనపర్తి నియోజకవర్గంలోని ఏదుల మండల కేంద్రంలో శనివారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి రూ.3.40 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తూ ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ సేవలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూ.2.25 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన తహసీల్దార్ కార్యాలయ భవన సముదాయానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ భవనం ద్వారా రెవెన్యూ సేవలు ప్రజలకు మరింత వేగంగా, సమర్థవంతంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అనంతరం రూ.65 లక్షల వ్యయంతో గ్రామానికి ఏర్పాటు చేస్తున్న ఆల్టర్నేట్ విద్యుత్ లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలో 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు రూ.24 లక్షలతో



చేపట్టిన విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను ప్రారంభించారు. గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో రూ.8 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులకు కూడా ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పారదర్శక పాలనతో ప్రతి రూపాయి ప్రజల సంక్షేమం, అభివృద్ధికే ఖర్చు చేస్తున్నామని తెలిపారు. విద్యుత్, వైద్యం, రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, మౌలిక వసతుల అభివృద్ధితో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని పేర్కొన్నారు. వనపర్తి నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల మార్కెట్ యార్డ్ అధ్యక్షులు వెంకటేష్, ఉపాధ్యక్షులు సత్యశీలారెడ్డి, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, జిల్లా గృహ నిర్మాణశాఖ అధికారి విటోబా, సింగిల్ విండో అధ్యక్షులు రఘు, మండల అధ్యక్షులు సుఖేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ పరుశురాం, రాష్ట్ర ఎస్సీ సెల్ డిపార్ట్మెంట్ ప్రధాన కార్యదర్శి కొంకి వెంకటేష్, ఏదుల మండలం ఇంచార్జ్ కోళ్ల వెంకటేష్, నాయకులు పర్వతాలు, జమ్మి మల్లేష్, జానకి రాములు, ఆయన మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యువకులు, పెద్దలు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలి

- **ప్రభుత్వ భూమిలో 25 ఎకరాలు పేదలకు ఇవ్వాలని సీపీఎం ధర్నా**

**హయత్‌నగర్, ఆగస్టు 1 (జనం సాక్షి) :** హయత్‌నగర్ మండలం సాహెబ్‌నగర్ ప్రాంతంలోని 71వ సర్వే నంబర్‌లో ఉన్న 25 ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించాలని సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటంలో భాగంగా శనివారం ఇబ్రహీంపట్నం, కందుకూరు ఆర్డీవో కార్యాలయాల ఎదుట వందలాది మందితో ధర్నా నిర్వహించారు. పేదల జాబితాలను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని అనేక సంవత్సరాలుగా సాహెబ్‌నగర్ ప్రాంతంలో పోరాటం చేస్తున్నామని తెలిపారు. 2023లో ఇళ్ల స్థలాల కోసం పోరాడిన పేదలపై అక్రమ కేసులు నమోదు చేసి ఐదు రోజుల పాటు జైలుకు పంపినా, పేదలు వెనక్కి తగ్గకుండా తమ పోరాటాన్ని



కొనసాగిస్తున్నారని అన్నారు. గత ఏడాది వేలాది మందితో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, పేదల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించకపోతే మరోసారి ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించినట్లు తెలిపారు. దీంతో స్పందించిన కలెక్టర్ ఇబ్రహీంపట్నం, కందుకూరు ఆర్డీవోలకు పేదల జాబితాలను సేకరించి, సర్వే నిర్వహించి వివరాలను సమర్పించాలని ఆదేశించినట్లు చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పేదల జాబితాలను సిద్ధం చేసి, వాటిని సంబంధిత ఆర్డీవో కార్యాలయాలకు అందజేసినట్లు సీపీఎం నాయకులు తెలిపారు. పేదల అర్హతను పరిశీలించి ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు కేటాయించే ప్రక్రియను వెంటనే చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ధర్నాకు ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, సరూర్‌నగర్ సర్కిల్ కార్యదర్శి సీహెచ్.వెంకన్న నాయకత్వం వహించారు. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.చంద్రమోహన్, జగదీష్, జిల్లా కమిటీ సభ్యులు డి.కిషన్, బుగ్గ రాములు, నాయకులు వీరయ్య, గణేష్, సీహెచ్.ఎల్లేష్, కాశయ్య, అంజి నాయక్, పోలే రమేష్, రాధమ్మ, సుమన్ నాయక్, శక్తి, మధు, కిరణ్, రేణుక, వెంకటేష్, కురుమయ్య, వజ్రమ్మ, బిక్షపతి, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు సవరణలో వేగం పెంచాలి



**అల్వాల్, ఆగస్టు 1 (జనంసాక్షి) :** ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలని కాంగ్రెస్ నాయకులు బీఎల్‌ఓలను కోరారు. ఆల్వాల్‌లోని భూదేవి నగర్ పార్కు వద్ద కొనసాగుతున్న ఓటరు సవరణ ప్రక్రియను శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలు మాట్లాడుతూ, ఇప్పటివరకు సుమారు 60 శాతం మేర సవరణ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. నగరంలో నివసిస్తున్నప్పటికీ, ఉద్యోగాలు, ఇతర కారణాలతో తమ స్వగ్రామాల్లోని ఓటును అలాగే కొనసాగిస్తున్న వారు అధికంగా ఉండటంతో స్థానికంగా సవరణ ప్రక్రియ ఆశించిన వేగంతో సాగడం లేదన్నారు. అర్హులైన ఓటర్ల వివరాల సవరణ, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు కోసం ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తూ దరఖాస్తులు స్వీకరిస్తున్నామని వివరించారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, ప్రతి అర్హుడైన ఓటరు గడువులోపు వివరాలు సవరించుకుని ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకునేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూదేవి నగర్ డివిజన్ అధ్యక్షుడు మల్లెల శివ, నిమ్మ అశోక్ రెడ్డి, కృష్ణ గౌడ్, రాజేందర్, లక్ష్మణరావు, భాస్కర్, సుదర్శన్ రెడ్డి, మల్లేష్ గౌడ్, మల్లేష్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం

- **జిల్లా ఎస్పీ.టి. శ్రీనివాసరావు**

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 1 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా జూలై 1 నుంచి జూలై 31 వరకు నిర్వహించిన 12వ ఆపరేషన్ ముస్కాన్ విజయవంతంగా పూర్తయిందని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు తెలిపారు. గద్వాల, అలంపూర్ శాసనసభ నియోజకవర్గాల వారీగా ఒకొక్క శాసనసభ నియోజకవర్గానికి ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి హోటళ్లు, వర్క్‌షాపులు, పరిశ్రమలు,వాణిజ్య సంస్థలు,దుకాణాలు, ఇతర ఉపాధి కేంద్రాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. 12వ ఆపరేషన్ ముస్కాన్ సందర్భంగా మొత్తం 35 ఎఫ్ఐఆర్‌లు,చట్టపరమైన కేసులు నమోదు చేసి,బాల కార్మికత్వాన్ని ప్రోత్సహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో మొత్తం 113 మంది బాలబాలికలను గుర్తించి రక్షించినట్లు వెల్లడించారు. రక్షించిన వారిలో 109 మంది బాలురు, 4 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. వీరిలో 91 మంది తెలంగాణ రాష్ట్రానికి చెందినవారు కాగా, 22 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన పిల్లలు ఉన్నారని పేర్కొన్నారు. ఆపరేషన్ ముస్కాన్ సందర్భంగా 14 సంవత్సరాల లోపు వయస్సు గల 12 మంది చిన్నారులను పనిలో పెట్టుకున్న యజమానులపై 11 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే 15 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల 34 మంది బాలబాలికలను పనిలో పెట్టుకున్న 24 మంది యజమానులపై



జిల్లా కార్మిక శాఖ ద్వారా ఐఆర్ నమోదు చేసి, చట్టప్రకారం జరిమానాలు విధించినట్లు వెల్లడించారు. మరికొంతమంది పిల్లలు కుటుంబ సభ్యులతో కలిసి లేదా సొంత కుటుంబ వ్యాపారాల్లో పనిచేస్తున్నట్లు గుర్తించడంతో వారిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరిచామని తెలిపారు. అనంతరం తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి, పిల్లలను తిరిగి విద్యాభ్యాసం వైపు మళ్లించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.ఈ ఆపరేషన్‌లో టీమ్-ఏ తరపున ఎస్ఐ శేఖర్,పోలీసు సిబ్బంది,లేబర్ శాఖ, డీసీపీయూ, చైల్డ్ హెల్ప్‌లైన్-1098, ఆర్డీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.అలాగే టీమ్-బి తరపున ఎస్ఐ సురేష్, పోలీసు సిబ్బంది, లేబర్ శాఖ, డీసీపీయూ, చైల్డ్హెల్ప్‌లైన్-1098,ఎన్‌జీవో ప్రతినిధులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు.

## ఇళ్లు కూల్చకుండా రోడ్డు విస్తరణ చేపట్టాలి

- **ఈటలకు నవజీవన్ రెడ్డి వినతి**



**హయత్‌నగర్, ఆగస్టు 1 (జనం సాక్షి) :** హయత్‌నగర్ - తారమతిపేట్ 100 అడుగుల రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయే పరిస్థితిలో ఉన్న శుభోదయ కాలనీ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి బాధిత కుటుంబాలతో కలిసి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా సమస్యను వివరిస్తూ వినతిపత్రం సమర్పించారు. శుభోదయ కాలనీలో మదర్ డెయిరీ సమీపంలో ప్రభుత్వం గతంలో కేటాయించిన 60 గజాల స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని అనేక సంవత్సరాలుగా నివాసం ఉంటున్నామని బాధితులు తెలిపారు. ప్రస్తుతం ప్రతిపాదిత 100 అడుగుల రోడ్డు విస్తరణలో తమ ఇళ్లు పూర్తిగా ప్రభావితమవుతున్నాయని, దీంతో వందకు పైగా కుటుంబాలు నిరాశ్రయులయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణకు తాము వ్యతిరేకం కాదని, అయితే పేదల ఇళ్లను కూల్చకుండా రహదారికి ఎదురుగా ఉన్న ఖాళీ ప్రభుత్వ భూమి వైపు నుంచి రోడ్డు విస్తరణ చేపట్టేలా సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకోవాలని ఎంపీ ఈటల రాజేందర్‌ను కోరారు. బాధితుల వినతిని స్వీకరించిన ఎంపీ ఈటల రాజేందర్ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, బాధితులకు న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నవజీవన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ, అభివృద్ధి పనులు చేపట్టడం అవసరమే అయినప్పటికీ, అభివృద్ధి పేరుతో పేద ప్రజల ఇళ్లు, జీవనాధారం దెబ్బతినకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని కోరారు. శుభోదయ కాలనీ వాసులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శుభోదయ కాలనీకి చెందిన బాధిత కుటుంబ సభ్యులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వినాయక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అరుదైన వైద్య చికిత్స

- **క్యాన్సర్ గడ్డ విజయవంతంగా తొలగింపు**


**తాండూరు, ఆగస్టు 1 (జనంసాక్షి) :** వినాయక సూపర్ స్పెషాలిటి ఆసుపత్రిలో వైద్యులు మరోసారి తమ నైపుణ్యాన్ని నిరూపించారు. అరుదైన కేసుగా వచ్చిన ఒక క్యాన్సర్ గడ్డను ఆసుపత్రి డాక్టర్ల బృందం అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్స ద్వారా విజయవంతంగా తొలగించింది.ఆసుపత్రి వర్గాల సమాచారం ప్రకారం, గత కొంత కాలంగా తీవ్ర అసౌకర్యంతో బాధపడుతున్నతాండూరు పట్టణానికి చెందిన శశికళ ఇక్కడికి వచ్చారు. పరీక్షల్లో శరీరంలోని కీలక భాగానికి దగ్గరగా పెరిగిన క్యాన్సర్ గడ్డ ఉన్నట్లు గుర్తించారు. ఇది సాధారణ శస్త్రచికిత్సకు వీలులేని కేసు కావడంతో ఆసుపత్రి ప్రసూతి మరియు గైనకాలజీ స్పెషలిస్ట్ వైద్యులు డా. అమృత్,క్యాన్సర్ సర్జరీ వైద్యులు. అర్జున్,అనస్థీషియా వైద్యులు.హరీష్,డాక్టర్ అర్జున్ కలిసి ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు .గంటల పాటు సాగిన ఆపరేషన్ లో ఆధునిక సాంకేతిక పరికరాల సహాయంతో 10.6కేజీ ల గడ్డను పూర్తిగా తొలగించినట్లు ప్రధాన సర్జన్ తెలిపారు.



ప్రస్తుతం రోగి ఆరోగ్యం నిలకడగా ఉందని, వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నారని ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించింది.ఈ విజయవంతమైన చికిత్స పట్ల స్థానికులు మరియు రోగి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. అత్యాధునిక వసతులతో, నిపుణులైన డాక్టర్లతో వినాయక మల్టీ స్పెషల్ సూపర్ ఆసుపత్రి ఇలాంటి అరుదైన కేసులను కూడా సమర్థంగా నిర్వహిస్తోందని వారు అన్నారు.ఆసుపత్రి సీఈఓ వర్మ ప్రశాంతి మాట్లాడుతూ, రోగులకు సకాలంలో, నాణ్యమైన చికిత్స అందించడమే తమ లక్ష్యమన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి క్లిష్టమైన ఆపరేషన్లను మరింత విజయవంతంగా చేస్తామని చెప్పారు.వినాయక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో 24గంటలు ఎడురోజుల పాటు సేవలు కోనసాగుత యన్నారు.గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా అత్యాధునిక వైద్యం అందాలని తమ ఉద్యేశమన్నారు.అందుకోసమే తాండూరులో వినాయక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించామని వెల్లడించారు. ఆధునిక టెక్నాలజీతో అన్ని వైద్య సేవలు ఒకే చోట ఉన్నాయని వివరించారు.

## జేబీఐఈటీలో ఘనంగా పట్టభద్రుల దినోత్సవం

**మొయినాబాద్, ఆగస్టు 1 (జనం సాక్షి) :** జేఎన్‌టీయూహెచ్‌కు శాశ్వత అనుబంధం, యూజీసీ స్వయంప్రతిపత్తి కలిగిన జె.బి. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (జేబీఐఈటీ)లో 15వ పట్టభద్రుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. బీటెక్, ఎంటెక్, ఎంబీఏ కోర్సులను పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన





విద్యార్థులను బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. అకాడమిక్ వస్త్రధారణలో అధ్యాపకులు, విభాగాధిపతులు, అతిథుల ఊరేగింపుతో కార్యక్రమం ప్రారంభమైంది. జేబీ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి జె.వి. కృష్ణారావు వార్షిక నివేదికను సమర్పిస్తూ.. విద్యా ప్రమాణాల పెంపు, ఆధునిక మౌలిక వసతులు, పరిశోధన, ప్లేస్‌మెంట్లు, పరిశ్రమలతో భాగస్వామ్యంలో కళాశాల సాధించిన పురోగతిని వివరించారు.ముఖ్య అతిథులుగా జేపీ మోర్గాన్ చేజ్ అండ్ కో.వైస్ ప్రెసిడెంట్ మారియో డేవిడ్, డైపుకు ఇంట్రాలాజిస్టిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ శ్రీనివాస్ గారిమెళ్ల, ప్రముఖ శాస్త్రవేత్త అమిత్ కుమార్ చతుర్వేది పాల్గొన్నారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, నైపుణ్యాలను పెంపొందించుకొని పరిశ్రమలు, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని వారు సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పద్మశ్రీ ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ.. విద్య వ్యక్తిగత విజయానికే కాకుండా సమాజాభివృద్ధికి దోహదపడాలని అన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా. పి.సి. కృష్ణమాచారి పట్టభద్రులకు డిగ్రీలను అందజేశారు. కార్యక్రమం అనంతరం పట్టభద్రులు అధ్యాపకులు, కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యం

- **పిఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి. వెంకట్ రెడ్డి**

**మాగనూర్, ఆగస్టు 1 (జనం సాక్షి) :** ఉపాధ్యాయుల సంక్షేమనే పి ఆర్ టి యు లక్ష్యం అని ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం మాగనూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వాడ్వాట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాగనూర్ ఎంపీయుపిఎస్ కొత్తపల్లి ఎంపీపీ ఎస్ వాడ్వాట్ మాగనూర్ తదితర పాఠశాలలో పి ఆర్ టి యు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించా రు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పి ఆర్ టి యు టి ఎస్ నిరంతరము ఉపాధ్యాయు ల సంక్షేమము, శ్రేయస్సు కోసము పనిచేస్తుందని అన్నారు. ప్రస్తుతము రాష్ట్ర ప్రభుత్వము పదోన్నతులు బదిలీలు రెండు సంవత్స రాలు చేయడం జరిగిందని అందుకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఇన్ సర్వీస్ టీచర్ల కోసం ప్రత్యేకంగా టెట్ నిర్వహిం చడం జరుగుతుందని టెట్ ఫలితాలు



అనంతరము పదోన్నతులు బదిలీలు చేపట్టాలని కోరారు. హెల్త్ కార్డులు త్వరగా పకడ్బం దీగా అమలయ్యేలా చూడటం జరుగుతుందని ఎవరు ఎలాంటి ఆందోళ నలకు గురికా వద్దని సూచించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వము ఈ నెల 31వ తేదీ లోగా పి ఆర్సీ డిఏలు ప్రకటించకపోతే సిపిఎస్ మీద నిర్ణయం తీసుకోకపోతే పెద్ద మొత్తంలో ఉద్యమ బాటకు సిద్ధపడి ఇప్పటికే రాష్ట్ర సంఘం ధర్నా నోటీసును ఇవ్వడం జరిగిందని అన్నారు. ఉపాధ్యాయులు పనిచేసే సంఘాలను గుర్తించాలని సూచించారు. వీరి మాటలకు ఆకర్షణ చెంది యుటిఎఫ్ మండల అధ్యక్షులు రాఘవేంద్ర చారి పి అర్ టి యు సంఘంలో చేరారు. రాఘవేంద్ర చారి కి జిల్లా అధ్యక్షులు వై జనార్దన్ రెడ్డి వారి చేతుల మీదుగా సభ్యత్వం అందజే సి సంఘంలోకి ఆహ్వానము పలుకుతూ పి అర్ టి యు కుటుంబంలో అందరం కలిసి మెలిసి ఉపాధ్యా యుల సంక్షేమం కోసం అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు పని చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎం నరసింహారెడ్డి కోట్ల శ్రీనివాసులు మండల శాఖ అధ్యక్షులు బలరాం ప్రధాన కార్యదర్శి ఈ తిమ్మన్న గౌరవ అధ్యక్షులు శ్రీనివాసు లు జిల్లా మహిళా అసోసి యేట్ అధ్యక్షురాలు సంధ్య జిల్లా ఉపాధ్యక్షురాలు హిందువు రాణి జిల్లా ఆర్గనై జింగ్ కార్యదర్శి ప్రశాంత్ కుమార్ సీనియర్ సభ్యులు పురుషోత్తం ప్రాణే చారి శ్రీనివాసులు రాజిరెడ్డి శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
02 ఆగస్టు 2026

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సామాజిక బాధ్యత

- ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ పేర్లతో తనిఖీలు
- సంగారెడ్డి జిల్లాలో 173 మంది బాల కార్మికులకు విముక్తి
- బాలలను కార్మికులుగా పనిలో పెట్టుకున్న 136 మంది కేసులు నమోదు



**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 1 (జనం సాక్షి) :** బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయని, జనవరి నెలలో ఆపరేషన్ స్మైల్, జూలై నెలలో ఆపరేషన్ ముస్కాన్ పేర్లతో విస్తృత తనిఖీలు చేపట్టి బాల కార్మికులను గుర్తించి, రక్షించడం జరుగుతుందని అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ ఎక్స్‌లో భాగంగా గత నెల జూలై 1 నుండి 31 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీలలో 173 మంది బాల కార్మికులను రక్షించడం జరిగిందన్నారు. వీరిలో 168 మంది బాలురు, 05 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. బాలలను చట్టవిరుద్ధంగా పనిలో పెట్టుకున్న 136 మంది యజమానులపై కేసులు నమోదు చేసి, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. రక్షించిన బాలలను సంబంధిత శాఖల సమన్వయంతో పునరావాసం కల్పించి, విద్యాభ్యాసం కొనసాగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బాలల హక్కులను పరిరక్షించడం, వారికి సురక్షితమైన బాల్యాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆపరేషన్ ముస్కాన్ - ఎక్స్‌ను విజయవంతం చేయడంలో పోలీసు శాఖ, కార్మిక శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, విద్యాశాఖ, మెడికల్ డిపార్ట్మెంట్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయం అభినందనీయం అన్నారు. 18 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలను పనిలో పెట్టుకోవడం, వెట్టిచాకిరి చేయించడం, బలవంతంగా భిక్షాటన చేయించడం, పశువుల కాపరులుగా, కిరాణా దుకాణాలు, మెకానిక్ షాపులు, హోటళ్లు, ఇటుక బట్టీలు, పౌల్ట్రీ ఫారాలు, పరిశ్రమలు లేదా ఇతర పనులు చేయడం చట్టరీత్యా నేరమని అదనపు ఎస్పీ హెచ్చరించారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు కనిపించినా లేదా బాలలపై వేధింపులు, దోపిడీ జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ - 1098 లేదా డయల్-100కు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అదనపు ఎస్పి తెలిపారు.

## ఆరోగ్య సేవలను సమర్థవంతంగా అందించాలి

- మెదక్ జిల్లా ప్రోగ్రాం అధికారి నవ్య



**పెద్దశంకరంపేట, ఆగస్టు 1 (జనం సాక్షి) :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య సేవలను సమర్తవంతంగా అందించాలని మెదక్ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ నవ్య పేర్కొన్నారు. సోమవారం పెద్ద శంకరంపేట లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పెద్ద శంకరంపేట రేగోడు అల్లాదుర్గం గడి పెద్దాపూర్ పిహెచ్ సి సిబ్బందితో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పెద్ద శంకరంపేట మండల వైద్యాధికారి షర్ఫోద్దిన్ మాట్లాడుతూ గ్రామాలలో తప్పనిసరిగా పరిశుభ్రతను పాటించాలని.. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పి హెచ్ సి నాకు సంబంధించిన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ హాస్టల్లో అకస్మాత్తుగా తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ ఉమా హారతి

**నిజాంపేట్, ఆగస్టు 1 (జనం సాక్షి) :** నిజాంపేట్ కేంద్రం మండలంలో శనివారం రోజున ఎస్సీ బాలుర వసతి గృహం అకస్మాత్తుగా తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ ఉమా హారతి మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు పౌష్టికాహారాలు అందించాలని వసతి గృహాన్ని గదులకు మరుగుదొడ్లు చక్కటి వాతావరణం లో విద్యార్థులకు ఉంచాలని అధికారులకు సూచించారు విద్యార్థుల హాజరు పట్టికను మెనూ పట్టికను పరిశీలించారు విద్యార్థులకు సరైన మార్గంలో నడిపించాలని నేటి పౌరులే రేపటి బావి భారత పౌరులు గా ఎదగాలని దీనికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ కావ్య, తాసిల్దార్ నాగజ్యోతి ,మాజీ ఎంపిటీసీ లింగారెడ్డి, ఉప సర్పంచ్ రామచంద్ర రావు, కాంగ్రెస్ నాయకులు రాధా కిషన్, జాల శంకర్, హాస్టల్ వార్డెన్ రవి, ఆర్ ఐ జాన్సన్, సందీప్, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణలో జనసేన బలోపేతమే ప్రధాన ఎజెండా

**మహబూబ్ నగర్ బ్యూరో, ఆగస్టు 1 (జనం సాక్షి) :** మహబూబ్‌నగర్ తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీని క్షేత్రస్థాయి నుంచి తిరుగులేని రాజకీయ శక్తిగా బలోపేతం చేయడమే తమ ప్రధాన అజెండాగా ముందుకు సాగుతున్నామని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ తాళ్లూరి రామ్ స్పష్టం చేశారు. జనసేన రాష్ట్ర నాయకులు, జిల్లా ఇన్‌చార్జ్ శ్రీ మేడ రామకృష్ణ నేతృత్వంలో మహబూబ్‌నగర్ జిల్లా, భూత్‌పూర్ రోడ్డులోని ఎస్.ఎన్. కన్వెన్షన్ హాల్‌లో శనివారం అత్యంత వైభవంగా నిర్వహించిన మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా తాళ్లూరి రామ్ మాట్లాడుతూ... పాలమూరు జిల్లాలో జనసేన జెండాను రెపరెపలాడిస్తూ, పార్టీని క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో మేడ రామకృష్ణ గారు వహిస్తున్న నాయకత్వ పాత్ర అత్యంత శ్లాఘనీయమని కొనియాడారు. రాత్రింబవళ్లు శ్రమిస్తూ కార్యకర్తలకు కొండంత అండగా నిలుస్తున్న రామకృష్ణ జిల్లా పార్టీకి నిజమైన వెన్నుముక అని ప్రశంసించారు. 2014 పార్టీ ఆవిర్భావం నుండి సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తున్న కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ నేలపై జనసేన గొంతుక నిరంతరం బలంగా వినిపించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పార్టీ ప్రచార కార్యదర్శి శ్రీ సాగర్ ఆర్.కె. నాయుడు మాట్లాడుతూ... యువత బలంతో రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో జనసేన కీలక పాత్ర పోషించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు పాలమూరు నడిబొడ్డున ఉన్న అమరవీరుల స్థూపం నుండి సమావేశ ప్రాంగణం వరకు జనసైనికులు చేపట్టిన భారీ బైక్ ర్యాలీ నగరంలో పండగ వాతావరణాన్ని తలిపించింది. నేతలు అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా అంజలి ఘటించారు. ఈ ఆత్మీయ సమ్మేళనం వేదికగా మేడ రామకృష్ణ దిశానిర్దేశంలో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రముఖ నాయకుడు జిల్లా జనార్ధన్ రెడ్డి సుమారు 250 మంది అనుచరులు, మద్దతుదారులతో కలిసి జనసేన పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో దుంపటి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు ఎం. దామోదర్ రెడ్డి, మేకల సతీష్ రెడ్డి, ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, డాక్టర్ గడల శ్రీనివాస్, అల్లాడి తనీష్, చిరాగ్ ప్రజీత్ గౌడ్, మచ్చా సుధాకర్, తనుజా రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, ప్రేమ్ గాంధీ, సంతోష్ నాయక్, పాటు పెద్ద ఎత్తున జిల్లా నాయకులు, వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.



## ఛలో హైదరాబాద్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



**నాగలిగిద్ద, ఆగస్ట్ 1 (జనం సాక్షి) :** ఉపాధ్యాయుల ఉద్యోగ, ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టిపియుయస్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం నిర్వహించిన 'ఛలో హైదరాబాద్' మహాధర్నాకు నారాయణఖేడ్ డివిజన్ పరిధి నుంచి టీపీయూఎస్ నాయకులు, ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయడం లేదని, పి ఆర్ సి గడువు ముగిసినా కొత్త పి ఆర్ సి ని ప్రకటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎన్నికల ప్రధాన హామీ అయిన సిపియస్ రద్దు చేసి ఓ పి యస్ అమలు, 100 విడతల ఏరియర్స్ బకాయిల చెల్లింపు, జీపీఫ్ బకాయిల విడుదల, సరెండర్ బిల్లుల చెల్లింపు, హెల్త్ కార్డుల సమర్థవంతమైన అమలు వంటి కీలక డిమాండ్లు మూడేళ్లు గడిచినా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లన్నింటినీ నెరవేర్చాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ రాష్ట్ర సేవ్‌కో కన్వీనర్ చంద్రశేఖర్, జిల్లా నాయకులు వినయ్, లక్ష్మణ్, రామకృష్ణ, డివిజన్ అధ్యక్షుడు జగదీశ్వర్, మండలాల నాయకులు మచ్చుందర్, మహేష్, సంతోష్ రెడ్డి, రంజిత్, శ్రీను, ఓం బసవ, రతన్ తదితరులు పాల్గొన్నారు.

# యూడీఐడీ కార్డుల జారీని వేగవంతం చేయాలి

**మెదక్ బ్యూరో, ఆగస్టు 1 (జనం సాక్షి) :** జిల్లాలో దివ్యాంగులకు సంబంధించిన యూడీఐడీ కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్ దరఖాస్తులు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నగేష్ అధికారులను ఆదేశించారు. శనివారం సెర్ప్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి దివ్య దేవరాజన్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా యూడీఐడీ కార్డుల జారీ పురోగతి, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల కుట్టింపు పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సెర్ప్ సీఈఓ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15న కొత్త పింఛన్ల పంపిణీకి సిద్ధమవుతున్న నేపథ్యంలో యూడీఐడీ దరఖాస్తుల పెండింగ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తులను సకాలంలో పరిశీలించి కార్డుల జారీ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల కుట్టింపు పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. యూనిఫాంలు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నగేష్ పాల్గొన్నారు. జిల్లాలో 2025 మార్చి 1వ తేదీ నుంచి ఇప్పటివరకు మొత్తం 1,523 యూడీఐడీ కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 13 దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, అదనపు డీఆర్‌డీఓ సరస్వతి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, వెమ్మపిడి హనుమంతరెడ్డి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 1 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంజనీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా యువమోర్చా జిల్లా అధ్యక్షుడు నల్లవతల అరవింద్ నాయకత్వం వహించారు. అనంతరం జరిగిన సభలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు ఇంజనీరింగ్ విద్యార్థులను అవమానించే విధంగా ఉన్నాయని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకుండా విద్యార్థులే ఫీజులు చెల్లించుకోవాలని చెప్పడం సరైంది కాదని విమర్శించారు. అలాగే విద్యార్థుల సామర్థ్యాన్ని తక్కువ చేసి మాట్లాడడం తెలంగాణ విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, జిల్లా అధికార ప్రతినిధి నక్క మహేష్, యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల శివ, జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షుడు ఖలీల్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాసులు, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు రవి, గోపీనాథ్, బాలపీర్, నరసింహా, చందు, నవీన్, చిన్న రాయుడు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువకులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

## విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన

- కోస్గి జూనియర్ సివిల్ జడ్జి వడ్లూరి సుష్మిత



**మద్దూరు, ఆగస్టు 1 (జనం సాక్షి) :** కోస్గి జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి వడ్లూరి సుష్మిత శనివారం మద్దూర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర), గురుకుల పాఠశాల, గీతాంజలి పాఠశాలతో పాటు పెదిరిపాడు కేజీబీవీ బాలికల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడిన జడ్జి వారి విద్యాభ్యాసం, పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాలు, సమస్యలు, అవసరాలు గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని జీవితంలో మంచి స్థాయికి చేరుకోవాలని సూచించారు. విద్యతో పాటు మంచి నడవడి, చట్టాలపై అవగాహన కూడా ప్రతి విద్యార్థికి అవసరమని తెలిపారు. అనంతరం గీతాంజలి పాఠశాలలో విద్యార్థినులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పోక్సో చట్టం గురించి సమగ్ర అవగాహన కల్పించారు. బాలలపై లైంగిక వేధింపులు, దాడులు, దుర్వినియోగాన్ని అరికట్టేందుకు రూపొందించిన పోక్సో చట్టంలోని ముఖ్యమైన అంశాలను వివరించారు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. బాలికలు తమ హక్కులను తెలుసుకొని అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి సంఘటన జరిగినా దాచిపెట్టకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. విద్యార్థుల భద్రత, వారి హక్కుల పరిరక్షణలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమిష్టిగా బాధ్యత వహించాలని ఆమె పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ బాలల రక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించినప్పుడే సురక్షిత వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మద్దూర్ ఏఎస్ఐ ఉస్మాన్, పోలీస్ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రంలో అధునాతన సాంకేతిక కేంద్రాలు

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 1 (జనం సాక్షి) :** అవసరాలకు అనుగుణంగా పరిశ్రమలకు అవసరమైన యువతకు ఆధునిక నైపుణ్యాలను అందించి, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలలో వారికి ఉపాధి అవకాశాలను మెరుగుపరచే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ సహకారంతో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలను అధునాతన సాంకేతిక కేంద్రాలుగా అభివృద్ధి చేసిందని ఉపాధి కల్పన మరియు శిక్షణ శాఖ ప్రాంతీయ ఉపసంచాలకులు సీతారాములు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని 65 ప్రభుత్వ ఐటీఐలను అత్యాధునిక మౌలిక సదుపాయాలు, ఆధునిక ప్రయోగశాలలు, అధునాతన యంత్ర పరికరాలు మరియు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన పాఠ్య ప్రణాళికతో కూడిన అధునాతన సాంకేతిక కేంద్రాలుగా తీర్చిదిద్దారు. ఈ ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం, టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ భాగస్వామ్యంతో అమలు చేశారు. గద్వాల ఏటీసీలలో క్రింది ఆరు దీర్ఘకాలిక అధునాతన ట్రేడ్లు అందుబాటులో ఉన్నాయని, ప్రస్తుతం అడ్మిషన్స్ ప్రక్రియ ప్రారంభమైనది ఆయన తెలిపారు. జిల్లాలో సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్ టెక్నీషియన్ మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సు, మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ టెక్నీషియన్ కోర్సు, ఇంజినీరింగ్ డిజైన్ టెక్నీషియన్ కోర్సు, వర్చువల్ అనాలిసిస్ అండ్ డిజైనర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కోర్సులు రోబోటిక్స్, పారిశ్రామిక ఆటోమేషన్,ఎలక్ట్రిక్ వాహనాలు,ఉత్పత్తి రూపకల్పన,డిజిటల్ తయారీ విధానాలు మరియు ఆధునిక ఉత్పత్తి వ్యవస్థలు వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలపై దృష్టి సారిస్తున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా ఆధునిక పరిశ్రమల మారుతున్న అవసరాలకు అనుగుణంగా అత్యున్నత నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను తయారు చేయడంతో పాటు తెలంగాణ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పడే నైపుణ్యవంతులైన యువశక్తిని సృష్టించడం లక్ష్యంగా పెట్టుకుంది. సాంప్రదాయ వృత్తి విద్యా శిక్షణ, ప్రస్తుత పరిశ్రమల అవసరాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించి, ఐటీఐ విద్యార్థులను ఉద్యోగాలకు మరింత సిద్ధంగా తయారు చేయడం కోసం ఈ భాగస్వామ్య కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. గద్వాల జిల్లా విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మొహమ్మద్ కలీం, ఇంచార్జి ట్రైనింగ్ ఆఫీసర్ మొహమ్మద్ జహంగీర్, కళాశాల సురింటెండె ముస్తఫా, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



## క్రీడాకారులు నైపుణ్యాలతో లక్ష్యాలను చేరుకోవాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 1 (జనం సాక్షి) :** క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు క్రీడాకారులు నైపుణ్యాలను పెంపొందించుకొని అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శనివారం గద్వాల మండలం వీరాపూర్ గ్రామంలోని ఎస్ఆర్ విద్యానికేతన్ లో జూలై 29న ప్రారంభమైన సీబీఎస్ఈ సౌత్ క్లస్టర్ 7వ బాలుర వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ టోర్నమెంటులో పెద్ద ఎత్తున పాల్గొన్నప్పటికీ నిర్వాహకులు వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించడం గర్వకారణమన్నారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది సమన్వయంతో పనిచేసి క్రీడలను విజయవంతం చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడికి, విజేతలకు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వివిధ విభాగాల వారీగా విజేతలు, రన్నర్స్ కు కలెక్టర్ పతకాలు, ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీబీఎస్ఈ పాఠశాలల పరిశీలకులు శేషు,డైరెక్టర్ రాముడు, ప్రిన్సిపల్ గోన సునీత, ఇతర ఉపాధ్యాయులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# మల్లూరు క్షేత్రంపై వానర రాజ్యం

- భక్తులకు తప్పని భయాల 'ప్రసాదం'!



**మంగపేట, ఆగస్టు 01(జనంసాక్షి) :** పుణ్యక్షేత్రాలైనా, ప్రకృతి రమణీయ ప్రదేశాలైనా ప్రశాంతతను పంచాలి. కానీ, ములుగు జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో మాత్రం ప్రస్తుతం భక్తులు భయంతో వణికిపోతున్నారు. దేవుడి దర్శనం కోసం భక్తిభావంతో అడుగుపెడుతున్న భక్తులకు.. ఘాట్ రోడ్డు మొదలుకుని ఆలయ ప్రాంగణం వరకు అడుగడుగునా కోతుల రూపంలో మహా సంక్షోభం ఎదురవుతోంది. సాధారణంగా ఆలయాల్లో కోతులు కనిపించడం పరిపాటే. కానీ మల్లూరులో ఈ సమస్య అదుపుతప్పి, భక్తులప్రాణాల మీదకు వస్తోంది. గుంపులు గుంపులుగా తిరుగుతున్న వానరాలు ఎక్కడి నుంచి దాడి చేస్తాయో తెలియక భక్తులు బెంబేలెత్తిపోతున్నారు. చిన్నపిల్లలను చేతుల్లో పట్టుకుని వెళ్లే తల్లులు నిత్యం బిక్కుబిక్కుమంటూ నడవాల్సి వస్తోంది. చేతిలో ప్రసాదాలు, ఇతరత్రా తిను బండారాలు చేతిలో పట్టుకొని ఒంటరిగా కనిపిస్తే చాలు, విజురుసులతో విరుచుకుపడుతున్న వానర దళాలు భక్తులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. భక్తులు చేతిలో ఏది పట్టుకున్నా సరే, లాక్కోవడానికి క్షణం కూడా ఆలోచించని కోతులు.. ప్రతిఘటిస్తే కరుస్తామని బెదిరిస్తున్నాయి. ప్రసాదం కొనాలన్నా.. తినాలన్నా సాహసమే! స్వామి వారికి ఎంతో ప్రీతిపాత్రమైన నైవేద్యాలు సమర్పించాలన్నా, భక్తులు ఆకలి తీర్చుకోవడానికి ప్రసాదం కొనుగోలు చేయాలన్నా ఇప్పుడు ఒక సాహసమే అయింది. కౌంటర్లలో ప్రసాదం తీసుకున్న వెంటనే వాటిని రక్షించుకోవడం భక్తులకు కత్తి మీద సాములా మారింది. అలాగే తెరిచిన తినుబండారాలు, పండ్లు ఏవీ చేతిలో ఉంచడానికి వీలులేదు అనే విధంగా ఉంటుంది. తిందామంటే చాలు, పదుల సంఖ్యలో కోతులు చుట్టుముట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి అని భక్తులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. దీంతో కొనుగోలు చేసిన ప్రసాదాలను తినలేక, పిల్లలకు పెట్టలేక భక్తులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు అనే చెప్పాలి. పవిత్రమైన పుణ్యక్షేత్రంలో భక్తులకు ఇలాంటి దుస్థితి దాపురించడం పట్ల స్థానికులు, భక్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న కోతుల బెడదను నివారించడానికి అటవీ శాఖ, దేవాలయ అధికారులు వెంటనే స్పందించి.. వానరాలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని, భక్తులకు రక్షణ కల్పించాలని భక్తులు ప్రాధేయపడుతున్నారు. భక్తుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ముందే అధికారులు మేల్కొంటారా? లేక ఏదైనా ఘోరం జరిగితేనే స్పందిస్తారా? అని మల్లూరు క్షేత్రానికి వచ్చే ప్రతి ఒక్కరూ ఆవేదనగా ప్రశ్నిస్తున్నారు.

# అధైర్య పడకండి.. అండగా ఉంటాం

- గోదావరి తీర ప్రాంత ప్రజలు, అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి
- మంత్రి సీతక్క



**మంగపేట ఆగస్టు 01 (జనంసాక్షి) :** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నదిలో వరద ప్రవాహం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో, పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. శనివారం మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి మంగపేటలో గోదావరి వరద ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి, అక్కడ ఆశ్రయం పొందుతున్న 28 కుటుంబ ల 112 మంది వరద ముంపు బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న బాధితులకు దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గోదావరి కరకట్ట నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. వరద ముంపు ప్రాంతాలలో అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయక చర్యలను సమర్థవంతంగా నిర్వహించాలి అని అధికారులను ఆదేశించారు. అలాగే పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న బాధితులకు నాణ్యమైన ఆహారం, తాగునీరు, అత్యవసర వైద్య సేవలు మరియు పారిశుద్ధ్య వసతులు లోపం లేకుండా అందించాలి అని వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం ఏఎస్పీ మనన్ భట్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, డీపీవో వెంకయ్య, తహసీల్దార్ తోట రవీందర్, ఎంపీడీవో బానోత్ బద్రూ, రాష్ట్ర పంచాయతీ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, వివిధ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, మాజీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, సీనియర్ నాయకులు మాసిరెడ్డి వెంకటరెడ్డి, పెద్ది నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ ముస్కాన్ ద్వారా 314 మంది చిన్నారులకు విముక్తి

- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత




**వరంగల్ బ్యూరో, ఆగస్టు 01( జనంసాక్షి) :** ఆపరేషన్ ముస్కాన్ -12 ద్వారా 314 మంది చిన్నారులను పని నుండి విముక్తి కలిగించినట్లు వరంగల్ పోలీస్ కమీషనర్ ఎన్.శ్వేత,ఐపిఎస్ తెలిపారు. ఇందుకు సంబందించి వరంగల్ పోలీస్ కమిషనర్ వివరాలను వెల్లడిస్తూ చిన్నారుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ గత నెల జులై 1వ తారీకు నుండి నిన్నటి రోజు వరకు చేపట్టిన 'ఆపరేషన్ ముస్కాన్-12కార్యక్రమం ద్వారా మొత్తం 314 మంది చిన్నారులను రక్షించబడ్డారని. ఇందులో 269 మంది బాలురు, 45 మంది బాలికలు ఉన్నారని. ఈ ఆపరేషన్ ముస్కాన్ -ద్వారా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు నిబంధనల ప్రకారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ లోని పారిశ్రామిక ప్రాంతాల్లో, షాపుల్లో, ఇటుక బట్టిలలో, ప్రమాదకర ప్రాంతాల్లో వరంగల్ పోలీస్ కమిషనరెట్ పరిధి లోని (9) సబ్ డివిజన్ పోలీస్ టీమ్స్ ఏర్పాటు చేసి, ఆ టీమ్స్ కు ఇంచార్జిగా (9) ఎస్సైలు మరియు (36) మంది సిబ్బందిని నియమించి, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ పోలీస్ యూనిట్ సిబ్బందితో పాటు వరంగల్ హనుమకొండ జనగాం జిల్లాలకు చెందిన బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది, కార్మిక శాఖ అధికారులు, షేర్, స్కోప్, ఎఫ్ఎంఎం, ఎస్-ఎస్ ఎస్ స్వచ్ఛంద సంస్థల సిబ్బంది సహకారంతో బాల కార్మికులుగా మగ్గుతున్న 226 మందిని, బడి మానేసిన (డ్రాపౌట్స్) 85 మందిని, సురక్షితంగా ఆపరేషన్ ముస్కాన్ టీం రక్షించి, వీరిని వరంగల్, హనుమకొండ, జనగాం జిల్లాల చైల్డ్ వెల్ఫేర్ కమిటీల ముందు హాజరు పరిచి, పిల్లలకు మరియు వారు తల్లి తండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి అప్పగించామని వీరిలో తెలంగాణేతర రాష్ట్రాలైన బీహార్, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్గఢ్, అస్సాం రాష్ట్రాలకు చెందిన 130 మంది చిన్నారులు కూడా ఉన్నారని కమీషనర్ వివరించారు. నిబంధనలను ఉల్లంఘించి చిన్నారులతో పని చేయిస్తున్న యజమానులపై వరంగల్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా మొత్తం 55 ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు మరియు 92 ఐఆర్ కార్మిక శాఖ అధికారులు చేత నమోదు చేపించామని, వివిధ పోలీస్ స్టేషన్స్ లోని జనరల్ డైరీస్ లో 118 మంది పిల్లల వివరాలను నమోదు చేపించామని కమీషనర్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. "పిల్లలు బడిలో ఉండాలి కానీ పనిలో కాదు. బాల్యానికి అండగా నిలవడమే ఈ ఆపరేషన్ ముఖ్య ఉద్దేశ్యం. బాలకార్మిక వ్యవస్థను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తప్పవు' అని హెచ్చరించారు. చిన్నారుల హక్కులను కాపాడటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కమీషనర్ గారు కోరారు. "పోలీస్, మహిళా శిశు సంక్షేమ శాఖ , చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్లతో పాటు షేర్, స్కోప్, స్వచ్ఛంద సంస్థలు , చైల్డ్ లైన్ అధికారులు ఇట్టి కార్యక్రమం లో పాల్గొన్నారు.




# వీబీ జీరామ్ ఉద్యోగుల పెన్ డౌన్

**పాలకుర్తి ఆగస్టు 01(జనంసాక్షి) :** రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ ఎస్ఆర్డీఎస్-ఎఫ్ఈ (వీబీ జీరామ్) ఉద్యోగులు తమ డిమాండ్ల పరిష్కారం కోసం శనివారం పెన్ డౌన్, షట్ డౌన్ చేసి సహాయ నిరాకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. మండల కేం ద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యోగులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ఎంపీడీవో వేదవతికి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు పేస్కేల్ అమలు చేసి రెగ్యులర్ ప్రభుత్వం ఉద్యోగులతో సమానంగా ప్రతి నెల 1వ తేదిన వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్యాడర్ స్ట్రెంత్ ఖరారు. పదోన్నతులు, బదిలీలు, కేరీర్ అడ్వాన్స్మెంట్ పాలసీ లాంటి న్యాయపరమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. బోర్డు సమావేశంలో ఆమోదించిన అన్ని నిర్ణయాలను తక్షణమే అమలు చేయాలని, మూడు నెలల వేతనాలు విడుదల చేసి చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే దశల వారిగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మంజుల, సిబ్బంది వెంకటేశ్వర్లు, కొంరయ్య, ఇంద్రయ్య, శ్రీనివాస్, రజనీ, యాకూబ్, రమేష్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

### వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించిన జిల్లా ఎస్పీ నితికా పంత్

**సిర్పూర్ టి, ఆగస్టు 01(జనం సాక్షి):** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పెన్‌గంగ, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ నితికా పంత్, వరద ప్రభావిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సిర్పూర్ (టి) పోలీస్ స్టేషన్ పరిధిలోని అంతర్రాష్ట్ర సరిహద్దులో ఉన్న వెంకట్రావుపేట వంతెన, పారిగాం ప్రాంతాలను, అలాగే నియాత్రణ, ప్రజల సురక్ష కోసం చేపట్టిన భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పెన్‌గంగ, ప్రాణహిత నదుల ఉధృతి దృష్ట్యా జిల్లా పోలీస్ శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో అన్ని రకాల ముందస్తు భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు ఈ పరిశీలనలో కాగజ్‌నగర్ డీఎస్పీ వాహీదుద్దీన్, కౌటాల సర్కిల్ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్, ఇతర పోలీసు అధికారులు, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# పుట్టిన వెంటనే ముర్రుపాలు ఇవ్వడమే తల్లి ఇచ్చే మొదటి కానుక..

- కలెక్టర్ రాహుల్ శర్మ..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** తల్లి తన బిడ్డకు ఇవ్వగల మొట్టమొదటి కానుక పుట్టిన వెంటనే ముర్రు పాలు ఇవ్వడమే అని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. ఐడిఓసి కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుండి 7 వరకు నిర్వహించనున్న ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు పోస్టర్ ను రాహుల్ శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాహుల్ శర్మ మాట్లాడుతూ ఈ సంవత్సరం సుస్థిరమైన జీవితం ప్రారంభానికి తల్లిపాలు ఫలితాలను ఇచ్చే చర్యలను మరింత బలోపేతం చేయడం అనే థీమ్ తో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారం అందించడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచి శారీరక మానసిక ఎదుగుదలకు దోహదపడతాయని అన్నారు. అలాగే వివిధ వ్యాధుల నుండి రక్షణ కల్పించి తల్లి ఆరోగ్యం మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. అంగన్‌వాడీ ఆరోగ్య శాఖల సిబ్బంది పరస్పర సమన్వయంతో ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి గర్భిణీలు బాలింతలు కుటుంబ సభ్యులకు తల్లిపాల ప్రాముఖ్యత వివరించాలని సూచించారు. పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం, మొదటి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలనే ఇవ్వడం, తదుపరి సమయానుకూలంగా పోషకాహారం ఇవ్వడం వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి మల్లీశ్వరి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధుసూదన్, డిపిఆర్ఓ శ్రీనివాస్, పోషణ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ యోచన తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ ప్రతినిధి, ఆగష్టు 01 (జనంసాక్షి):** ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ శాఖల అధికారులు వారికి కేటాయించిన బాధ్యతలను సమన్వయంతో నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శనివారం, జిల్లా సమీకృత కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 15న జరుపుకొనే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ భావం ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించాలని, అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున జాతీయ పతాకావిష్కరణలో భాగంగా కలెక్టరేట్ లో చేపట్టనున్న నేపథ్యంలో పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ శాఖల తరపున స్టాల్స్ ను ఏర్పాటు చేయాలని, ప్రముఖులకు, పుర ప్రముఖులకు, అతిథులకు స్వాతంత్ర్య దినోత్సవ ఆహ్వాన పత్రాలను అందజేయాలన్నారు. జిల్లా ప్రగతిపై రూపొందించే సందేశం కాపీలను సీపీఓ, డీపీఆర్ఓ సంయుక్తంగా కలిసి తయారు చేయాలని కలెక్టర్పే ర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను విద్యా శాఖ అధికారులు చేపట్టాలన్నారు. అలాగే జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, విద్యుత్తు సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతరం సరఫరా చేసే విధంగా విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా సంబంధిత శాఖల అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో ముందస్తు జాగ్రత్తలతో చేపట్టాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. అగ్నిమాపక యంత్రాలను సిద్దంగా ఉంచాలని, తాగునీరు, స్నాక్స్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని, స్టేజ్ అలంకరణ, పూలమొక్కల ఏర్పాటు, తివాచీలను, బ్యారికేడ్ లను పటిష్టంగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పోలీసు బందోబస్తు, గౌరవ వందనం, పోలీసు బ్యాండ్ వంటి ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జనగామ ఆర్డీఓ గోపీరాం, కలెక్టరేట్ ఏవో రవి కిరణ్, సిపిఓ చినకోట్యా నాయక్, విద్యా శాఖ ఏడీ శ్రీనివాస్ వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# సదరం-యూడీఐడీ కార్డుల జారీని వేగవంతం చేయాలి


- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు
- అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరం-యూడీఐడీ కార్డులు అందేలా చర్యలు
- సదరం-యూడీఐడీ కార్డుల జారీపై సెర్ప్ సీఈఓ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్

**ములుగు ప్రతినిధి, ఆగష్టు 01(జనంసాక్షి) :** అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరం-యూడీఐడీ కార్డులు సకాలంలో అందేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టి, సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సెర్ప్ సీఈఓ దివ్య సదరం- యూడీఐడీ కార్డుల జారీ పురోగతిపై జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా గ్రామీణాభి వృద్ధి అధికారులు, ముఖ్య వైద్యాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తో కలిసి పాల్గొన్నారు. సదరం-యూడీఐడీ కార్డుల జారీ పురోగతి, జిల్లాల వారీగా నమోదవుతున్న దరఖాస్తులు, పెండింగ్ కేసులు, కేంద్రాల పనితీరు, మౌళిక వసతులపై సెర్ప్ సీఈఓ వీసీ ద్వారా సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. వీసీ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ ప్రభుత్వం సదరం- యూడీఐడీ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులలో అర్హులైన వారందరికీ సదరం ధృవపత్రాల జారీని వేగవంతం చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరం-యూడీఐడీ కార్డులు అందేలా క్షేత్రస్థాయిలో చురుకుగా పని చేయాలని సూచించారు. జిల్లాలో యూడీఐడీ మూల్యాంకన కేంద్రంలో అవసరమైన పరికరాలు, స్పెషలిస్ట్ వైద్యులు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకుని దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సకాలంలో సదరం- యూడీఐడీ ధృవ పత్రాలు జారీకి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్డీఓ రవీందర్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్ర శేఖర్, విద్యా శాఖ అధికారి సిద్దార్థ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గోడదూకి పారిపోయిన కస్తూర్బా విద్యార్థినులు

- అన్నంలో పురుగులు వస్తున్నాయి బాత్రూంలు కంపు కొడుతున్నాయి అంటున్న విద్యార్థులు
- సీసీ కెమెరాలు పనితీరు శూన్యం
- విద్యార్థుల విషయంలో వివరణ తెలిపిన ఎమ్మార్వో






**శాయంపేట, ఆగస్టు 1 (జనం సాక్షి):** హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని గోవిందపూర్ గ్రామ పరిధిలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థినిలు అర్ధరాత్రి ముగ్గురు విద్యార్థులు గోడ దూకి పారిపోయిన సంఘటన నెలకొంది. అర్ధరాత్రి పాఠశాలలో కూరగాయలకు తీసుకొచ్చిన ప్లాస్టిక్ డబ్బాలను గోడకు వేసి వాటి సహాయంతో గోడ దూకి పారిపోయినట్లు గమనించిన ఉపాధ్యాయులు, వాచ్మెన్, ప్రధాన ఉపాధ్యాయురాలుకు సమాచారం ఇవ్వగా కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ పోలీసులకు, తల్లితండ్రులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. పిల్లల తల్లిదండ్రులు, పోలీసులు పాఠశాల పరిసరాల్లో వెతుకగా దొరికారని తెలిపారు. పిల్లలు ఎందుకు పారిపోయారని ప్రిన్సిపల్ ప్రశ్నించగా పిల్లలు ఇంటికి వెళ్తామని చెప్పారని వారిని సముదాయించి టీచర్లు వాళ్ళ దగ్గరనే ఉండి వారిని సము దాయించి వారితో ఉన్నారని తెలిపారు. నలుగురు టీచర్లు పాఠశాలలో రాత్రి వేళలో మానిటరింగ్ చేశారని చెప్పుతున్నారు. విద్యార్థుల తల్లితండ్రులు, విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ ఇంతమంది మానిటరింగ్ చేసినప్పుడు పిల్లలు ఏ విధంగా తప్పించుకున్నారని ప్రిన్సిపాల్ ని ప్రశ్నించారు. సీసీ కెమెరాలు చూసి పిల్లలు ఏ టైం లో బయటికి వెళ్లారని అడుగగా ప్రిన్సిపాల్ సమాధానం చెప్పడం లేదు. పిల్లల తల్లిదండ్రులు పాఠశాలలో పర్యవేక్షణ లోపం ఉన్నదని ఆరోపిస్తున్నారు. పాఠశాలలో పిల్లలను ఇబ్బంది గురి చేస్తూ గుంజీలు తీయిస్తూ ఇబ్బంది పెడుతున్నారని పిల్లల తల్లితండ్రులు ఆరోపించారు. పాఠశాలలోని మరుగుదొడ్ల సమస్య ఇబ్బందిగా ఉందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలోని సీసీ కెమెరాల వైర్లు తెగి పనిచేయకుండా దర్శనమిస్తున్నాయి. విషయం తెలుసుకున్న శాయంపేట తహసిల్దార్ ప్రవీణ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని పూర్తి విచారణ చేపట్టారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆ ముగ్గురు పిల్లలకు ఈ విద్యాలయంలో చదువుకోవడం ఇష్టం లేదని తెలిపారు. ఈ విషయం తమ పేరెంట్స్ కు కూడా చెప్పడం జరిగిందని అన్నారు. ఫ్రూట్స్ కూరగాయల కు సంబంధించిన ట్రేసర్లను ఆధారంగా చేసుకొని గోడదూకి పారిపోయినట్లు తెలిపారు డ్యూటీలో ఉన్న టీచర్స్ సుమారు మూడున్నర గంటలకి పిల్లలు మిస్సింగ్ అయినట్లు గుర్తించినట్లు తెలిపారు. వారు వెంటనే పోలీస్, స్కూల్ ఇంచార్జికి సమాచార ఇవ్వడం జరిగిందని తెలిపారు. తెల్లవారుజామున పిల్లల ఆచూకీ దొరకడం జరిగిందని తెలిపారు. పాఠశాలలో కొన్ని అసౌకర్యాలు ఉన్నట్టు గమనించామని వాటిపై ప్రిన్సిపాల్ కు తెలియజేశామని తెలిపారు. పిల్లల విషయంలో అశ్రద్ధ వహిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# రేషన్ కార్డుదారులకు ఊరట

- ఈ-కేవైసీ గడువు పొడిగింపు
- ఈ నెల 31 వరకు అవకాశం
- మూడు నెలల రేషన్ కోట ఒకేసారి

**బీబీనగర్, ఆగస్టు 1 (జనంసాక్షి) :** రేషన్ లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. రేషన్ కార్డులకు అనుసంధానంగా చేపడుతున్న ఈ-కేవైసీ (వ-ఖ్జ) ప్రక్రియను పూర్తి చేసేందుకు ఈ నెల 31 వరకు గడువును పొడిగించింది. గతంలో నిర్ణయించిన గడువులోగా ప్రక్రియ పూర్తి చేయలేకపోయిన లబ్ధిదారులు ఈనెల 31 వరకు ఈ కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకునేందుకు రేషన్ కార్డుదారులకు వీలును కల్పిస్తూ ప్రభుత్వం సివిల్ సప్లై అధికారులకు ఆదేశాలు జారీ చేసింది . దీంతో ఈ-కేవైసీ చేయించుకోని వారు నిర్ణీత గడువులోగా సమీప రేషన్ షాపును సంప్రదించి బయోమెట్రిక్ ధ్రువీకరణ పూర్తి చేసుకోవాలని పౌర సరఫరాల శాఖ అధికారులు సూచిస్తున్నారు.

### 2 లక్షల 52,187 రేషన్ కార్డులు

యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రస్తుతం 515 రేషన్ దుకాణాలు ఉండగా 2 లక్షల 52,187 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో ఆహార భద్రత కార్డులు 2, 38,260, అంత్యోదయ కార్డులు 13,772 ఉన్నాయి. ఇప్పటివరకు కార్డుదారులు 82 శాతం మంది మాత్రమే ఈ కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులందరికీ ఈ నెలాఖరులోగా ఈ-కేవైసీ పూర్తి చేయించేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ఈ కేవైసీ చేసుకొని వారికి భవిష్యత్తులో రేషన్ కార్డు తొలగించే అవకాశం ఉంటుందని, బియ్యం కూడా ఇవ్వబోరని సివిల్ సప్లై అధికారులు స్పష్టం చేస్తున్నారు.

### దేశంలో ఎక్కడైనా ఈ-కేవైసీ అవకాశం

రేషన్ కార్డులో పేరు ఉన్న సభ్యుడు ప్రస్తుతం ఇతర జిల్లాలో లేదా ఇతర రాష్ట్రంలో ఉన్నా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. దేశంలోని ఏ రేషన్ షాపులోనైనా ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ ధ్రువీకరణ ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవచ్చని వివరించారు. ఇందుకోసం రేషన్ కార్డు వివరాలు, ఆధార్ నంబర్ అందుబాటులో ఉంటే సరిపోతుందని పేర్కొన్నారు.

### వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు

వృద్ధాప్యం, అనారోగ్యం, దివ్యాంగత్వం వంటి కారణాలతో రేషన్ దుకాణానికి రావడానికి ఇబ్బందులు ఎదుర్కొనే లబ్ధిదారులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. అవసరమైతే మొబైల్ బయోమెట్రిక్ పరికరాలతో వారి నివాసాలకే వెళ్లి ఈ-కేవైసీ నిర్వహించేందుకు చర్యలు



తీసుకుంటామని వెల్లడించారు. చివరి రోజుల్లో రేషన్ దుకాణాల వద్ద రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున లబ్ధిదారులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. గడువులోగా ప్రక్రియ పూర్తి చేస్తే భవిష్యత్తులో రేషన్ పంపిణీలో ఎలాంటి అంతరాయం ఉండదని స్పష్టం చేశారు.

### మూడు నెలల రేషన్ ఒకేసారి

రేషన్ కార్డుదారులకు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ మూడు నెలలకు సంబంధించిన బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేసేలా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో పౌర సరఫరాల శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ-కేవైసీ పూర్తిచేసిన లబ్ధిదారులు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన రేషన్‌ను ఒకేసారి పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ-కేవైసీ పెండింగ్‌లో ఉన్న సభ్యుల కారణంగా రేషన్ పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ నెల 31లోపు బయోమెట్రిక్ ధ్రువీకరణ పూర్తి చేసుకోవాలని సూచించారు.

## జిల్లావ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

- జిల్లా ఎస్పీ కె.నరసింహ



**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 1 (జనంసాక్షి) :** శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా జిల్లాలో ఉన్న ప్రశాంత వాతావరణంకు భంగం కాకుండా, సవ్యంగా కొనసాగించడానికి ఆగస్టు 1 నుండి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ కె.నరసింహ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున జిల్లాలో డిఎస్పి లేదా ఆ పై స్థాయి అధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించరాదని, సన్నాహాలు చేయరాదని తెలిపారు.నిషేధిత ఆయుధాలు, కత్తులు, కర్రలు, దుడ్డు కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, దురుద్దేశంతో నేరాలను ఉసిగొలిపేటువంటి ఆయుధాలు కలిగి ఉండరాదని అన్నారు.ప్రజా జీవనానికి ఇబ్బంది దారి తీసే ప్రజా సమావేశాలు, జన సమూహం లాంటివి పూర్తిగా నిషేధించబడ్డాయని తెలిపారు.అధిక శబ్దం వచ్చే స్పీకర్లు, డీజేలు వంటి వాటికి అనుమతులు లేవని తెలిపారు.ప్రచార రథాలు, మైకులు, తదితర అధిక శబ్దం పరికరాలు నిషేధించబడ్డాయని సూచించారు.చట్ట ప్రకారం జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ యాక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు తప్పవని సూచించారు.నిబంధనలను తప్పనిసరిగా ప్రతి ఒక్కరు పాటించాలని తెలిపారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తుగా దరఖాస్తు చేసుకొని అనుమతులను పొందాలని సూచించారు.

## విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టాలి



**జడ్చర్ల, ఆగస్టు 1 (జనంసాక్షి) :** విద్యార్థులు చదువుపై పూర్తి శ్రద్ధ పెట్టి, ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లి దండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని స్నేహ కంపెనీ మేనేజర్ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం జడ్చర్ల మండల పరిధిలోని గంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్నేహ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 1.30 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు.కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అనంతప్ప మాట్లాడుతూ నిరంతర నీరు తాగడం వల్ల మెదడు చురుగ్గా పనిచేసి చదువుపై ఏకాగ్రత కుదురుతుందన్నారు. గతంలోనూ స్నేహ ఫౌండేషన్ విద్యార్థులకు పుస్తకాలు, షూస్, బ్యాగ్స్ అందించినట్లు గుర్తుచేసి కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు భాస్కర్ రెడ్డిని శాలువా కప్పి సత్కరించారు. గ్రామ సర్పంచ్ బండారు గిరి ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, సౌకర్యాల కల్పనకు ఎప్పుడూ ముందుంటామని, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోపాల్ యాదవ్, ఉప సర్పంచ్ రవికిరణ్, వార్డు సభ్యులు మల్లికార్జున్ యాదవ్, ఖదీర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాజరాజేశ్వరి నగర్ సమస్యలకు శాశ్వత పరిష్కారం



**సనత్‌నగర్, ఆగస్టు 1 (జనం సాక్షి) :** ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరించి ఇబ్బందులను పూర్తిగా తొలగిస్తామని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం సనత్‌నగర్ డివిజన్ పరిధిలోని రాజరాజేశ్వరి నగర్ కాలనీలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన విస్తృతంగా పర్యటించారు. కాలనీలోని ప్రతి వీధిని పరిశీలిస్తూ స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డ్రైనేజీ, స్ట్రామ్ వాటర్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగిస్తోందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యకు శాశ్వత పరిష్కారంగా కొత్త డ్రైనేజ్ లైన్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని గుర్తించిన తలసాని వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఇతర ప్రాంతాలకు చెందిన కొందరు వ్యక్తులు రాత్రివేళల్లో కాలనీలో మద్యం సేవిస్తూ స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని నివాసితులు ఫిర్యాదు చేయగా, కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి భద్రతను మరింత బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు. కాలనీలో పలు ప్రాంతాల్లో ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయని ప్రజలు తెలియజేయగా, వాటిని తొలగించి సిమెంట్ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో ప్రతి ఓటరు తప్పనిసరిగా పాల్గొని తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ నెల 10వ తేదీ వరకు కార్యక్రమం కొనసాగుతున్నందున ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లలో అవగాహన కల్పించాలని, అలాగే పెన్షన్‌లకు అర్హులైన వారి వివరాలను సేకరించి అధికారులకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ మహేష్, వాటర్ వర్క్స్ జీఎం సతీష్, డీజీఎం ఆశిష్, ఎలక్ట్రికల్ ఏఈ శేఖర్, సనత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొలన్ బాల్‌రెడ్డి, నాయకులు సురేష్ గౌడ్, ప్రవీణ్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, ఖలీల్, రాజేష్ ముదిరాజ్, శేఖర్, భద్రయ్య, జమీర్, ఇబ్రహీం, పురుషోత్తం, కాలనీ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, సభ్యులు నారాయణ, మహేష్, వాడకట్టు శ్రీకాంత్, శేషు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## మొండివాగు - కమ్మెట నక్షబాటను పరిరక్షించాలి

ఆర్డీవోకు వినతి



**చేవెళ్ల, ఆగస్టు 1 (జనంసాక్షి) :** చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని ఊరెళ్ల మొదటి వార్డు పరిధిలో మొండివాగు నుంచి కమ్మెట గ్రామానికి వెళ్లే నక్షబాటను యథాతథంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం మొదటి వార్డు కౌన్సిలర్ దూత మల్లేష్ ఆధ్వర్యంలో రెండో వార్డు కౌన్సిలర్ దప్పు సువర్ణచంద, వార్డు ప్రజలు కలిసి చేవెళ్ల ఆర్డీవో పార్థసింహారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొండివాగు నుంచి కమ్మెట గ్రామానికి వెళ్లే నక్షబాటను కొందరు రియల్టర్లు భూముల విక్రయాల నేపథ్యంలో తొలగించి, అక్కడ ప్రీకాస్ట్ నిర్మాణాలు ఏర్పాటు చేస్తున్నారని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. దీనివల్ల గ్రామ ప్రజలు, రైతులు రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని నక్షబాటను యథావిధిగా కొనసాగిస్తూ, ఆక్రమణలు మరియు అడ్డంకులను తొలగించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఆర్డీవోను కలిసిన వారిలో వార్డు ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మోకాళ్లపై నిలబడి వినూత్న నిరసన తెలిపిన విద్యుత్ జేఏసీ



**కొత్తగూడెం క్రైమ్, ఆగస్టు 1 (జనం సాక్షి) :** యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) లోని స్టేజ్ -1,స్టేజ్ -2 లో యాష్ ప్లాంట్,కోల్ ప్లాంట్ లను ప్రైవేటీకరించే ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో దశల వారి ఆందోళనలో భాగంగా బీటీపీఎస్ ప్రధాన గేటు ఎదుట శనివారం మోకాళ్లపై నిలబడి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ యాజమాన్యం మొండి వైఖరిని నిరసిస్తూ నినాదాలు రాసి ఉన్న ప్లకార్డ్స్ పట్టుకొని పలువురు ఉద్యోగులు తమ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ బీటీపీఎస్ రీజినల్ కన్వీనర్ ఎస్. శ్రీనివాస్ రెడ్డి ప్రసంగిస్తూ వైటీపీఎస్ లోని యాష్ ప్లాంట్, కోల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కు వేసిన టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ పై జేఏసీ సెంట్రల్ కమిటీ సోమవారం జెన్‌కో యాజమాన్యంతో చర్చలు జరుపుతుందని తెలిపారు. ఈ చర్చలు సానుకూలంగా రాకపోతే ప్రస్తుతం జరుపుతున్న ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాబోవు రోజుల్లో రిలే నిరాహార దీక్షలు వంటి కార్యక్రమాలను చేపట్టే అవకాశం ఉందని చెప్పారు. ఈ తరహా కార్యక్రమాలకు ఉద్యోగులందరూ మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీజీపీఈఏ( తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ )సెంట్రల్ కమిటీ ఎగ్జిక్యూటివ్ సెక్రెటరీ బి.రవి ప్రసాద్, టీజీఎస్ఈఈఏ( తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్) బ్రాంచ్ సెక్రటరీ నరేష్ , నాయకులు డి.మహేష్, కార్మిక సంఘం -1535 రీజనల్ అధ్యక్షులు వి. ప్రసాద్, కార్మిక సంఘం- 1104 నాయకులు వెంకట్రామ్, ఏఐబీయూఎస్ నాయకులు శోభన్, ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ రీజినల్ ప్రెసిడెంట్ వరుణ్, క్రెడిట్ సొసైటీ డైరెక్టర్ సిద్దుల హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు .

## సింఎంసి పరిధిలో వాక్ ఫ్రీ స్పెషల్ డ్రైవ్

- 15 ప్రాంతాల్లో 313 ఆక్రమణలను తొలగించిన వైనం...



**శేరిలింగంపల్లి, ఆగస్టు 1 (జనంసాక్షి) :** ప్రతి వారం నిర్వహిస్తున్న వాక్ ఫ్రీ కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రత్యేకంగా గుర్తించిన 15 ప్రాంతాల్లో మొత్తం 17.95 కిలోమీటర్ల మేర సిఎంసి అధికారులు ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ డ్రైవ్ లో మొత్తం 313 ఆక్రమణలను తొలగించి, రహదారులు, ఫుట్‌పాత్‌లు మరియు ప్రజా ప్రదేశాలను తిరిగి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ క్రమంలో శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని 8.5 కిలోమీటర్ల నిడివిలో 106 ఆక్రమణల తొలగింపు చేపట్టగా...నార్సింగి పరిధిలో 30, పటాన్‌చెరు పరిధిలో 15, అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలో 27, మియాపూర్ పరిధిలో 18, శేరిలింగంపల్లి పరిధిలో 16 ఆక్రమణలను తొలగించినట్లు అధికారులు వెల్లడించగా... కూకట్‌పల్లి జోన్ పరిధిలో 2.6 కి.మీ నిడివిలో మొత్తం 53 ఆక్రమణలు తొలగించినట్లు తెలుస్తుండగా మాదాపూర్ సర్కిల్ పరిధిలో 22, ఆల్విన్ కాలనీ పరిధిలో 11, కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో 20 ఆక్రమణలను సిబ్బంది తొలగించారు. ఇక కుత్బుల్లాపూర్ జోన్ లో 6.85 కి.మీ నిడివిలో మొత్తం 154 ఆక్రమణలు తొలగించగా చింతల్ సర్కిల్ పరిధిలో 18, జీడిమెట్ల పరిధిలో 27, కొంపల్లి సర్కిల్ పరిధిలో 16 ఆక్రమణలను తొలగించగా, గాజులరామారం పరిధిలో 12, నిజాంపేట్ సర్కిల్ పరిధిలో 42, దుండిగల్ సర్కిల్ పరిధిలో 18 కాగా మేడ్చల్ సర్కిల్ పరిధిలో 21 ఆక్రమణలను తొలగించడం జరిగిందన్నారు. ఆక్రమణల తొలగింపుతోపాటు తొలగించిన ప్రాంతాల్లో తిరిగి ఆక్రమణలు జరగకుండా సిఎంసి అధికారులు, సమన్వయ బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## డ్రగ్స్ రహిత భారత నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలి




**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 1 (జనం సాక్షి) :** డ్రగ్స్ రహిత భారత నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలని జిల్లా యువజన అధికారి వి.కోటి నాయక్ అన్నారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో,నశా ముక్త్ భారత్ అభియాన్-- మేరా యువ భారత్ సంయుక్తంగా జిల్లా స్థాయి కార్యక్రమాన్ని శనివారం స్థానిక ఎంఏఎల్డీ డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి మాట్లాడుతూ నశా ముక్త్ భారత్ అభియాన్ లక్ష్యం మత్తు రహిత సమాజ నిర్మాణమేనని అన్నారు.దేశ భవిష్యత్తు అయిన యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని అవలంబించాలని పిలుపునిచ్చారు.మత్తు వ్యసనాలు వ్యక్తి, కుటుంబం,సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతాయని వివరించారు.యువత తమ లక్ష్యాల సాధనకు కృషి చేస్తూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో నశా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. యువతలో మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించేందుకు నుక్కడ్ నాటకం, పాటలు, వ్యాసరచన,పోస్టర్ తయారీ పోటీలు నిర్వహించారు. ఇందులో వివిధ కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి ప్రశంసా పత్రాలు,బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ శాఖ ఎస్ఐ శివకృష్ణ,కళాశాల ప్రిన్సిపాల్ కలందర్ పాషా,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ భాస్కర్, అధ్యాపకులు సురేందర్ రెడ్డి, డా. కర్ణాకర్,వివిధ కళాశాలల అధ్యాపకులు,యువత,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి వరద తగ్గుముఖం

- తగ్గుముఖం పట్టిన వరద
- మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగింపు
- జాతీయ రహదారి మూసివేత

**భద్రాచలం, ఆగస్టు 1 (జనంసాక్షి) :** మూడు రోజులుగా భద్రాచలం ఏజెన్సీ ప్రాంతాన్ని ఉక్కిరిబిక్కిరి చేసిన గోదావరి వరద శనివారం సాయంత్రం నుంచి క్రమంగా తగ్గుముఖం పట్టింది. అయితే భద్రాచలం వద్ద నీటిమట్టం ఇంకా మూడో ప్రమాద హెచ్చరిక స్థాయిలోనే కొనసాగుతుండటంతో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. వరద ప్రభావంతో విజయవాడ--జగదల్‌పూర్ జాతీయ రహదారిని పూర్తిగా మూసివేయగా, భద్రాచలం మీదుగా ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాలకు వెళ్లే లారీలు, ఇతర వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. శుక్రవారం అర్ధరాత్రి 53 అడుగులకు చేరుకున్న గోదావరి నీటిమట్టం శనివారం ఉదయం 56.10 అడుగులకు పెరిగి మధ్యాహ్నం వరకు స్థిరంగా కొనసాగింది. అనంతరం సాయంత్రం నుంచి వరద నీరు తగ్గడం ప్రారంభమై, సాయంత్రం 6 గంటలకు 55.30 అడుగులకు చేరింది. ప్రస్తుతం సుమారు 15.53 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదలవుతోంది. గోదావరి ఉధృతి కారణంగా బూర్గంపాడు, భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లోని పలు ఆర్అండ్‌బీ రహదారులపై వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో కొత్తగూడెం మినహా చర్ల, కూనవరం, కుక్కునూరు, వెంకటాపురం మార్గాల్లో ఆర్టీసీ బస్సు సర్వీసులను అధికారులు నిలిపివేశారు. తూరుబాక, సారపాక, యటపాక ప్రాంతాల్లో కూడా వరద ప్రభావం తీవ్రంగా ఉంది. యటపాక గ్రామ సచివాలయం వరద నీటిలో చిక్కుకుంది.

### పోలవరం ప్రభావంతో నెమ్మదిగా తగ్గుతున్న గోదావరి

భద్రాచలం వద్ద గోదావరి పెరుగుదల వేగంగా జరిగినప్పటికీ, తగ్గుదల మాత్రం చాలా నెమ్మదిగా కొనసాగుతోంది. దిగువన పోలవరం ప్రాజెక్టు వద్ద నీటి నిల్వలు, స్పిల్‌వే ద్వారా విడుదల కారణంగా ప్రవాహ వేగం తగ్గడంతో గంటకు సుమారు ఒక పాయింట్ చొప్పున మాత్రమే నీటిమట్టం తగ్గుతోంది. దీంతో వరద పూర్తిగా తగ్గి రాకపోకలు పునరుద్ధరించేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. - జాతీయ రహదారి మూసివేతతో వాహనాల నిలుపుదల భద్రాచలంలోని సరస్వతి శిశుమందిర్ సమీప కరకట్ట ప్రాంతం నుంచి వరద నీరు పట్టణంలోకి రాకుండా అధికారులు విజయవాడ--జగదల్‌పూర్ జాతీయ రహదారిపై మట్టికట్ట వేశారు. దీంతో వందలాది లారీలు, ఇతర వాహనాలు



భద్రాచలంలోనే నిలిచిపోయాయి. గోదావరి నీటిమట్టం 45 అడుగులకు తగ్గిన తర్వాతే రహదారిని తిరిగి తెరిచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే ఏపీలోని గుండాల, రాయనిపేట, నెల్లిపాక ప్రాంతాల్లో కూడా రహదారిపై వరద నీరు ప్రవహిస్తుండటంతో ఆదివారం వరకు రాకపోకలు పునరుద్ధరించే అవకాశం లేదని పేర్కొన్నారు.

### వరద పరిస్థితులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

జిల్లా కలెక్టర్ అంకిత్ భద్రాచలం - కూనవరం ప్రధాన రహదారి వెంట వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, అన్ని శాఖలు సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, భోజనం, విద్యుత్, వైద్య సేవలు, పారిశుద్ధ్య సౌకర్యాలు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## వేరువేరు ప్రమాదాల్లో ముగ్గురు యువకులు మృతి

**చిలుకూరు, ఆగస్టు 1 (జనంసాక్షి) :** మండలంలోని సీతారాంపురం గ్రామ సమీపంలో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై బొలెరో వాహనాన్ని ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో బైక్ ప్రయాణిస్తున్న ఇద్దరిలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి.మృతుడు మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన భూక్య నరసింహ (19)ఫోటోగ్రాఫర్ గా పనిచేస్తున్నారు. విషమంగా ఉన్న మరో వ్యక్తి భోజ్య తండా కు చెందిన గుగులోతు గోపి అలియాస్ కొండ గా గుర్తించారు. వెంటనే మెరుగైన వైద్యం నిమిత్తం ఖమ్మం ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించారు. మరొక ప్రమాదం చిలుకూరు గ్రామ పరిధిలోని జానకినగర్ స్టేజ్ వద్ద స్కూటీపై ప్రయాణిస్తున్న వరుసకు బావ బమ్మర్దులు స్టేజి సమీపమునకు రాగానే స్కూటీ అదుపు తప్పి రోడ్డుపై పడటంతో ఇరువురు తలలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు బూరుగడ్డకు చెందిన గద్దం లోకేష్(19), ఎన్టీఆర్ జిల్లా పేర్నపూడ్ పేటకు చెందిన చల్లా అనిల్(20)లు గా గుర్తించారు. ఘటన స్థలంకు చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. మృతుల బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్ఐ బి.మోహన్ బాబు తెలిపారు.

# ఏఐ ఉద్యోగాలకు కొత్త నైపుణ్యాలే కీలకం





## కోడింగ్ ఒక్కటే సరిపోదంటున్న ఐటీ కంపెనీలు

- కస్టమర్ సమస్యలకు పరిష్కారం చూపగల ఇంజనీర్లకే అధిక డిమాండ్
- కృత్రిమ మేధస్సు నిపుణులకు భారీ వేతనాల ఆఫర్లు

**బెంగళూరు, ఆగస్టు 1 (జనంసాక్షి) :**

భవిష్యత్తు కృత్రిమ మేధస్సు (ఏఐ)దేననే అభిప్రాయం రోజురోజుకూ బలపడుతోంది. ఒకప్పుడు కంప్యూటర్ భాషల్లో ప్రావీణ్యం సాధిస్తే మంచి ఉద్యోగం దొరికేది. కానీ ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. కేవలం కోడింగ్ రాయగల సామర్థ్యం కాకుండా, వ్యాపార అవసరాలను అర్థం చేసుకుని వాటికి తగిన పరిష్కారాలను రూపొందించే నైపుణ్యాలకే సంస్థలు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. భారత ఐటీ రంగంలో ఇప్పుడు కస్టమర్ల తో నేరుగా మాట్లాడి వారి అవసరా లను విశ్లేషించి, కృత్రిమ మేధస్సు ఆధారిత పరిష్కారాలను అందించ గల ఇంజనీర్లకు డిమాండ్ పెరుగు తోంది. గతంలో విదేశీ సాంకేతిక సంస్థలకే పరిమితమైన ఈ అవకాశా లు ప్రస్తుతం భారతీయ కంపెనీ ల్లోనూ వేగంగా విస్తరిస్తున్నాయి. తాజాగా మానవ వనరుల రంగానికి చెందిన ఓ సంస్థ తొమ్మిది రంగాల్లోని సుమారు 200 కంపెనీలపై నిర్వహించిన అధ్యయనంలో, కస్టమర్లతో సమన్వయం చేసుకుంటూ వ్యాపార అవసరాలకు అను గుణంగా ఏఐ సాంకేతికతను వినియోగించగల నిపుణుల నియామకంపై సంస్థలు ఎక్కువ ఆసక్తి చూపుతున్నట్లు వెల్లడైంది. ఈ తరహా ఉద్యోగుల ద్వారా సేవల నాణ్యత పెరగడంతో పాటు, సంస్థల ఉత్పాదకత, లాభదాయకత కూడా మెరుగుపడుతున్నట్లు పేర్కొంది.



గత ఏడాదితో పోలిస్తే కృత్రిమ మేధస్సు ఆధారిత స్వయంచాలక వ్యవస్థలపై పనిచేసే ఇంజనీర్లకు డిమాండ్ గణనీయంగా పెరిగింది. అలాగే కస్టమర్ల వద్ద నేరుగా సేవలు అందించే ఇంజనీర్ల నియామకాలు కూడా వేగంగా పెరుగుతున్నాయి. ఈ నైపుణ్యాలు కలిగిన వారికి ప్రముఖ సంస్థలు సంవత్సరానికి రూ.50 లక్షల నుంచి రూ.1 కోటి వరకు వేతన ప్యాకేజీలు అందిస్తున్నాయి. మారుతున్న సాంకేతిక ప్రపంచంలో ఉద్యోగం పొందాలంటే కోడింగ్‌తో పాటు సమస్యలను విశ్లేషించడం, కస్టమర్ల అవసరాలను అర్థం చేసుకోవడం, కృత్రిమ మేధస్సును వ్యాపార అవసరాలకు అనుగుణంగా వినియోగించడం, సమర్థవంతమైన సంభాషణ నైపుణ్యాలు, జట్టు భావనతో పనిచేయడం వంటి సామర్థ్యాలు కూడా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ఈ విభాగంలో ఉద్యోగాల సంఖ్య పరిమితంగానే ఉన్నప్పటికీ, రానున్న సంవత్సరాల్లో కృత్రిమ మేధస్సు వినియోగం మరింత విస్తరించడంతో ఈ రంగంలో అవకాశాలు గణనీయంగా పెరిగే అవకాశముందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# బంగారం ధరల్లో భారీ తగ్గుదల

- 10 గ్రాములపై రూ.400 తగ్గిన పసిడి
- వెండి ధరలు స్థిరం.. కిలో రూ.2.35 లక్షల వద్ద కొనసాగింపు
- అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో దేశీయంగా ధరల మార్పులు

ఆగస్టు నెల తొలి రోజే బంగారం, వెండి ధరల్లో మిశ్రమ ధోరణి కనిపించింది. శనివారం 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.400 తగ్గగా, 100 గ్రాములపై రూ.4,000 వరకు తగ్గుదల నమోదైంది. మరోవైపు వెండి ధరల్లో ఎలాంటి మార్పు లేకుండా కిలో సుమారు రూ.2.35 లక్షల వద్ద కొనసాగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు ఒక్కరోజులోనే గణనీయంగా తగ్గడంతో దేశీయ మార్కెట్‌పై కూడా ప్రభావం పడింది. స్పాట్ గోల్డ్ ధర దాదాపు 1.5 శాతం క్షీణించగా, వెండి ధర 2.4 శాతం వరకు పడిపోయింది. దీంతో దేశీయంగా కూడా బంగారం ధరలు దిగివచ్చాయి.

జులై నెలలో మాత్రం బంగారం వెండితో పోలిస్తే మెరుగైన ప్రదర్శన కనబరిచింది. 24, 22, 18 క్యారెట్ల బంగారం ధరలు నెలవారీగా రెండు శాతానికి పైగా పెరిగాయి. అదే సమయంలో వెండి ధరలు రెండు నుంచి మూడు శాతం వరకు తగ్గుముఖం పట్టాయి. ముడి చమురు ధరల పెరుగుదల, అమెరికా కేంద్ర బ్యాంకు వడ్డీ రేట్ల విధానం, డాలర్ మారకం విలువ, అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతలు వంటి అంశాలు విలువైన లోహాల ధరలపై ప్రభావం చూపుతున్నాయని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అమెరికాలో ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం, వడ్డీ రేట్లను ప్రస్తుతం యథాతథంగా కొనసాగించడం వల్ల గత నెలలో బంగారం ధరలకు కొంత మద్దతు లభించింది. అయితే భవిష్యత్తులో వడ్డీ రేట్లపై కఠిన నిర్ణయాలు వచ్చే అవకాశాలపై ఉన్న అంచనాలు పసిడి ధరలపై ఒత్తిడిని కొనసాగిస్తున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య మళ్లీ పెరుగుతున్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి, ముడి చమురు ధరల హెచ్చుతగ్గులు రానున్న రోజుల్లో బంగారం, వెండి ధరలపై మరింత ప్రభావం చూపే అవకాశముందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 530 | ₹ 63.60 |
| వరంగల్ | ₹ 532 | ₹63.84 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు |
|---|---|---|
| హైదరాబాద్ | ₹1,43,372 | ₹1,42,506 |
| చెన్నై | ₹1,43,822 | ₹1,42,921 |

**వెండి ధరలు (కేజీ)** హైదరాబాద్ ₹2,34,900

# జులైలో యూపీఐకి మరో రికార్డు

## రూ.29.88 లక్షల కోట్ల డిజిటల్ లావాదేవీలు




**హైదరాబాద్, (జనంసాక్షి) :** దేశంలో డిజిటల్ చెల్లింపుల విస్తరణ మరోసారి కొత్త శిఖరాన్ని తాకింది. జులై నెలలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిగిన లావాదేవీలు సరికొత్త రికార్డును నమోదు చేశాయి. ఈ నెలలో మొత్తం 23.66 బిలియన్ (2366 కోట్లు) లావాదేవీలు జరగగా, వాటి విలువ రూ.29.88 లక్షల కోట్లకు చేరినట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వెల్లడించింది. గత ఏడాది జులైతో పోలిస్తే లావాదేవీ ల సంఖ్య 22 శాతం, విలువ 19 శాతం పెరగడం దేశంలో డిజిటల్ చెల్లింపుల వినియోగం వేగంగా విస్తరిస్తోందనడానికి నిదర్శనంగా నిలిచింది. జులైలో రోజుకు సగటున 76.3 కోట్ల యూపీఐ లావాదేవీలు నమోదయ్యాయి. వీటి ద్వారా ప్రతిరోజూ సగటున రూ.96,383 కోట్ల విలువైన చెల్లింపులు జరిగాయి. చిన్న మొత్తాల కొనుగోళ్ల నుంచి వ్యాపార లావాదేవీల వరకు యూపీఐ వినియోగం గణనీయంగా పెరుగుతున్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. డిజిటల్ చెల్లింపులు ఇప్పుడు మెట్రో నగరాలకే పరిమితం కాకుండా చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల వరకు విస్తరించాయి. కిరాణా దుకాణాలు, హోటళ్లు, బిల్లుల చెల్లింపులు, మొబైల్ రీచార్జ్‌లు, రోజువారీ కొనుగోళ్లలో నగదు స్థానాన్ని యూపీఐ వేగంగా ఆక్రమిస్తోంది. స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరగడం, బ్యాంకింగ్ సేవలు విస్తరించడం, డిజిటల్ చెల్లింపులపై ప్రజల్లో విశ్వాసం పెరగడం ఇందుకు ప్రధాన కారణాలుగా నిపుణులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ ఇండియా కార్యక్రమం, బ్యాంకులు మరియు ఫిన్‌టెక్ సంస్థలు అందిస్తున్న సులభమైన సేవలు కూడా యూపీఐ వృద్ధికి బలమైన ఊతంగా నిలుస్తున్నాయి. భవిష్యత్తులో డిజిటల్ ఆర్థిక వ్యవస్థ మరింత విస్తరించే అవకాశం ఉందని ఆర్థిక రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# రికార్డు స్థాయిలో వాణిజ్య పన్నుల వసూళ్లు

**న్యూ ఢిల్లీ, ఆగస్టు 1 (జనంసాక్షి) :** దేశంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు మరోసారి రెండు లక్షల కోట్ల రూపాయల మార్కును దాటాయి. జులై నెలలో మొత్తం రూ.2.11 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైనట్లు కేంద్ర ఆర్థిక శాఖ శనివారం వెల్లడించింది. గతేడాది ఇదే నెలతో పోలిస్తే 15.4 శాతం వృద్ధి నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నెలవారీ జీఎస్టీ వసూళ్లు రూ.2 లక్షల కోట్లను దాటడం ఇది రెండోసారి. అంతకుముందు ఏప్రిల్ నెలలో అత్యధికంగా రూ.2.43 లక్షల కోట్లు వసూలయ్యాయి. దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన జీఎస్టీ ఆదాయం 10.1 శాతం పెరిగి రూ.1.44 లక్షల కోట్లకు చేరగా, దిగుమతులపై పన్ను వసూళ్లు 29 శాతం వృద్ధితో రూ.66,511 కోట్లుగా నమోదయ్యాయి.

జులైలో కేంద్ర జీఎస్టీ (సీజీఎస్టీ) వాటా రూ.39,835 కోట్లు, రాష్ట్ర జీఎస్టీ (ఎస్జీఎస్టీ) రూ.47,881 కోట్లు, సమగ్ర జీఎస్టీ (ఐజీఎస్టీ) రూ.1.23 లక్షల కోట్లుగా నమోదైంది. ఈ నెలలో పన్ను చెల్లింపుదారులకు రూ.29,968 కోట్ల రీఫండ్లు జారీ చేశారు. వాటిని మినహాయించిన తర్వాత నికర జీఎస్టీ వసూళ్లు రూ.1.81 లక్షల కోట్లుగా నిలిచాయి. రాష్ట్రాల వారీగా చూస్తే తెలంగాణలో జులై నెలలో రూ.5,819 కోట్ల జీఎస్టీ వసూలైంది. గతేడాది జులైతో పోలిస్తే రాష్ట్రంలో వసూళ్లు 19 శాతం పెరగడం విశేషం. ఆంధ్రప్రదేశ్‌లో ఇదే నెలలో రూ.3,366 కోట్ల జీఎస్టీ ఆదాయం నమోదైంది. ఆర్థిక కార్యకలాపాలు విస్తరించడం, వినియోగం పెరగడం, పన్ను చెల్లింపుల వ్యవస్థలో మెరుగుదల వంటి అంశాలు జీఎస్టీ వసూళ్ల వృద్ధికి దోహదపడినట్లు ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# అమెరికా కొత్త వీసా బాండ్ విధానం..

## 50 దేశాలపై కఠిన నిబంధనలు

**న్యూ ఢిల్లీ, ఆగస్టు 1 (జనంసాక్షి) :** అమెరికాలో అక్రమంగా ఉండిపోయే విదేశీయుల సంఖ్యను తగ్గించేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వ్యాపార (బీ-1), పర్యాటక (బీ-2) వీసాలపై వచ్చే సందర్శకులకు శాశ్వత వీసా బాండ్ విధానం అమలు చేయనున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించింది. కొత్త నిబంధనలు ఆగస్టు 3, 2026 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ విధానం ప్రకారం ఎంపిక చేసిన 50 దేశాల పౌరులు అమెరికా వెళ్లే ముందు గరిష్ఠంగా 20 వేల డాలర్ల వరకు బాండ్ డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. గతంలో పైలట్ ప్రాజెక్టు కింద 5 వేల, 10 వేల, 15 వేల డాలర్ల బాండ్ ఉండగా, ఇప్పుడు 5 వేల డాలర్ల ఎంపికను తొలగించి గరిష్ఠ పరిమితిని 20 వేల డాలర్లకు పెంచారు. వీసా గడువు ముగిసినా అమెరికాలోనే ఉండిపోయే వారి సంఖ్యను నియంత్రించడంలో పైలట్ కార్యక్రమం ఫలితాలిచ్చిందని అధికారులు గుర్తించారు. దీంతో ఈ విధానాన్ని శాశ్వతంగా అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నిబంధనలు ప్రధానంగా వీసా ఓవర్‌స్టే రేటు అధికంగా ఉన్న 50 దేశాల పౌరులకు మాత్రమే వర్తిస్తాయి. జాబితా లో ఆఫ్రికా, ఆసియా, దక్షిణ అమెరికా దేశాలు ఉన్నప్పటికీ, భారత్‌కు ఇందులో చోటు లేకపోవడం భారతీయులకు ఊరటనిచ్చే అంశంగా భావిస్తున్నారు. ఈ బాండ్ విధానం కింద వచ్చే ప్రయాణికులు కమర్షియల్ విమానాల ద్వారానే అమెరికాకు వెళ్లాలి. వీసా నిబంధనలను పాటించి గడువు ముగిసేలోపు స్వదేశానికి తిరిగి వస్తే బాండ్ మొత్తాన్ని పూర్తిగా తిరిగి చెల్లిస్తారు. అయితే వీసా గడువు దాటినా అమెరికాలోనే ఉంటే, ఆ బాండ్ మొత్తాన్ని అమెరికా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది.

# బ్యాంకుల్లో 11,403 క్లర్క్ పోస్టులు.. ఐబీపీఎస్ నోటిఫికేషన్ విడుదల

**న్యూఢిల్లీ, ఆగస్టు 1:** ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో క్లర్క్ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు శుభవార్త. ప్రభుత్వ రంగంలోని 11 ప్రముఖ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న 11,403 క్లర్క్ (కస్టమర్ సర్వీస్ అసోసియేట్) పోస్టుల భర్తీకి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నియామకాలు 2027-28 నియామక ప్రక్రియలో భాగంగా చేపట్టనున్నట్లు తెలిపింది. తెలంగాణలో 191, ఆంధ్రప్రదేశ్‌లో 186 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఈ ఏడాది ఆగస్టు 1 నాటికి అభ్యర్థుల వయస్సు 20 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది. అభ్యర్థులు ఒక రాష్ట్రం లేదా కేంద్ర పాలిత ప్రాంతానికి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత రాష్ట్ర స్థానిక భాషపై ప్రావీణ్యంతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి. దరఖాస్తు ఫీజు జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.850 కాగా, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.175గా నిర్ణయించారు. ఇంటర్నెట్ బ్యాంకింగ్, డెబిట్ లేదా క్రెడిట్ కార్డు, భీమ్ యూపీఐ తదితర ఆన్‌లైన్ విధానాల ద్వారా ఫీజు చెల్లించవచ్చు. చెల్లించిన ఫీజు తిరిగి చెల్లించబడదని ఐబీపీఎస్ స్పష్టం చేసింది.

# జులై 31 నాటికి 5.9 కోట్ల ఐటీఆర్‌లు దాఖలు

**న్యూ ఢిల్లీ, ఆగస్టు 1 (జనంసాక్షి) :** ప్రస్తుత మదింపు సంవత్సరానికి ఆదాయపు పన్ను రిటర్నుల (ఐటీఆర్) దాఖలు జోరుగా సాగుతోంది. జులై 31 నాటికి 2026-27 మదింపు సంవత్సరానికి 5.9 కోట్లకు పైగా ఐటీఆర్‌లు దాఖలైనట్లు ఆదాయపు పన్ను శాఖ వెల్లడించింది. గత మదింపు సంవత్సరంలో గడువు పొడిగించడంతో సెప్టెంబర్ 16 నాటికి 7.3 కోట్లకు పైగా రిటర్నులు దాఖలైనట్లు తెలిపింది. ఐటీఆర్-1, ఐటీఆర్-2 దాఖలు చేసేందుకు అదనపు ఆలస్య రుసుము లేకుండా జులై 31ను చివరి తేదీగా నిర్ణయించారు. వార్షిక ఆదాయం రూ.50 లక్షలలోపు ఉండి, రెండు సొంత ఇళ్ల నుంచి ఆదాయం, అలాగే రూ.5 వేలలోపు వ్యవసాయ ఆదాయం ఉన్న వారికి ఐటీఆర్-1 వర్తిస్తుంది. అదే వార్షిక ఆదాయం రూ.50 లక్షలలోపు ఉన్నప్పటికీ, రెండు కంటే ఎక్కువ ఇళ్లు, స్టాక్ మార్కెట్ లేదా మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడుల వల్ల స్వల్పకాలిక మూలధన లాభాలు, లేదా విదేశీ ప్రయాణాల కోసం రూ.2 లక్షలకు మించి ఖర్చు చేసిన వారు ఐటీఆర్-2 దాఖలు చేయాల్సి ఉంటుంది.


### గడువు దాటినా దాఖలు చేసుకోవచ్చు

నిర్ణీత గడువులోగా రిటర్నులు దాఖలు చేయకపోయినా అవకాశం పూర్తిగా కోల్పోయినట్లుకాదు. ఆదాయపు పన్ను శాఖ ఆలస్య రుసుము తో డిసెంబర్ 31 వరకు రిటర్నులు దాఖలు చేసుకునే వెసులుబాటు కల్పించింది. వార్షిక ఆదాయం రూ.5 లక్షల వరకు ఉన్నవారు రూ.1,000 ఆలస్య రుసుము చెల్లించి రిటర్ను దాఖలు చేయవచ్చు. రూ.5 లక్షలకు మించిన ఆదాయం ఉన్నవారు రూ.5,000 ఆలస్య రుసుము చెల్లించి రిటర్నులు సమర్పించాల్సి ఉంటుంది.

# కీవ్‌పై రష్యా బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో భీకర దాడి

## 9 మంది మృతి.. 22 మందికి గాయాలు

**కీవ్, ఆగస్టు 1:** ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి భారీ స్థాయిలో దాడులకు పాల్పడింది. శనివారం తెల్లవారుజామున ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై బాలిస్టిక్ క్షిపణులు, దీర్ఘశ్రేణి డ్రోన్లతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో ఇప్పటివరకు 9 మంది మృతిచెందగా, 22 మంది గాయపడినట్లు ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. పలుచోట్ల నివాస భవనాలు ధ్వంసమవగా, మంటలు చెలరేగి భారీ ఆస్తినష్టం సంభవించింది. కీవ్‌లోని సోలోమియాన్స్కీ జిల్లాలో ఐదు అంతస్తుల అపార్ట్‌మెంట్ భవనం క్షిపణి దాడిలో తీవ్రంగా దెబ్బతింది. భవనంలో చిక్కుకున్న 35 మందిని సహాయక బృందాలు సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. దర్నిస్టికి జిల్లాలో జరిగిన మరో దాడిలో ఏడుగురు మృతిచెందగా, 14 మంది గాయపడ్డారు. పలు ఇళ్లు కూలిపోవడంతో పాటు మంటలు వ్యాపించి సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ దాడులు కీవ్ సమీపంలోని ఉక్రెయిన్ సైనిక పారిశ్రామిక కేంద్రాలు, లాజిస్టిక్ హబ్‌లను లక్ష్యంగా చేసుకుని నిర్వహించినట్లు రష్యా రక్షణ శాఖ ప్రకటించింది. అధిక కచ్చితత్వం గల భూమి, సముద్ర ఆధారిత క్షిపణులు, దీర్ఘశ్రేణి డ్రోన్లను ఉపయోగించినట్లు తెలిపింది. క్షిపణులు, డ్రోన్లు, రాడార్ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్ యుద్ధ పరికరాల ఉత్పత్తి, నిల్వ కేంద్రాలపై దాడులు జరిపినట్లు పేర్కొంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో రాజధాని కీవ్‌పై మళ్లీ జరిగిన ఈ భారీ దాడి అంతర్జాతీయంగా ఆందోళనకు దారితీసింది.



# మొరాకో-స్పెయిన్ సరిహద్దులో ఉద్రిక్తత

## వెనుదిరుగుతున్న వేలాది మంది వలసదారులు

**సెయూటా, ఆగస్టు 1 (జనంసాక్షి) :** మొరాకో-స్పెయిన్ సరిహద్దులో నెలకొన్న పరిస్థితులు అంతర్జాతీయంగా చర్చనీయాంశమయ్యాయి. స్పెయిన్ ఆధీనంలోని సెయూటా సరిహద్దులోకి భారీ సంఖ్యలో ప్రవేశించేందుకు ప్రయత్నించిన మొరాకో వలసదారులు ఇప్పుడు స్వచ్ఛందంగా వెనక్కి వెళ్లడం ఆసక్తికరంగా మారింది. ఆఫ్రికా ఖండం నుంచి ఐరోపా దేశాలకు చేరేందుకు ఉన్న ఏకైక భూ సరిహద్దు సెయూటా కావడంతో, వేలాది మంది వలసదారులు ఈ మార్గాన్ని ఆశ్రయించారు. సముద్రాన్ని ఈదుకుంటూ, సరిహద్దు లను దాటుతూ 60 వేల మందికిపైగా మొరాకో నుంచి సెయూటా వైపు చేరేందుకు ప్రయత్నించినట్లు సమాచారం.

అయితే రెండు రోజుల పాటు కొనసాగిన ఈ ప్రయత్నాలను స్పెయిన్ భద్రతా బలగాలు కఠినంగా అడ్డుకున్నాయి. వలసదారులను చెదరగొట్టేందుకు బాష్పవాయువు, జలఫిరంగులు ప్రయోగించడంతో పాటు హెచ్చరిక కాల్పులు కూడా జరిపినట్లు తెలుస్తోంది. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు మొరాకో, స్పెయిన్ దేశాలు సరిహద్దు ప్రాంతాల్లో భారీగా భద్రతా బలగాలను మోహరించాయి. కఠిన భద్రతా చర్యలు, నియంత్రణల నేపథ్యంలో సరిహద్దు దాటేందుకు వచ్చిన వారిలో పలువురు తమ ప్రయత్నాన్ని విరమించుకుని స్వదేశానికి తిరుగు ప్రయాణం ప్రారంభించినట్లు సమాచారం. సెయూటా సరిహద్దు గత కొన్నేళ్లుగా ఆఫ్రికా నుంచి ఐరోపాకు అక్రమ వలసల ప్రధాన కేంద్రంగా కొనసాగుతోంది. ఈ తాజా పరిణామం అంతర్జాతీయ వలస సంక్షోభంపై మరోసారి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది.

# ప్రముఖ నేపాలీ పర్వతారోహకుడు నిర్మల్ పుర్జా మృతి

- బ్రాడ్ పీక్ యాత్రలో విషాదం
- పది మంది బృందంపై మంచు విరుచుకుపాటు
- మరో ఐదుగురు మృతి.. గాలింపు కొనసాగింపు



**ఇస్లామాబాద్, ఆగస్టు 1:** ప్రపంచ ప్రఖ్యాత నేపాలీ పర్వతారోహకుడు నిర్మల్ నిమ్స్‌దాయ్ పుర్జా (43) పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని కారాకోరం పర్వత శ్రేణిలో హిమపాతానికి బలైనట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. బ్రాడ్ పీక్ శిఖరాన్ని అధిరోహించేందుకు బయల్దేరిన పది మంది అంతర్జాతీయ బృందానికి ఆయన నాయకత్వం వహిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం శిఖరారోహణ సమయంలో భారీ హిమపాతం సంభవించడంతో బృంద సభ్యులు మంచులో చిక్కుకుపోయారు. హిమపాతం అనంతరం బృంద సభ్యులతో ఎలాంటి సమాచార సంబంధాలు లేకపోవడంతో సహాయక చర్యలు ప్రారంభించారు. పాకిస్తాన్ ఆల్పైన్ క్లబ్ ఆధ్వర్యంలో హెలికాప్టర్ల సహాయంతో గాలింపు చేపట్టగా, నిర్మల్ పుర్జాతో పాటు మరో ఐదుగురు మృతిచెందినట్లు అధికారులు ధృవీకరించారు. వారి మృతదేహాలను స్వాధీనం చేసుకోగా, మిగిలిన సభ్యుల కోసం గాలింపు కొనసాగుతోంది. పది మంది సభ్యుల బృందంలో ఆరుగురు నేపాల్‌కు చెందినవారు. మిగిలిన వారిలో పాకిస్తాన్, ఒమన్, అమెరికా, చైనా దేశాలకు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. పాకిస్తాన్‌కు చెందిన ప్రముఖ స్కీయర్ సోహైల్ సాఖీ కూడా ఈ యాత్రలో పాల్గొన్నారు. నిర్మల్ పుర్జా ప్రపంచంలోని అత్యంత విజయవంతమైన పర్వతారోహకుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. బ్రిటిష్ స్పెషల్ ఫోర్స్‌లో సేవలందించిన ఆయన, 2019లో ప్రపంచంలోని 8,000 మీటర్లకు పైబడిన 14 అత్యున్నత శిఖరాలను కేవలం ఆరు నెలల్లోనే అధిరోహించి అరుదైన ప్రపంచ రికార్డు నెలకొల్పారు. ఆయన సాహస గాథ ఆధారంగా నెట్‌ఫ్లిక్స్ డాక్యుమెంటరీ కూడా రూపొందించింది. 2012లో ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌ను విజయవంతంగా అధిరోహించి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఆయన మృతితో ప్రపంచ పర్వతారోహణ రంగం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.

# ఐదేళ్లలో ఇల్లు కట్టకపోతే ప్లాట్ వెనక్కి!

- ఖాళీ స్థలాలపై కర్ణాటక సర్కార్ కఠిన నిర్ణయం
- బెంగళూరులో పారిశుధ్యం, భూవినియోగంపై కొత్త నిబంధనలు
- అసలు మొత్తాన్ని వడ్డీతో తిరిగి చెల్లిస్తామని ప్రభుత్వం స్పష్టం
- చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని డీకే శివకుమార్



**బెంగళూరు, ఆగస్టు 1 (జనంసాక్షి) :** బెంగళూరులో ప్రభుత్వ సంస్థల ద్వారా కేటాయించిన ప్లాట్లను ఐదేళ్లలోపు అభివృద్ధి చేయకపోతే వాటిని తిరిగి స్వాధీనం చేసుకుంటామని కర్ణాటక ప్రభుత్వం స్పష్టం చేసింది. ఖాళీ స్థలాలు చెత్తకుప్పలుగా మారడం, పారిశుధ్య సమస్యలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. బెంగళూరు డెవలప్‌మెంట్ అథారిటీ (బీడీఏ), పూర్వపు సిటీ ఇంప్రూవ్‌మెంట్ ట్రస్ట్ బోర్డ్ (సీఐటీబీ), సహకార సంఘాలు తదితర ప్రభుత్వ సంస్థల ద్వారా ప్లాట్లు పొందిన వారు ఐదేళ్లలో ఇల్లు నిర్మించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆ గడువులో నిర్మాణం చేపట్టని పక్షంలో ప్లాట్లను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంటుందని, కేటాయింపుదారులు చెల్లించిన అసలు మొత్తాన్ని వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని వెల్లడించారు.

హెబ్బాల్ జంక్షన్ సమీపంలో "వ్యర్థాల నుండి స్వేచ్ఛ" పారిశుధ్య కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, దశాబ్దాలుగా ఖాళీగా ఉన్న స్థలాలు చెత్త డంపింగ్ కేంద్రాలుగా మారి నగర పరిశుభ్రతకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు 20 నుంచి 40 ఏళ్లుగా ప్లాట్లను ఖాళీగానే ఉంచి కనీసం ప్రహరీ గోడ కూడా నిర్మించకపోవడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి యజమాని పౌర బాధ్యత అని పేర్కొన్న ఆయన, ఇకపై నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోమన్నారు. అవసరమైతే రెట్టింపు ఆస్తి పన్ను విధించడం లేదా ప్లాట్లను తిరిగి స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బెంగళూరును చెత్త రహిత, పరిశుభ్రమైన, హరిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని డీకే శివకుమార్ తెలిపారు. ఈ లక్ష్య సాధనలో ప్రజలు, వ్యాపారులు, ఆస్తి యజమానులు పూర్తి సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు.

# వైజాగ్ రైల్వే స్టేషన్‌కు మహర్దశ

- రూ.299 కోట్లతో కోచింగ్ యార్డ్ ఆధునీకరణకు ఆమోదం
- ఆరు కొత్త ప్లాట్‌ఫారమ్‌లు, ఆరు కొత్త రైల్వే లైన్ల ఏర్పాటు
- రైళ్ల ఆలస్యానికి చెక్.. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు
- సమయపాలన, నిర్వహణ సామర్థ్యం పెంపే లక్ష్యం




**విశాఖపట్నం, ఆగస్టు 1 (జనంసాక్షి) :**

దక్షిణ తీర రైల్వే పరిధిలోని కీలకమైన విశాఖపట్నం రైల్వే స్టేషన్‌ను ఆధునికీకరించేందుకు భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీ, రైళ్ల నిర్వహణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.299 కోట్ల అంచనా వ్యయంతో విశాఖపట్నం కోచింగ్ యార్డ్ ఆధునీకరణ ప్రాజెక్టుకు రైల్వే శాఖ అధికారిక ఆమోదం తెలిపింది. ఉత్తరాంధ్రలో అత్యంత రద్దీగా ఉండే ఈ స్టేషన్‌లో ప్రతిరోజూ సుమారు 80 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా, 113కు పైగా రైళ్ల కార్యకలాపాలు నిర్వహించబడుతున్నాయి. ప్రస్తుతం ఉన్న పాత యార్డ్ లేఅవుట్ కారణంగా రైళ్లు అనేక క్రాసింగ్‌లను దాటాల్సి రావడంతో అప్రోచ్ సిగ్నళ్ల వద్ద ఆలస్యాలు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా యార్డ్‌ను పూర్తిగా పునర్వ్యవస్థీకరించనున్నారు.

ప్రాజెక్టులో భాగంగా ఆరు కొత్త ప్లాట్‌ఫారమ్‌లు, ఆరు కొత్త రైల్వే లైన్లు నిర్మించనున్నారు. ప్రస్తుతం ఉన్న ఆరు ప్లాట్‌ఫారమ్‌లను కూడా వెడల్పు చేసి ప్రయాణికుల సౌకర్యాలకు అనుగుణంగా అభివృద్ధి చేయనున్నారు. రద్దీ ప్రాంతాల్లో ట్రాక్ వ్యవస్థను పునఃరూపకల్పన చేసి, పాత లూప్ లైన్ల స్థానంలో ఆధునిక ట్రాక్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రయాణికుల కోసం లిఫ్టులు, ఎస్కలేటర్లు, ర్యాంపులు, విశాలమైన సర్క్యులేటింగ్ ఏరియా, ఆధునిక పార్కింగ్ సదుపాయాలు కల్పించనున్నారు. తూర్పు వైపున కొత్త ప్రవేశ ద్వారం ఏర్పాటు చేయడంతో పాటు ప్యాసింజర్ రిజర్వేషన్ కౌంటర్లను అక్కడికి తరలించనున్నారు. భద్రతను మరింత బలోపేతం చేసేందుకు అత్యాధునిక ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ సిగ్నలింగ్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో రద్దీ తగ్గడంతో పాటు రైళ్ల సమయపాలన మెరుగుపడుతుందని అధికారులు భావిస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రవేశపెట్టడానికి, ప్రయాణికులకు వేగవంతమైన సేవలు అందించడానికి ఈ ఆధునీకరణ ప్రాజెక్టు కీలకంగా మారనుంది.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
02 ఆగస్ట్ 2026

# ప్రాచీన కళలను సంరక్షించుకోవాలి

**మంత్రి శ్రీధర్ బాబు పిలుపు** మంత్రి చేతుల మీదుగా సురభి సంస్థ లోగో ఆవిష్కరణ



**మంథని, ఆగస్టు 01 (జనంసాక్షి) :** 140 సంవత్సరాల ప్రాచీన కళ "సురభి" నుండి మరో సంచార సంస్థ, శ్రీ లక్ష్మి నారసింహ సాయి వేంకటేశ్వర నాట్యమండలి సురభి సంస్థ లోగోను శనివారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాచీన కళ్ళను సంరక్షించుకోవలసిన బాధ్యత మనపై ఉందని అన్నారు. 140 సంవత్సరాల చరిత్ర కలిగిన సురభి సంస్థ లోగో ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మంథని ప్రముఖులు శ్రీ సీతారామ సేవా సదన్ అధ్యక్షులు, మంథని భారీ అసోసియేషన్ అధ్యక్షులు కె వి ఎల్ ఎన్ (కర్ని ) హరిబాబు మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సయ్యేందర్ రెడ్డి, మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తోట్ల తిరుపతి యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాంచంద్రరావు, సంస్థ వ్యవస్థాపకుడు సురభి వెంకటేష్ ప్రసాద్, సింగరేణి రిటైర్డ్ డీజీఎమ్ లక్ష్మీ నారాయణ, వంగ రాజ సమ్మయ్య, సదాసయ సభ్యులు కొండ సమ్మన్న, శశి భూషణ్ కాచే తో పాటు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# యువ ఇంజనీర్లకు నాగుల మల్లయ్య పురస్కారం



**సిరిసిల్ల టౌన్ ఆగస్టు 1 (జనంసాక్షి)** అంతర్జాతీయ స్థాయిలో అంతరిక్షరంగ యవనికలో మెరిసిన సిరిసిల్ల యువతేజాలైన అడుప సంతోష్ కుమార్, అడుప కిరణ్, బొమ్మ దేవి నాగరాజులు నాగుల మల్లయ్య పురస్కారానికి ఎంపికైనట్లు పురస్కార కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా పురస్కార కమిటీ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, కన్వీనర్లు ఎం,డి,సలీం నాగుల సంతోష్, జగన్ గౌడ్ లు మాట్లాడుతూ సిరిసిల్లకు చెందిన యువతేజాలు ఒకే కుటుంబానికి చెందినవారు కావడం గర్వకారణమని, ఈ యువతేజాలు జూలైలో శ్రీహరికోట సార్ కేంద్రం నుంచి నింగిలోకి విజయ విహారం చేస్తూ "విక్రమ్ వన్" ఆర్బిటాల్ వాహకం ప్రయోగంలో పాల్గొని కీలకపాత్ర వహించారన్నారు. యువ ఇంజనీర్ లైన ముగ్గురికి నాగుల మల్లయ్య పురస్కారాన్ని ఈ నెల 4వ తేదీ మంగళవారం రోజున స్థానిక మాన్య ఫంక్షన్ హాల్ లో అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్, ఎస్పీ మహేష్, బి,గీతలతో పాటు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

# ఎస్సారెస్పీలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరిస్తాం

**ఎస్సారెస్పీని సందర్శించిన మంత్రులు, ఎమ్మెల్యేలు • వరద నీటి చేరికపై ప్రాజెక్టు అధికారులతో సమీక్ష**



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 01 (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం పోచంపాడ్ లో గల శ్రీరాంసాగర్ రిజర్వాయర్ ను శనివారం రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐ.టీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, మైనింగ్, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, కలెక్టర్ భవేష్ మిశ్రా, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తదితరులు జిల్లా ఉన్నతాధికారులతో కలిసి సందర్శించారు. ఏకధాటిగా కురిసిన భారీ వర్షాలతో ఎగువ ప్రాంతం నుండి ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్న వరద ప్రవాహాన్ని (ఇన్ ఫ్లో) పరిశీలించారు. రిజర్వాయర్లో నీటి మట్టాన్ని పరిశీలించి ప్రాజెక్టుకు చెందిన అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎగువన గల గైక్వాడ్, విష్ణుపురి ప్రాజెక్టులు, బాలేగాం, బాబ్లీ బ్యారేజీలతో పాటు కడెం తదితర ప్రాజెక్టుల మిగులు జలాలు గోదావరి ద్వారా వచ్చి చేరుతుండటంతో ఎస్సారెస్పీలో నీటి మట్టం పెరిగిందని అధికారులు మంత్రుల దృష్టికి తెచ్చారు. ఇప్పటికిప్పుడు వర్షాలు నిలిచిపోయినా, మరో 48 గంటల వరకు వరద నీరు ఇన్ ఫ్లో రూపంలో వస్తుందని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్సారెస్పీ పూర్తి స్థాయి నీటి మట్టం1091.00 అడుగులు, 80 టీఎంసిలకు గాను, ప్రస్తుతం 1072.30 అడుగులు, 27.376 టీఎంసిల వద్ద నీరు నిలువ ఉందని తెలిపారు. పరీవాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ఎగువ ప్రాంతాల నుండి శనివారం మధ్యాహ్నం సమయానికి 85వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోందన్నారు. ప్రాజెక్టులో నీటి నిల్వలను బట్టి ఆయకట్టు పంటలకు ఏ మేరకు నీటిని విడుదల చేయాలని అన్న విషయమై రెండు మూడు రోజులలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అయితే, గత మూడు సంవత్సరాలతో పోలిస్తే ఎస్సారెస్పీలో ఈసారి కొంత తక్కువ మేరకే నీటి నిల్వలు ఉన్నాయని, ఆయకట్టు రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. గత సంవత్సరం ఇదే సమయానికి రిజర్వాయర్ లో 38 టీఎంసీల నీరు నిలువ ఉండగా, ప్రస్తుతం 27 టీఎంసీలకే పరిమితం అయ్యిందన్నారు. నిజానికి 112 టీఎంసీల పూర్తి స్థాయి సామర్థ్యంతో నిర్మించబడిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో పూడిక చేరడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం 80 టీఎంసీలకు పడిపోయిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఎస్సారెస్పీ లో పూడిక తొలగింపు ప్రక్రియను చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, ఈ విషయమై అతి త్వరలోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని మంత్రి ఉత్తమ్ కుమార్ వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఎస్సారెస్పీ, శ్రీశైలం, నాగార్జున సాగర్ తదితర ప్రాజెక్టులు దశాబ్దాల కాలంగా చెక్కు చెదరకుండా లక్షలాది ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తున్నాయని గుర్తు చేశారు. కానీ గత ప్రభుత్వ హయాంలో 2019 లో నిర్మించిన మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం బ్యారేజీలు మాత్రం 2022 నాటికే కూలిపోయాయని మంత్రి ఉత్తమ్ కుమార్ ఆక్షేపించారు. నీటి అవసరం లేకుండానే ఎల్లంపల్లి రిజర్వాయర్ లోకి 20 టీఎంసీల నీరు వచ్చి చేరిందని అన్నారు. మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం బ్యారేజీల విషయంలో తమ ప్రభుత్వానికి ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. పై బ్యారేజీలలో నీటిని నిలువ చేసే పరిస్థితి లేదని నిపుణులు చెబుతున్నారని, అన్ని విషయాలను శాస్త్రీయంగా, సాంకేతికపరంగా సమగ్ర పరిశీలన జరిపి మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం బ్యారేజీలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ బ్యారేజీల విషయంలో తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఇటీవల ఢిల్లీలో అత్యున్నత స్థాయిలో జరిగిన నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ, కేంద్ర జల సంఘం సమావేశాల్లోనూ ఏకీభవించడం జరిగిందని మంత్రి తెలిపారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, గత ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలతో ప్రజలపై ఎనలేని భారం మోపిందని ఆక్షేపించారు. మేడిగడ్డ పంప్ హౌజ్ ల ద్వారా గత ప్రభుత్వం 60 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే ఒక్క కరెంట్ బిల్లు రూపంలోనే 3వేల కోట్ల రూపాయల ఛార్జీలు అయ్యాయని అన్నారు. పంప్ హౌజ్ ల ద్వారా నీటిని ఎత్తిపోస్తే బ్యారేజీలను ఎందుకు నిర్మించారని ప్రశ్నించారు. అసంబద్ధ నిర్ణయాలతో ప్రజాధనం వృథా చేసిన వారే, ప్రస్తుతం తమ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎస్సారెస్పీ సందర్శనకు వచ్చిన మంత్రులకు కలెక్టర్ భవేష్ మిశ్రా, సీ.పీ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ భుజంగరావు, ఎస్సారెస్పీ సీ.ఈ సునితాదేవి తదితరులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మాజీ చైర్మన్ నగేష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ మాజీ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# జూలైలో బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలు వెల్లడించిన జీఎంలు




**రామగిరి జనం సాక్షి, ఆగస్టు 1:** జూలై నెల బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు శనివారం నిర్వహించిన జీఎం కార్యక్రమంలోని విలేకరుల సమావేశంలో వెల్లడించారు. రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ మాట్లాడుతూ, జూలై నెలలో ఏరియాకు నిర్దేశించిన 2.30 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 1.95 లక్షల టన్నులు (85 శాతం) ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. అలాగే కంపెనీ షావల్స్ ద్వారా ఆఫ్‌లోడింగ్‌కు నిర్దేశించిన 21 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ (మట్టి) వెలికితీత లక్ష్యానికి గాను 21.06 లక్షల క్యూబిక్ మీటర్లు (100 శాతం) సాధించినట్లు పేర్కొన్నారు. ఇదే కాలంలో 4.68 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు వెల్లడించారు. గనులవారీగా ఉత్పత్తి వివరాలను తెలియజేస్తూ, ఓసీపీ-1 గనికి నిర్దేశించిన 0.30 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 1.18 లక్షల టన్నులు (394 శాతం) ఉత్పత్తి చేయగా, ఓసీపీ-2 గనికి నిర్దేశించిన 2 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 0.76 లక్షల టన్నులు (38 శాతం) మాత్రమే ఉత్పత్తి చేసినట్లు చెప్పారు. జూలై నెలలో అధిక వర్షాల కారణంగా బొగ్గు ఉత్పత్తి కొంత మేర ప్రభావితమైందని ఆయన తెలిపారు. వర్షాకాలంలో భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ, రాబోయే రోజుల్లో ఉత్పత్తి, రవాణా లక్ష్యాలను సాధించేందుకు ఉద్యోగులందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అనంతరం అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు మాట్లాడుతూ, అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టుకు జూలై నెలలో నిర్దేశించిన 15,300 టన్నుల లక్ష్యానికి గాను 15,777 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. ప్రస్తుతం నాలుగో ప్యానల్ తయారీ పనులు కొనసాగుతున్నాయని, త్వరలో వాటిని పూర్తి చేసి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను భద్రతతో సాధించేందుకు ఉద్యోగులందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్వోటూజీఎం ఎం. రామ్మోహన్, ఏరియా ఇంజినీర్ ఎ. ఉదయ భాస్కర్, ఐఈ డీజీఎం బి.టి. మురళీకృష్ణ, పర్సనల్ విభాగాధిపతి బి. సుదర్శనం, డిప్యూటీ పీఎం ఎం.డి. ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# బోయినిపల్లి మిని స్టేడియం పనులకు అనుమతులివ్వాలి

క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి వినతి



**బోయినిపల్లి, ఆగస్టు 01 (జనంసాక్షి) :** బోయినిపల్లి మండల కేంద్రంలో ప్రతిపాదించిన మిని స్టేడియానికి ఆర్థిక ఆమోదం లభించిందని, త్వరితగతిన పనులు ప్రారంభించేలా అనుమతులు మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన సువీన్ యాదవ్ కోరారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సువిన్ యాదవ్ మాట్లాడుతూ మండల కేంద్రంలో మిని స్టేడియం నిర్మాణానికి నిధుల ఆమోదం లభించేలా కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మండల ప్రజలు, కాంగ్రెస్ శ్రేణుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థిక ఆమోదం లభించినందున పనులు ప్రారంభించేందుకు సంబంధిత శాఖ నుంచి అనుమతులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల మండలంలోని గ్రామీణ యువతకు, క్రీడాకారులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.

# జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో ఆదర్శ పాఠశాలకు 1 బంగారు పతకం,6 కాంస్య పతకాలు

• బంగారు పతకం సాధించిన క్రీడాకారుడికి రాష్ట్రస్థాయికి ఎంపిక



**గాంధారి (జనంసాక్షి) :** కామారెడ్డి జిల్లా ప్రాథమిక క్రీడల పోటీలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నాడు ఇందిర గాంధీ స్టేడియం లో ప్రారంభమై శు క్రవారం ముగిసాయి. అయితే గాంధారి మండల కేంద్రానికి చెందిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఫైఖాన్ అరవింద్ మీటర్ల రన్నింగ్ రేస్ లో అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ మహేందర్ వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో జరిగిన రన్నింగ్ రేస్ పోటీల్లో ద్వితీయ తృతీయ స్థానాలు సాధించి కాంస్య పథకాలను కూడా సాధించారని తెలిపారు. అందులో భాగంగా అండర్ 12 లో దర్బార్, గోపాల్ ద్వితీయ స్థానం పొందగా, అండర్ 16 లో అరవింద్ ద్వితీయ స్థానం పొందాడని, అండర్ 18 లో ప్రకాష్ ద్వితీయ స్థానం పొందాడని, అండర్ ప్రోటీన్ దీప్ సింగ్ తృతీయ స్థానం పొందాడని, అండర్ 18 జిప్మల్ తృతీయ స్థానం పొందాలని తెలిపారు. అంతేకాకుండా తమ పాఠశాల నుండి రాష్ట్రస్థాయికి రన్నింగ్ రేస్కు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని ప్రిన్సిపల్ అన్నారు. ఈ విషయంలో కృషి చేసిన విద్యార్థులకు వారికి శిక్షణ అందించిన పి ఈ టి కి విద్యార్థులు తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

# హైకోర్టు న్యాయమూర్తికి స్వాగతం పలికిన జిల్లా అధికారులు



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 01 (జనంసాక్షి) :** హైకోర్టు న్యాయమూర్తి,రాజన్న సిరిసిల్ల పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ తుకారాంజీ కి జిల్లా ఇంచార్జి ప్రధాన న్యాయమూర్తి,జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి బి.పుష్పలత,జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్,ఎస్పీ మహేష్ బి.గితే శనివారం స్వాగతం పలికారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయనకు సిరిసిల్ల పట్టణంలోని పంచాయతీ రాజ్ అతిథి గృహంలో పుష్పగుచ్ఛాలు అందజేసి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి రాధిక జైస్వాల్,సిరిసిల్ల, వేములవాడ సీనియర్ సివిల్ న్యాయమూర్తులు పి.లక్ష్మణాచారి,అజయ్ కుమార్ జాదవ్,సిరిసిల్ల జూనియర్ సివిల్ జడ్జి జి.మేఘన,ఆర్డీఓ శ్రీధర్ బాబు,డీఎస్పీ నాగేంద్రచారి చారి,తహసీల్దార్ మహేష్, తదితరులు ఉన్నారు.

# గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారిపై 8 మీటర్ల కల్వర్టు నిర్మించాలని వినతి

**ఓదేడు :** ముత్తారం మండలం ఓదేడు గ్రామ పరిధిలో నిర్మాణంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారిపై 8 మీటర్ల వెడల్పుతో కల్వర్టు నిర్మించాలని గ్రామ సర్పంచ్ పోతుపెద్ది కవిత కిషన్‌రెడ్డి ప్రాజెక్టు డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వర్షాకాలంలో గ్రామ పరిధిలోని వ్యవసాయ భూముల మీదుగా, మానేరు నది వరద సమయంలో భారీగా నీరు ప్రవహిస్తుందని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం రహదారి నిర్మాణంతో సహజ నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి రైతుల పొలాల్లో వరద నీరు నిలిచిపోయే ప్రమాదం ఉందని, దీంతో పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని వివరించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని 8 మీటర్ల వెడల్పుతో కల్వర్టు నిర్మిస్తే వరద నీరు సాఫీగా ప్రవహించి వ్యవసాయ భూములు రక్షణ పొందుతాయని పేర్కొంటూ తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.

# మణుగూరు డీప్ సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలి

**ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఆర్జీ-2 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా**



**యైటింక్లైన్ కాలనీ, ఆగస్టు 1 (జనంసాక్షి) :** మణుగూరు డీప్ సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో శనివారం ఆర్జీ-2 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ కొత్త సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సెంట్రల్ జాయింట్ సెక్రటరీ గడ్డం కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ భవిష్యత్తు, తెలంగాణ రాష్ట్ర ఇంధన భద్రత, లక్షలాది కార్మిక కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మణుగూరు డీప్ సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే రాబోయే నాలుగు సంవత్సరాల్లో సింగరేణికి దక్కే అవకాశం ఉన్న 13 కొత్త మైనింగ్ ప్రాజెక్టులను వేగంగా అభివృద్ధి చేయాలని, వాటి సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. 137 సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణి సంస్థను పరిరక్షించడం తెలంగాణ ప్రజలందరి బాధ్యత అని పేర్కొన్న ఆయన, సింగరేణి బలోపేతం ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాల పెరుగుదల, ఇంధన భద్రత మరింత బలోపేతం అవుతాయని అన్నారు. ధర్నాలో ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ ఎండి అక్రమ్, 14వ డివిజన్ కార్పొరేటర్ బాదావత్ శంకర్ నాయక్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఐరెడ్డి సంపత్ రెడ్డి, ఓసీపీ-3 ప్రాజెక్టు సెక్రటరీ కొంగ రవీందర్, సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాలీగామ మల్లేష్, బ్రాంచ్ సెక్రటరీలు చిలుముల అవినాష్, వాసాల అశోక్, నాయకులు ఎట్టెం కృష్ణ, ఆవుల లక్ష్మణ్, ఇట్ల శ్రీనివాస్, మహిళా ఉద్యోగులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 20 ఎకరాల అటవీ భూమి స్వాధీనం

**గాంధారి (జనంసాక్షి) :** గాంధారి మండల కేంద్రంలోని వివిధ గ్రామాల్లో శనివారం అటవీ శాఖ క్షేత్ర అధికారి రమేష్ ఆధ్వర్యంలో గండివేట్, చద్మల్ తండా, బీరుమల్ తాండా లలో విస్తృతంగా గ్రామాల్లో అటవీ సంరక్షణ పై అవగాహన సదస్సులు నిర్వహించి అటు పై గండిపేట్ శివారులో గల 817 సర్వే నంబర్లు ప్రభుత్వ అటవీ భూమిని అక్రమంగా కబ్జాకు గురి చేసుకుని అందులో పంట ను ట్రాక్టర్ జెసిబి సహాయంతో పంట దున్ని వేయడం జరిగిందని అటవీ క్షేత్రాధికారి రమేష్ వెల్లడించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఇటీవల ఆక్రమణకు గురి అయినటువంటి అటవీ భూములను స్వాధీనం చేసుకుంటున్నామని అటవీలో చెట్లు నరికితే భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతేకాకుండా అటవీ భూమిని ఆక్రమించి పంటను వేసిన భూమిలో పెద్ద పెద్ద కందకాలు తవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.





# విజిబుల్ పోలీసింగ్‌తో నేరాలకు అడ్డుకట్ట

**జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**

**వేములవాడ రూరల్, ఆగస్టు 01 (జనంసాక్షి) :** నేరాల నియంత్రణే లక్ష్యంగా గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రజలకు పోలీస్ సేవలను వేగంగా అందుబాటులోకి తీసుకురావాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అధికారులను ఆదేశించారు. శనివారం వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించి, లాఠీ డ్రిల్, ఫుట్ డ్రిల్‌ను పరిశీలించి అభినందించారు. అనంతరం స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, పెట్రోలింగ్ విధానాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మాదకద్రవ్యాల నివారణ, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై యువతకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. 'నేను సైతం' ద్వారా గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ వెంకట్రాజం తదితరులు పాల్గొన్నారు.



# 12 ఏళ్ల నిరీక్షణకు తెర

## రాజీవ్‌గాంధీనగర్ బస్తీలో రేషన్ దుకాణం



**అల్వాల్, ఆగస్టు 1(జనంసాక్షి):** వెంకటాపురం డివిజన్ పరిధిలోని కానాజీగూడ రాజీవ్‌గాంధీనగర్ బస్తీలో నూతన రేషన్ దుకాణాన్ని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు. దీంతో దాదాపు 12 ఏళ్లుగా స్థానికులు ఎదురుచూస్తున్న డిమాండ్ నెరవేరింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ, బస్తీ ప్రజల విజ్ఞప్తి మేరకు పౌర సరఫరాల శాఖ అధికారులతో సమన్వయం చేసి రేషన్ దుకాణాన్ని మంజూరు చేయించినట్లు తెలిపారు. ఇంతకాలం రేషన్ సరుకుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు ఇకపై తొలగిపోతాయని, అర్హులైన కుటుంబాలకు బియ్యం, గోధుమలు, పంచదార తదితర నిత్యావసర సరుకులు స్థానికంగానే అందనున్నాయని చెప్పారు. రేషన్ దుకాణం ప్రారంభం కావడంతో బస్తీవాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సబితా అనిల్ కిషోర్ గౌడ్, సీనియర్ నాయకుడు సయ్యద్ మోసిన్, రేషన్ డీలర్ సంజీవరావు, అనిల్ కిషోర్ గౌడ్, శ్రీధర్ గౌడ్, డోలి రమేష్, తాజుద్దీన్, సురేష్, వీరేశం, మహమూద్, దేవేందర్, పవన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో ఓ రైతు ఉరేసుకుని ఆత్మహత్య

## ఆకునూరు గ్రామంలో విషాదం



**చేర్యాల (జనంసాక్షి) ఆగస్టు 01 :** అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆకునూరు గ్రామంలో విషాదం నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకునూరు గ్రామానికి చెందిన కడుదూరి రాములు (64) అనే వ్యక్తి తన సొంత నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రాములు, అదే మనస్తాపంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గూడ అపూర్వ రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

# ఆపరేషన్ ముస్కాన్ 125 మంది చిన్నారులకు రక్షణ

## అన్ని శాఖల అధికారులతో సమన్వయ ఆపరేషన్ ముస్కాన్ : వికారాబాద్ ఎస్పీ స్నేహమేహ్రా



**వికారాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 1 (జనంసాక్షి) :** ఆపరేషన్ ముస్కాన్--XII ద్వారా 125 మంది చిన్నారుల రక్షణ కల్పించినట్లు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఒక ప్రకటనలో తెలియజేశారు. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్నీ శాఖల సమన్వయం తో ఆపరేషన్ ముస్కాన్--శ×× కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం జరిగింది. బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, భిక్షాటన, విద్యకు దూరమైన చిన్నారులను గుర్తించి రక్షించేందుకు జిల్లా పోలీసులు సంబంధిత శాఖలతో సమన్వయంగా విస్తృత చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, గత నెల మొదటి నుండి ఇప్పటివరకు వరకు జిల్లాలో మొత్తం 125 మంది చిన్నారులను రక్షించినట్లు తెలిపారు. వీరిలో 116 మంది బాలురు, 9 మంది బాలికలు ఉన్నారు. రక్షించబడిన చిన్నారుల్లో 97 మంది బాల కార్మికులు, 26 మంది చదువు మానేసిన (డ్రాప్‌ఔట్) చిన్నారులు, ఒకరు భిక్షాటనలో ఉన్న చిన్నారి, ఒక బాల్య వివాహాన్ని అడ్డుకుని సంబంధిత చిన్నారిని రక్షించినట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాలకు చెందిన 41 మంది చిన్నారులను కూడా గుర్తించి రక్షించినట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ ముస్కాన్--XIIలో భాగంగా ఇప్పటి వరకు 54 కేసులు ఎఫ్ ఐ ఆర్ లు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే రక్షించిన చిన్నారుల్లో 89 మందిని వారి తల్లిదండ్రులకు అప్పగించగా, 36 మందిని బాలల సంరక్షణ గృహాలకు తరలించినట్లు వెల్లడించారు.

జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, మాట్లాడుతూ, బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, చిన్నారుల అక్రమ రవాణా, భిక్షాటన, పిల్లలను చదువుకు దూరం చేసే చర్యలపై జిల్లా పోలీసులు నిరంతరం ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారని తెలిపారు. చిన్నారుల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, బాల కార్మికులు లేదా ప్రమాదంలో ఉన్న చిన్నారులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్--100, చైల్డ్ హెల్ప్‌లైన్--1098కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్--XIIను మరింత సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రతి చిన్నారి సురక్షితమైన, విద్యతో కూడిన భవిష్యత్తు పొందేలా అన్ని శాఖలతో కలిసి కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు.

# ఉప్పల్ నల్లచెరువు పునర్జన్మ

**చెత్త, మురుగు నుంచి జలవనంగా మారిన చరిత్ర**

**హైడ్రా చర్యలతో మారిన రూపురేఖలు**

**వర్షపు ప్రతి చుక్కను ఒడిసిపట్టుకుంటున్న చెరువు**



**ఉప్పల్ ఆగస్టు 01 ( జనం సాక్షి ):** ఒకప్పుడు చెరువు అంటే గుర్తొచ్చేది నీరు కాదు... చెత్త, దుర్వాసన, మురుగు కాలువలు, ఆక్రమణలే. ఉప్పల్ నల్లచెరువు కూడా అలాంటి దుస్థితినే ఎదుర్కొంది. నగరం వేగంగా విస్తరించే క్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల అభివృద్ధి పెరిగినా, ఈ జలాశయం మాత్రం నిర్లక్ష్యపు నీడలోకి వెళ్లిపోయింది. వర్షపు నీటిని ఒడిసిపట్టాల్సిన చెరువు.. వ్యర్థాలను మోసే ప్రాంతంగా మారిపోయింది. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఉప్పల్ నల్లచెరువు నిండుకుండలా మారింది. నీటితో కళకళలాడుతున్న చెరువు చూపరులను ఆకట్టుకుంటోంది. ఒకప్పుడు సమస్యలకు కేంద్రంగా ఉన్న ప్రాంతం.. ఇప్పుడు పర్యావరణ పరిరక్షణకు, జల సంరక్షణకు ఉదాహరణగా నిలుస్తోంది.

హైదరాబాద్‌లోని అనేక చెరువుల మాదిరిగానే ఉప్పల్ నల్లచెరువు కూడా కాలక్రమేణా అనేక సమస్యలను ఎదుర్కొంది. సహజంగా వచ్చే వరద నీటి మార్గాలు దెబ్బతినడం, చెరువులోకి మురుగు నీరు చేరడం, వ్యర్థాలు పేరుకుపోవడం, ఆక్రమణలు పెరగడం వంటి కారణాలతో చెరువు తన అసలు రూపాన్ని కోల్పోయింది. ఒకప్పుడు వర్షాకాలంలో నీటిని నిల్వ చేసుకునే ఈ చెరువు.. కొన్నేళ్లుగా వర్షపు నీటిని కూడా సరిగా స్వీకరించలేని పరిస్థితికి చేరుకుంది. ఫలితంగా భారీ వర్షాలు వచ్చినప్పుడు పరిసర ప్రాంతాల్లో నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఈ పరిస్థితిని మార్చేందుకు హైడ్రా సమగ్ర ప్రణాళికతో రంగంలోకి దిగింది. చెరువు పునరుద్ధరణను కేవలం అందంగా తీర్చిదిద్దే పనిగా కాకుండా, నగర భవిష్యత్తుకు అవసరమైన జల సంరక్షణ చర్యగా చేపట్టింది.

**ఆక్రమణల తొలగింపు.. చెరువుకు తిరిగి వచ్చిన విస్తీర్ణం**

ఉప్పల్ నల్లచెరువు పునరుద్ధరణలో ప్రధానమైన అంశం ఆక్రమణల తొలగింపు. సంవత్సరాలుగా చెరువు పరిధిలోకి వచ్చిన ఆక్రమణలను గుర్తించి చర్యలు చేపట్టారు. దాదాపు 10 ఎకరాలకు పైగా భూమిని తిరిగి చెరువు పరిధిలోకి తీసుకువచ్చారు. దీంతో చెరువు విస్తీర్ణం సుమారు 70 ఎకరాలకు చేరుకుంది. నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు, భవిష్యత్తులో వచ్చే భారీ వర్షాలను కూడా తట్టుకునే స్థాయికి చెరువు బలపడుతోంది. "చెరువును కాపాడితే నగరాన్ని కాపాడినట్లే" అనే భావనకు అనుగుణంగా ఈ పునరుద్ధరణ కొనసాగుతోంది.

# తల్లి పాలే శిశువుకు తొలి టీకా

**ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయాలి**

**అంగన్వాడీ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు విస్తృత అవగాహన కల్పించాలి : మంత్రి సీతక్క**



**హైదరాబాద్, ఆగస్టు 1 :** ప్రపంచ తల్లి పాల వారోత్సవాల (ఆగస్టు 1-7) సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రతి తల్లి, ప్రతి కుటుంబానికి తల్లిపాల ప్రాముఖ్యతను చేరవేయాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. తల్లి పాలు ప్రతి శిశువుకు తొలి హక్కు, ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ పోషకాహారమని మంత్రి పేర్కొన్నారు. పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు శిశువుకు తొలి రోగనిరోధక టీకాలా పనిచేస్తాయని తెలిపారు. ప్రతి శిశువుకు పుట్టిన గంటలోపే తల్లిపాలను ప్రారంభించడం, తొలి ఆరు నెలలు కేవలం తల్లిపాలే ఇవ్వడం, అనంతరం వయస్సుకు తగిన అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్లు తల్లిపాలను కొనసాగించడం ద్వారా పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు బలమైన పునాది ఏర్పడుతుందని మంత్రి చెప్పారు. తల్లి పాల వారోత్సవాలను కేవలం అధికారిక కార్యక్రమాలుగా కాకుండా ప్రజల్లో చైతన్యం కలిగించే ఉద్యమంగా నిర్వహించాలని మంత్రి సీతక్క సూచించారు. రాష్ట్రంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, గ్రామాలు, వార్డుల్లో అవగాహన సమావేశాలు, ఇంటింటి సందర్శనలు, కమ్యూనిటీ కార్యక్రమాలు నిర్వహించి తల్లిపాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, సూపర్వైజర్లు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను సందర్శించి గర్భిణీలు, బాలింతలు, ఆరు నెలల లోపు శిశువుల తల్లులు, రెండేళ్ల లోపు పిల్లల తల్లులకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వాలని మంత్రి సూచించారు. తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగిస్తూ శాస్త్రీయ అవగాహన కల్పించాలని, కుటుంబ సభ్యులను కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని కోరారు. ప్రసవం జరిగిన ప్రతి ఆసుపత్రిలో పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు అందేలా వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని మంత్రి ఆదేశించారు. తల్లి పాల ప్రోత్సాహంలో అంగన్వాడీ వ్యవస్థ కీలక పాత్ర పోషించాలని, ప్రతి అంగన్వాడీ కేంద్రం తల్లి శిశు ఆరోగ్యానికి మార్గదర్శక కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు. పోషకాహార లోపం లేని తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి శిశువుకు ఆరోగ్యవంతమైన జీవితానికి తల్లి పాలే బలమైన పునాది అని అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయడంలో ప్రజాప్రతినిధులు, వైద్యులు, మహిళా సంఘాలు, అంగన్వాడీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, ప్రతి కుటుంబం భాగస్వాములు కావాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలు అందించేలా సమాజమంతా బాధ్యతతో ముందుకు రావాలని కోరారు.

# తృటిలో తప్పిన స్కూల్ బస్సు ప్రమాదం

## దెబ్బతిన్న వంతెనపై బస్సు నడిపిన యాజమాన్యంపై గ్రామస్తుల ఆగ్రహం



**మెదక్, మండలం ఆగస్టు 1( జనం సాక్షి) :** మెదక్ పట్టణంలోని డాన్ బాస్కో పాఠశాలకు చెందిన బస్సు శనివారం సాయంత్రం తృటిలో ప్రమాదం నుంచి బయటపడింది. ఈ ఘటనలో సుమారు 30 మంది విద్యార్థులు సురక్షితంగా బయటపడటంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం ప్రకారం.. మెదక్ పట్టణం నుంచి శివయ్యపల్లి, మక్తా భూపతిపూర్, తిమ్మానగర్, రాయల్‌పల్లి, పాతూరు గ్రామాల మీదుగా విద్యార్థులను తరలిస్తున్న పాఠశాల బస్సు మెదక్ మక్తా భూపతిపూర్ మధ్య ఉన్న పుష్పల వాగు వద్ద ప్రమాదానికి గురయ్యే పరిస్థితి ఏర్పడింది. గత ఏడాది భారీ వర్షాలకు ఈ వాగుపై ఉన్న వంతెన దెబ్బతినడంతో తాత్కాలిక మరమ్మతులు మాత్రమే చేపట్టారు. అయినప్పటికీ అదే మార్గంలో బస్సును నడపడం వల్ల బస్సు వంతెన వద్ద ఇరుక్కుపోయి ప్రమాదకర పరిస్థితి నెలకొంది. ప్రమాదాన్ని గమనించిన బస్సు డ్రైవర్ వెంటనే అప్రమత్తమై విద్యార్థులను బస్సు నుంచి దింపడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అనంతరం పాఠశాల యాజమాన్యానికి సమాచారం అందించగా, వేరే బస్సు పంపకపోవడం యంత్ర సహాయంతో బస్సును బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్ పట్టణం నుంచి కొంటూరు, వెంకటాపూర్ మీదుగా సురక్షితమైన మార్గంలో బస్సును నడపాల్సి ఉండగా, ప్రమాదకరమైన పుష్పల వాగు మార్గాన్ని ఎంచుకోవడం యాజమాన్యం నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న వంతెనపై విద్యార్థులతో కూడిన బస్సును నడపడం అత్యంత బాధ్యతారాహిత్యమని పేర్కొంటూ, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా కలెక్టర్‌ను 5 గ్రామాల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



# హైకోర్టు తీర్పుతో 556.12 ఎకరాల భూ సేకరణ నిలిపివేత

## హర్షం వ్యక్తం చేసిన రేజింతల్ భూ నిర్వాసితులు

**న్యాల్‌కల్, ఆగస్టు 01, (జనం సాక్షి) :** "జాతీయ పెట్టుబడులు - ఉత్పాదక మండలి" నింజ్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భూ సేకరణ విధానాన్ని హైకోర్టు వ్యతిరేకిస్తూ, వెంటనే భూసేకరణ ఆపివేయాలని తీర్పు వెల్లడించడం పట్ల నిమ్జ్ నిర్వాసితులు సంతోషం వ్యక్తం చేశారు. శనివారం సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ మండలం, రేజింతల్ గ్రామానికి చెందిన పలువురు భూనిర్వాసితులు హైకోర్టు తీర్పును స్వాగతిస్తూ.. గ్రామంలోని గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు చేసి టపాకాయలు కాల్చి, మిఠాయిలను పంచుతూ సంబురాన్ని జరుపుకున్నారు. 2013 భూ సేకరణ చట్టానికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణను వ్యతిరేకిస్తూ.. గత ఏడాదిన్నర క్రితం గ్రామానికి చెందిన పలువురు భూనిర్వాసితులు హైకోర్టును ఆశ్రయించారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం.. భూ నిర్వాసితులకు భూమికి బదులుగా భూమి, పునరావాసం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, న్యాయపరమైన నష్టపరిహారం, తదితర సౌకర్యాలను సమకూర్చకుండానే భూ సేకరణ చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టును ఆశ్రయించడం జరిగిందని రైతులు తెలిపారు. రేజింతల్ గ్రామంలోని 556.12 ఎకరాలను జాతీయ ఉత్పాదక మండలి ఏర్పాటు కోసం భూ సేకరణ చేపట్టకూడదని హైకోర్టు తీర్పును ఆమోదిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణను నిలిపివేయాలని.. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు నివేదికను పంపడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

# జిల్లాలో బాల్య వివాహాలు, బాల కార్మికత్వాన్ని పూర్తిగా నిర్మూలించాలి

## గద్వాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి కళ్యాణ చక్రవర్తి




**గద్వాల నడిగడ్డ,ఆగస్టు 1(జనం సాక్షి) :** పిల్లల హక్కుల పరిరక్షణ,భద్రత కల్పించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి,జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్మన్ కళ్యాణ చక్రవర్తి అన్నారు. జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో నాల్స "పిల్లలకు అనుకూల న్యాయ సేవల పథకం--2024" పై చైల్డ్ ప్రొటెక్షన్ అధికారుల కోసం శనివారం గద్వాల పట్టణంలోని అనంత ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఒక రోజు అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,నాల్సా పిల్లలకు అనుకూల న్యాయ సేవల పథకం 2024 ద్వారా ప్రతి చిన్నారికి ఉచిత న్యాయ సహాయం,పిల్లలకు అనుకూలమైన న్యాయ సేవలు అందించడం అన్నారు.అలాగే వారికి చట్టాలపై అవగాహన, అవసరమైన కౌన్సెలింగ్,రక్షణ, పునరావాసం అందించడమే లక్ష్యమన్నారు.పిల్లల గోప్యత,గౌరవం, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, సంబంధిత శాఖల సమన్వయంతో వారి శ్రేయస్సు కోసం ఈ పథకం పనిచేస్తుందని వివరించారు.పోక్సో చట్టం 2012లో మొత్తం 46 సెక్షన్లు ఉన్నాయని,ఈ చట్టం ప్రకారం 18 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి ఒక్కరూ పిల్లలుగా పరిగణించబడతారని తెలిపారు. పిల్లలను లైంగిక నేరాల నుంచి రక్షించడం,బాధితులకు న్యాయ పరిరక్షణ కల్పించడం,నేరస్థులకు కఠిన శిక్షలు విధించడమే పోక్సో చట్టం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.పాఠశాలలో విద్యార్థుల ప్రవర్తనలో అసాధారణ మార్పులు కనిపిస్తే ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలతో ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని, వేధింపులు లేదా హింసకు గురవుతున్నట్లు అనుమానం వచ్చిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు.ప్రతి విద్యార్థి భద్రత, సంక్షేమంపై ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.పాఠశాల మానేసిన పిల్లలను తిరిగి విద్యాభ్యాసంలోకి తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలని అన్నారు.పిల్లలపై జరిగే వేధింపులు,బాల్య వివాహాలు, బాల కార్మికత్వాన్ని అరికట్టేందుకు సంబంధిత అధికారులు చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని, ప్రతి చిన్నారికి సురక్షితమైన, వివక్షలేని వాతావరణం కల్పించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు.అనంతరం నాల్సా పిల్లలకు అనుకూల న్యాయ సేవల పథకం 2024,పోక్సో చట్టం, బాలల హక్కులు, బాల్య వివాహాల నివారణ,బాల కార్మిక నిర్మూలన, పిల్లల రక్షణపై అవగాహన కల్పించే లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సెషన్స్ న్యాయమూర్తి వి.శ్రీనివాస్,జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎ.నాగరాజు,జిల్లా విద్యా శాఖ అధికారి విజయ లక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సునంద, సీడీపీఓ ఆకాశ దీప్తి, ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.



# కంపుకొడుతున్న న్యాల్‌కల్ కస్తూర్బా గాంధీ గురుకులం

**న్యాల్‌కల్, ఆగస్టు 01 (జనంసాక్షి) :** అనాథలు.. దివ్యాంగులు.. వెనుకబడిన తరగతుల బాలికల విద్యాభివృద్ధి కోసం న్యాల్ కల్ లో ఏర్పాటు చేసి, కొనసాగిస్తున్న.."కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల" ఆవరణలో పరిశుభ్రత లోపించడంతో దోమలు, ఈగలు, దుర్వాసనతో కంపు కొడుతోంది. సెప్టింగ్ ట్యాంక్ ద్వారా వెదజల్లుతున్న దుర్వాసనతో బాలికలు బిక్కు బిక్కుమంటు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. దుర్వాసన, ఈగలు, దోమలతో ఎక్కడ అనారోగ్యానికి గురవుతారేమో నని బాలికలు, ఉపాధ్యాయులు, సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, ఇతరత్రా అత్యవసర సౌకర్యాల ఏర్పాటు కోసం పుష్కలంగా నిధులున్న సంవత్సరాల తరబడి అధికారులు, ప్రజా ప్రతినిధులు బాధ్యతారహితంగా వ్యవహరించడం పట్ల గురుకులం పోషకులు, బాలికలు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. న్యాల్ కల్ లోని.."కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల"లో నెలకొన్న సమస్యలపై "జనం సాక్షి" ప్రత్యేక కథనం..!

**నిధులున్న సెప్టింగ్ ట్యాంకుకు కనీస మరమ్మత్తులు కరువు**

గురుకులంలో సౌకర్యాలను సమకూర్చేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థ అధిక మొత్తంలో నిధులను మంజూరు చేసింది. 2023 - 24 గాను పీఎం శ్రీ నిధులు రూ:67లక్షలు, 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి గాను నాబార్డ్ నిధులు రూ:17లక్షలు, మహీంద్రా అండ్ మహీంద్రా స్వచ్ఛంద సంస్థ ద్వారా రూ:32లక్షలు విడుదలయ్యాయి.





మంజూరైన నిధులతో పలు పనులను చేపట్టారు. మరికొన్ని పనులు సంవత్సరాల తరబడి అసంపూర్తిగా నిలిచిపోయాయి. 1.16 కోట్ల మేరకు విడుదలైన నిధుల్లో దాదాపు రూ:32 లక్షల మేరకు నిధులు ప్రస్తుతం నిలువ (బ్యాలెన్స్) ఉన్నప్పటికిని నేటికీ కనీస మరమ్మత్తులు చేపట్ట లేకపోయారు. పలు పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో వందల సంఖ్యలో ఉన్న బాలికలు నిత్యం అవస్థలకు గురవుతున్నారు.

**దుర్వాసనతో బిక్కు బిక్కుమంటున్న బాలికలు**

గురుకులంలో 6వ తరగతి నుండి ఇంటర్ వరకు కొనసాగుతుంది. ఉన్నత పాఠశాలలో 212, ఇంటర్ లో 108 గురు బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. ఈ మేరకు 11గురు ఉపాధ్యాయ సిబ్బందితో పాటు మరో 11గురు నాన్ టీచింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వ్యక్తిగత కారణాల దృష్ట గురుకులం ప్రత్యేకాధికారిణి (ఎస్ ఓ) రుబీనా పర్వీన్ జులై 31న స్వచ్ఛందంగా విధుల నుండి తప్పుకున్నారు. ప్రస్తుతం ఇంచార్జ్ ఎస్ ఓ గా సంగీత (సీనియర్) కొనసాగుతున్నారు. గురుకుల ఆవరణలో నెలకొన్న దుర్వాసనతో వందల సంఖ్యలో ఉన్న బాలికలు అనునిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. గత ఏడాది విద్యా సంవత్సరంలో పలువురు బాలికలు అస్వస్థకు గురై సంగారెడ్డి జిల్లా ఆసుపత్రికి తరలించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం



విద్యాభివృద్ధి కోసం రూ: లక్షలు వెచ్చిస్తున్న సౌకర్యాల ఏర్పాటులో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించడం కారణంగానే బాలికలు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఎక్కడ అనారోగ్యానికి గురై ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తుందేమోనని భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలని బాలికలు, పోషకులు కోరుతున్నారు.

**ఇబ్బందులకు గురికాకుండా వెంటనే పరిశీలిస్తా**

**జిల్లా విద్యాధికారిణి రోహిణి**

న్యాల్‌కల్‌లోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలను అతి త్వరలోనే పరిశీలిస్తాను. గురుకులంలో నెలకొన్న సమస్యలను.. బాలికలు, సిబ్బందితో చర్చిస్తాను. బాలికలు ఎలాంటి ఇబ్బందులు, భయాందోళనలకు గురి కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటాం.



# భవిష్యత్ అవసరాలకు నీటిని నిల్వ చేయాలి

## కడెం ప్రాజెక్టును పరిశీలించిన రాష్ట్ర మంత్రుల బృందం

**కడెం ఆగస్టు 1(జనం సాక్షి) :** భవిష్యత్తు తాగునీరు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్టుల్లో నీటిని ప్రణాళికాబద్ధంగా నిల్వ చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రాజెక్టుల పరిస్థితిని సమీక్షిం చేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిలతో కూడిన మంత్రుల బృందం శనివారం కడెం ప్రాజెక్టును సందర్శించింది. ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన ఎల్ఈడీ తెరపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పూర్తి స్థాయి నీటిమట్టం (ఎఫ్ఆర్ఎల్), ప్రస్తుత ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్న నీటి పరిమాణం, ప్రస్తుత పరిస్థితులను మంత్రులకు వివరించారు. భవిష్యత్తులో తాగునీరు, సాగునీటి అవసరాలపై కూడా సమగ్ర సమాచారం అందించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం, భవిష్యత్తు నీటి అవసరా లను దృష్టిలో ఉంచుకొని నీటి నిర్వహణకు శాస్త్రీయ విధానాన్ని అనుసరించాలని సూచించారు. ప్రజలకు ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాజెక్టుల నీటిమట్టాలు, పరిస్థితులను ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా కడెం ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, నీటిమట్టం, నీటి నిల్వ సామర్థ్యం, సిల్టేషన్ సమస్యలు, నీటి పారుదల నిర్వహణపై మంత్రులకు వివరించారు. భవిష్యత్తు అవసరా లను దృష్టిలో ఉంచుకొని నీటి వినియోగాన్ని శాస్త్రీయంగా నిర్వహిస్తూ సాగునీటి అవసరాలను తీర్చేందుకు చర్యలు చేపడుతు న్నామని తెలిపారు. ప్రాజెక్టులో సిల్టేషన్ ప్రధాన సమస్యగా మారిందని, సుమారు 7.5 టీఎంసీల సామర్థ్యం కలిగిన ప్రాజెక్టులో దాదాపు 50 శాతం వరకు పూడిక పేరుకుపోయినట్లు వివరించారు. దీనివల్ల నిల్వ సామర్థ్యం తగ్గుతున్న నేపథ్యంలో సమస్య పరిష్కారానికి దీర్ఘకాలిక కార్యాచరణ రూపొంది స్తున్నామని తెలిపారు. నీటిమట్టం 674-675 మీటర్లకు చేరినప్పుడు పరిస్థితు లకు అనుగు ణంగా ప్రత్యామ్నాయ రోజుల్లో నీటి విడుదల చేపట్టే విధంగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. పూడిక సమస్యను దశలవారీగా తగ్గించి ప్రాజెక్టు నిల్వ సామ ర్థ్యాన్ని పెంచేం దుకు అవసరమైన సాంకేతిక చర్యలు చేపడుతు న్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఏఎస్పీ సాయి కిరణ్, ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డీలిమిటేషన్‌తో తమిళనాడుకు మోసం

- ప్రజాస్వామిక హక్కులు దూరం చేసే యత్నం
- విపక్షనేత రాహుల్ వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, ఆగస్ట్1 (జనంసాక్షి) :** నియోజకవర్గ పునర్విభజన బిల్లును కేంద్రం మరోసారి పార్లమెంటు ముందుకు తీసుకురానుందన్న వార్తల నడుమ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. డీలిమిటేషన్‌ను తమిళనాడు ప్రజాస్వామిక హక్కులను దూరం చేసే కుట్రగా అభివర్ణించారు. తమిళనాడును బలహీన పరిచేలా బిల్లును రూపొందించారని అన్నారు. ఈ బిల్లును వీగిపోయేలా చేయాలని జాతీయ, ప్రాంతీయ పార్టీలకు పిలుపునిచ్చారు. బిల్లుకు మద్దతు ఇవ్వడమంటే తమిళనాడుకు ద్రోహం చేయడమేనని అన్నారు. తమిళనాడు వ్యక్తులు ఎవరూ ఈ బిల్లుకు మద్దతు ఇవ్వకూడదని అన్నారు. ప్రతి వ్యక్తీ బిల్లును వ్యతిరేకించాలని అన్నారు. ప్రతి తమిళపార్టీ, జాతీయ పార్టీ బిల్లు వీగిపోయేలా చేయాలని కోరారు. ఇటీవల పశ్చిమ బెంగాల్, మహా రాష్ట్రలోని పరిణామాల నేపథ్యంలో పార్లమెంటులో ఎన్డీయే బలం పెరిగిందన్న వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్రం మరోసారి మహిళా రిజర్వేషన్, నియోజకవర్గ పునర్ విభజన బిల్లులను పాస్ చేయించుకునేందుకు ప్రయత్నించవచ్చన్న కామెంట్స్ వినిపించాయి. ఇటీవల కాంగ్రెస్‌తో విభేదాల నేపథ్యంలో డీఎంకే కూడా బిల్లు విషయంలో మెత్తబడే అవకాశం ఉందన్న వార్తలు వచ్చాయి. ఈ విషయమై ఇటీవల డీఎంకే నేత టీకేఎస్ ఈలంగోవన్ మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్‌తో పునర్ విభజనకు లంకె పెట్టి బిల్లు పాస్ చేయించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని అన్నారు. ఈ విషయంలో పలు పార్టీలు రకరకాల సూచనలు ఇచ్చాయని, అయితే, డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాల సీట్లపై ప్రభావం పడకూడదని అన్నారు.

# ఖమ్మంలో పేదల ఇండ్లు కూల్చడం అమానుషం

## మంత్రి తుమ్మల బాధ్యత వహించాలి

- కూల్చిన చోటే పేదలందరికీ ఇండ్లు నిర్మించి ఇవ్వాలి
- హైకోర్టు, సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేస్తాం
- రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఇండ్లను ముట్టడిస్తాం
- డాక్టర్ భీమ్ రావ్ యశ్వంత్ అంబేద్కర్, విశారదన్ మహారాజ్, జస్టిస్ చంద్రకుమార్ హెచ్చరిక
- ఖమ్మంలో వెలుగుమట్ల బాధితులతో భారీ ర్యాలీ




**ఖమ్మం బ్యూరో (జనంసాక్షి) :** ఖమ్మం వెలుగుమట్ల ప్రాంతంలోని భూదాన భూముల్లో గత 15 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న పేద ప్రజల ఇండ్లను కూల్చడం అత్యంత అమానుషమని, రాజ్యాంగ విరుద్ధం అని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మనవడు డాక్టర్ భీమ్ రావు యశ్వంత్ అంబేద్కర్ అన్నారు. శనివారం వెలుగుమట్ల భూదాన బాధితులతో కలిసి ఖమ్మం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ... పేదల ఇండ్లను కూల్చిన వారి కులం, బాధితులుగా మిగిలిన వారి కులం వేర్వేరు కాబట్టి ఇంతటి దుర్మార్గం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్థానిక మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నైతిక బాధ్యత వహించాలని వ్యాఖ్యానించారు. తక్షణమే ప్రభుత్వం చొరవ తీసుకొని బాధితులందరికీ న్యాయం చేయాలని వెలుగుమట్లలోనే ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ఢిల్లీలోని రాహుల్ గాంధీ ఇంటిని ముట్టడిస్తామని, తమ ఎంపీలతో పార్లమెంటులో ఈ అంశాన్ని లేవనెత్తి ఖమ్మం ఎంపీ రఘురామరెడ్డిని నిలదీస్తామని హెచ్చరించారు. అదేవిధంగా రాష్ట్రపతిని కలిసి పేదల ఇండ్లను కూల్చిన ఘటనపై ఫిర్యాదు చేస్తామన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా దుర్మార్గంగా ఇండ్లను కూల్చిన ప్రజాప్రతినిధులను అధికారులను సస్పెండ్ చేసి వారి నుంచే నష్టపరిహారం వసూలు చేసే వరకు వెలుగుమట్ల బాధితులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

### భూ బకాసురుల కోసమే : జస్టిస్ చంద్రకుమార్

ఖమ్మంలోని భూ బకాసురుల కోసమే వెలుగుమట్లలో నివాసం ఉంటున్న పేదలను బలవంతంగా నిరాశ్రయులను చేశారని జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. అనేక ఆందోళనల ఫలితలంగానే ప్రభుత్వం దిగివచ్చి సగం మందికి ఇండ్ల స్థలాలు ఇండ్లు మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే తాను బాధితులకు న్యాయపరమైన మద్దతు ఇస్తున్నానని తెలిపారు. మిగిలిపోయిన పేదలందరికీ వెలుగుమట్లలోని ఇండ్లు ఇవ్వకపోతే ఇక్కడి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు అందరిపై హైకోర్టు సుప్రీంకోర్టులో కేసులు వేస్తామని హెచ్చరించారు. అవసరమైతే పేదల పక్షాన ఆమరణ నిరాహార దీక్షకు సైతం పూనుకుంటానని వ్యాఖ్యానించారు.

### ఖమ్మంలో కమ్మ కుల ఆధిపత్యం నడుస్తోంది : విశారదన్

ఖమ్మం జిల్లాలో కమ్మ కుల రాజకీయ ఆదిపత్యం నడుస్తుందని డాక్టర్ విశారదన్ మహరాజ్ ధ్వజమెత్తారు. దీనికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆజ్యం పోస్తున్నారని మండిపడ్డారు. ఆయనకు తన కులాన్ని మాత్రమే ప్రేమగా చూడడం, వారికి సౌకర్యాలు కల్పించడం మిగిలిన వర్గాల పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడం సర్వ సాధారణమని అన్నారు. వెలుగుమట్ల ఘటన మంత్రి తుమ్మల క్రూరత్వాన్ని చాటి చెప్పిందని, ఇది ఆయన రాజకీయ సమాధికి పునాదిగా మారడం ఖాయమన్నారు. తాను ఖమ్మంలో చేసిన మహాధర్నా ఫలితంగా ప్రభుత్వం దిగివచ్చిందని, దాదాపు 311 మందికి ఇండ్లను మంజూరు చేసిందన్నారు. మిగిలిపోయిన పేదలందరికీ వెలుగుమట్లలోనే ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, లేదంటే బాధితులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఇంటి వరకు పాదయాత్ర చేస్తానని హెచ్చరించారు. బీసీ, ఎస్సి, ఎస్టి రాష్ట్ర కార్యదర్శి పోడకంటి రాంబాబు మాట్లాడుతూ... అన్ని రాజకీయ పార్టీల్లోని తన సామాజిక వర్గాన్ని కలుపుకొని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేదల ఇండ్లను కూల్చాడని విమర్శించారు. ఇది ఖమ్మం జిల్లా కాదని కమ్మ దేశమని వ్యాఖ్యానించారు. ఇక్కడ 90% గా ఉన్న దళిత, బహుజనులు ఆత్మగౌరవం లేకుండా బతుకుతున్నారని దీనికి వెలుగుమట్ల ఘటన ప్రత్యక్ష తార్కానమని అన్నారు. మొత్తం 729 ఇండ్లను కూల్చామని ప్రభుత్వమే చెప్పి 311 మందికి మాత్రమే ఇండ్లను మంజూరు చేయడం సరైంది కాదన్నారు. తక్షణమే ఇండ్లు కోల్పోయిన వారందరికీ వెలుగుమట్లలోనే ఇండ్ల స్థలాల పట్టాలు ఇండ్లు మంజూరు చేయాలని లేదంటే ఖమ్మంలో మరో భూకంపాన్ని చూస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్పిఐ పార్టీ తెలంగాణ ఇంచార్జ్ మేజర్ చంద్రకాంత్, జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తోట్ల ముదిరాజ్ రాఘవేంద్ర, తెలంగాణ విటల్, కేతవరపు కృష్ణారావు, ప్రముఖ న్యాయవాది పంజాకుల లక్ష్మీనారాయణ, జేఏసీ ఖమ్మం జిల్లా నాయకత్వం, భూదాన బాధితులు, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.





# కృష్ణమ్మ ఉగ్రరూపం

- పీజేపీ 29 గేట్లు ఎత్తివేత

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 1 (జనం సాక్షి) :** జూరాల ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణా నది ఉగ్రరూపం దాల్చింది. దీంతో జూరాల ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తోంది. శనివారం ఉదయం 9 గంటలకు డ్యామ్ వద్ద నీటిమట్టం 317.98 మీటర్లకు చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 4.864 టీఎంసీ నీరు నిల్వ ఉండగా, మొత్తం సామర్థ్యం 8.571 టీఎంసీగా ఉంది. ఎగువ నుండి 1,73,000 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. అవుట్ ఫ్లో 1,77,230 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు భద్రత దృష్ట్యా అధికారులు 29 గేట్లను ఎత్తి స్పిల్ వే ద్వారా 1,38,184 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పవర్ హౌస్ ద్వారా 34,225 క్యూసెక్కులను విద్యుత్ ఉత్పత్తికి వినియోగి స్తున్నారు. జూరాల నుండి భారీగా నీటిని విడుదల చేస్తుండటంతో కృష్ణా నది పరివాహక ప్రాంతాలైన మహబూబ్ నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాల్లోని లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. నది ఒడ్డుకు ఎవరూ వెళ్లవద్దని, పశువులను, వస్తువుల ను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఎగువ నుండి వస్తున్న వరద, జూరా ల నుండి విడుదల అవుతున్న నీటితో దిగువన ఉన్న శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు భారీగా ఇన్ ఫ్లో వచ్చే అవకాశం ఉంది. దీంతో రాయలసీమ, తెలంగాణలోని కృష్ణా ఆయకట్టు రైతులకు సాగు, తాగునీటి సమస్యలు తీరనున్నాయి. వానాకాలం పంటలకు నీరందడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో సమానంగా ఉండటంతో ప్రస్తుతానికి డ్యామ్ సురక్షితంగా ఉందని అధికారులు తెలిపారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని చెప్పారు.

# చందానగర్‌లో బాలాజీ జ్యువెలరీ షాప్‌లో భారీ చోరీ





**శేరిలింగంపల్లి, ఆగస్టు 01 (జనంసాక్షి) :** చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నూకల శివశంకర్‌కు చెందిన బాలాజీ జ్యువెలరీ షాప్ లో శుక్రవారం రాత్రి కొందరు గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. చందా నగర్ పోలీసు అధికారులు వెల్లడించిన ప్రాథమిక సమాచారం ప్రకారం... చీకటిని అనువుగా మార్చుకున్న సదరు దుండగులు షాప్ వెనుక భాగంలోవున్న డోర్ ఎగ్జాస్ట్ ఫ్యాన్‌ను తొలగించి రంధ్రం పెద్దగాచేసి లోపలికి ప్రవేశిం చడం జరిగిందన్నారు. అనంతరం వెనుక గదినుండి ముందు గదికి మధ్యనున్న తలుపుకు మరో రంధ్రంచేసి ఆభరణాలు ఉన్న రూమ్ లోకి వెళ్లి షాప్‌లోని బంగారు, వెండి ఆభరణా లను భారీగా అపహరించారు. ఈ చోరీ ఘటనలో సుమారు 7 తులాల బంగారం మరియు 4 కిలోల వెండి చోరీకి గురైనట్లు పోలీసు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. సంఘటనకు సంబంధించిన సమాచారం అందుకున్న వెంటనే డిసిపి చింతమనేని శ్రీనివాస్, ఏసిపి సిహెచ్ వై. శ్రీనివాస్ కుమార్, సిసిఎస్ ఎస్‌వోటి మరియు చందానగర్ పోలీసు అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలను సేకరించడం జరిగింది. క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ నిపుణులు సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరించడంతోపాటు సిసిటివి ఫుటేజ్, సాంకేతిక ఆధారా లతోపాటు ఇతర కోణాల్లో పోలీసుల దర్యాప్తు కొనసాగిస్తున్నామని అధికారు లు మీడియాకు తెలియజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని నిందితులను త్వరితగతిన గుర్తించి అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టినట్లు అధికారులు వివరించారు.

# 2028 ఆగస్టు నాటికి ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తి

- 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తాం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**నల్గొండ, ఆగస్టు 1 (జనం సాక్షి):** 2028 ఆగస్టు నాటికి ఎస్ఎల్‌బీసీ (శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్) సొరంగ నిర్మాణాన్ని పూర్తి చేసి, నల్గొండ జిల్లాలోని నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే తన ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. రెండు రోజుల నల్గొండ జిల్లా పర్యటనలో భాగంగా శనివారం నల్గొండ, తిప్పర్తి మండలాల్లో విస్తృతంగా పర్యటించిన మంత్రి, తిప్పర్తి మండలం పజ్జూరు గ్రామంలో గ్రామస్తులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పజ్జూరు-ఎర్రగడ్డలగూడెం మధ్య రూ.30 కోట్ల వ్యయంతో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే పజ్జూరు గ్రామానికి 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ వల్ల చుట్టుపక్కల పది గ్రామాలకు విద్యుత్ సమస్యలు తీరడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని పేర్కొన్నారు. ఇందిరమ్మ గృహాలపై మాట్లాడుతూ సొంత ఇల్లు లేని ప్రతి నిరుపేదకు ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తోందన్నారు. పజ్జూరు గ్రామంలో ఇల్లు రాని అర్హుల కోసం స్థలాన్ని గుర్తించి అందరికీ ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే గ్రామానికి 30 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఎర్రగడ్డలగూడెంలో బోర్లు, డ్రైనేజీ, విద్యుత్ సమస్యలను గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకురాగా, రూ.3 కోట్లతో సబ్‌స్టేషన్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి రూ.20 లక్షలు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావంతో తాగునీరు, సాగునీరు, విద్యుత్ సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్న మంత్రి, ఎస్ఎల్‌బీసీ సొరంగం ఇప్పటికే పూర్తయి ఉంటే ఈ ప్రాంతానికి రెండు పంటలకు నీరు అందేదని అన్నారు. రైతు అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.13 వేల కోట్లతో హైబ్రిడ్ అన్యుటీ (హామ్) విధానంలో రహదారుల నిర్మాణం చేపట్టామని, మరో రూ.7 వేల కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రెండు మూడు నెలల్లో ప్రతి గూడెంకు బీటీ రోడ్లు వేస్తామని చెప్పారు. ఇండ్లూరు గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన చేసిన మంత్రి, గ్రామానికి 63 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. వెంకటాద్రిపాలెంలో ఇందిరమ్మ ఇంటిని పరిశీలించగా, మామిడాల గ్రామంలో మరో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఇండ్లూరును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దు తామని ప్రకటించారు. అంతకుముందు ఎర్రగడ్డలగూడెంలో మీడియాతో మాట్లాడిన మంత్రి, ప్రజాపాలన ద్వారా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని, నల్గొండ జిల్లాలో ఇప్పటికే రూ.60 కోట్ల వడ్డీలేని రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. అర్హులందరికీ రేషన్ కార్డులు, సన్నబియ్యం అందజేస్తున్నామని చెప్పారు. 2007లో ప్రారంభమైన ఎస్ఎల్‌బీసీ సొరంగం నిర్మాణం ప్రమాదవశాత్తు నిలిచిపోయిందని, ప్రస్తుతం అమెరికా నుంచి ప్రత్యేక బేరింగ్‌లు తెప్పించి పనులను వేగవంతం చేశామని తెలిపారు. 2028 ఆగస్టు నాటికి సొరంగాన్ని పూర్తి చేస్తామని, అది పూర్తయితే ప్రపంచంలోనే అత్యంత పొడవైన సాగునీటి సొరంగంగా నిలుస్తుందని మంత్రి వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ పూర్తయిన తర్వాత నల్గొండ జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందుతుందని, రైతుల సంక్షేమమే తన లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు.

# ఆస్పత్రుల్లో శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**సంగారెడ్డి (జనంసాక్షి) :** సంగారెడ్డి జిల్లాలో ఫీవర్ సర్వే, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ఆసుపత్రులలో శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ, అన్ని ఆసుపత్రులలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని మంత్రి వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డి లోని తన నివాసంలో ఆందోల్ నియోజకవర్గం లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు, నూతనంగా నిర్మించనున్న ప్రతిపాదిత ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు కు అవసరమైన స్థల పరిశీలనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశం లో నియోజకవర్గ పరిధిలో నూతనంగా నిర్మించనున్న లా కాలేజీ, తహసిల్దార్, పోలీస్ స్టేషన్, ఎంపీడీవో, పీహెచ్‌సీల ప్రతిపాదిత భవనాలకు స్థల సేకరణ, పరిశీలన పై రెవెన్యూ అధికారులతో మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ గారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. నియోజక వర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు, భూ భారతి కార్యక్రమం లో ప్రజలు చేసుకున్న దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయడంపై జిల్లా అదనపు కలెక్టర్ (ఎల్‌బీ) పాండు, డీఎంహెచ్‌వో డా.లలిత దేవి, సంగారెడ్డి , ఆందోల్ ఆర్డీవోలు రాజేందర్, రమేష్ కుమార్, ఆందోల్ నియోజకవర్గ పరిధి లోని తహసిల్దార్ లతో మంత్రి చర్చించారు. జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నిరంతరం అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370